30 . 11. 2025

# వెలుతురు

VELTHURU TELUGU DAILY

తెలుగు దిన పత్రిక
www.velthuru.com
velthuru Newspaper

ఆదివారం | రంగారెడ్డి , నల్లగొండ
సంపుటి :07 సంచిక : 180 , పేజీలు : 12 వెల:రూ.5/-
SRI SHANTHI PUBLICATIONS PUBLISHED FROM TELANGANA | ANDHRA PRADESH



### అన్ని గ్రామాల అభివృద్ధికి
## తన వంతుగా కృషి

- ఎమ్మెల్యే పాయల్ శంకర్ సమక్షంలో పలువురు బీజేపీ లో చేరిక

## దీక్షా దివస్ పేరుతో డ్రామాలు

- బిఆర్ఎస్ నేతలపై మండిపడ్డ సీతక్క



# వేగంగా మామునూరు విమానాశ్రయ నిర్మాణం

- ముందుగా ఏటీఆర్ విమానాలు నడపుతాం
- చురుకుగా కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ నిర్మాణ పనులు
- అమృత్ పథకం కింద వరంగల్ జిల్లాకు రూ.874 కోట్లు మంజూరు
- వరంగల్ పర్యటనలో మీడియాతో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి





**హన్మకొండ,నవంబరు29 వెలుతురు:** వరంగల్ విమానాశ్రయం నిర్మాణ పనులు వేగవంతం చేయాలని నిర్ణయించామని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి వెల్లడించారు. ఇక్కడి నుంచి ముందుగా ఏటీఆర్ విమానాలు నడపాలని భావిస్తున్నట్లు తెలిపారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి శనివారం వరంగల్‌లో పర్యటించారు. పలు అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్షించిన అనంతరం మీడియాతో మాట్లాడారు. ఆ తర్వాత పౌరుల స్పందన బట్టి మరిన్ని సర్వీసులు నడుపుతాం అన్నారు.. కాజీపేట

### పుష్పాభిషేకాన్ని
## విజయవంతం చేయండి

- మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి



**హైదరాబాద్ వెలుతురు నవంబర్ 29:** డిసెంబర్ 6న ఎస్సీ రిజర్వేషన్ పోరాట సమితి బహుజన స్టూడెంట్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించ తలపెట్టిన పుష్పాభిషేక కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రెవెన్యూ,గృహ నిర్మాణ శాఖ మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పిలుపునిచ్చారు. ఈరోజు పుష్పాభిషేక కార్యక్రమ కరపత్రాన్ని విడుదల చేసిన అనంతరం పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ పిడమర్తి రవి ఆధ్వర్యంలో చేపట్టిన భారత రాజ్యాంగ నిర్మాత భారతరత్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ వర్ధంతి రోజు 125 అడుగుల అంబేద్కర్ విగ్రహం పైన హెలికాప్టర్ ద్వారా నిర్వహించే పుష్పాభిషేకం కార్యక్రమానికి వేలాదిమందిగా తరలివచ్చి విజయవంతం చేయాలని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఉన్న కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తుందని అంబేద్కర్ గారిని వారి ఆలోచనలను గౌరవించే ప్రభుత్వం ప్రజా ప్రభుత్వమని అన్నారు. ఈ కార్యక్రమంలో బోమ్మర స్టాలిన్, బోరెల్లి సురేష్, అందే కృష్ణ, నక్క మహేష్, మాదుగుల శివ, సమ్మయ్య, భావాండ్లపల్లి నరేష్ తదితరులు పాల్గొన్నారు.

### స్లీపర్ బస్సు ప్రమాదాలపై
## ఆందోళన

- ఆ బస్సులను తక్షణం పక్కన పెట్టేయండి
- రాష్ట్రాలకు జాతీయ మానవ హక్కుల కమిషన్ ఆదేశం



### 1నుంచి పార్లమెంట్
## శీతాకాల సమావేశాలు

- రాజ్‌నాథ్ అధ్యక్షతన నేడు అఖిలపక్ష భేటీ



## శ్రీలంకను అతలాకుతలం చేసిన దిత్వా

- వరదలకు ఇప్పటికే 123మంది మృతి,
- మరికొందరి ఆచూకీ గల్లంతు
- దేశంలో అత్యవసర పరిస్థితి ప్రకటన


**కొలంబో,నవంబరు29 వెలుతురు :**

దిత్వా తుఫాను కారణంగా శ్రీలంక చిగురుటాకులా వణికింది. ఈ ఆకస్మిక వరదలు, కొండచరియలు విరిగిపడటంతో ఇప్పటి వరకు 123 మంది మరణించగా.. అనేక మంది గల్లంతయ్యారు. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. ఈ



# తెలంగాణలో రాజకీయ కోలాహలం

- ముగిసిన తొలిదశ నామినేషన్ల గడువు




**హైదరాబాద్,నవంబరు29 వెలుతురు:** తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల కోలాహలం కొనసాగుతోంది. రాష్ట్రంలో తొలి విడత పంచాయతీ ఎన్నికలకు సంబంధించిన నామినేషన్ల స్వీకరణ పక్రియ గురువారం ప్రారంభమైన విషయం తెలిసిందే. శనివారంతో మొదటి విడత పంచాయతీ ఎన్నికల నామినేషన్ల గడువు ముగిసింది. తొలి రోజే సర్పంచ్, వార్డు సభ్యుల పదవులకు అభ్యర్థుల నుంచి భారీ స్పందన లభించింది.

# డిజిటల్ అరెస్ట్ పేరుతో మోసాలు

- అప్రమత్తంగా ఉండాల్సిన తరుణం
- ఫేక్ కాల్స్ ఎత్తి సమాచారం ఇవ్వరాదు
- అనుమానం ఉటే 1930కు ఫిర్యాదు చేయాలి
- ప్రజలను అప్రమత్తం చేసిన హైదరాబాద్ సిటీ సైబర్ క్రైమ్




**హైదరాబాద్,నవంబరు29 వెలుతురు:** డిజిటల్ అరెస్ట్ పేరుతో దేశవ్యాప్తంగా పెరుగుతున్న కొత్త రకం సైబర్ మోసాల నేపథ్యంలో హైదరాబాద్ సిటీ సైబర్ క్రైమ్ యూనిట్ తాజాగా ప్రజలకు ముఖ్య హెచ్చరిక జారీ చేసింది. ఇలాంటి మోసాలు హైదరాబాద్‌లో కూడా విస్తరిస్తున్నాయి. నకిలీ పోలీస్, సీబీఐ, ఈడీ, కస్టమ్స్, లేదా కోరియర్ కంపెనీల అధికారులుగా నటిస్తూ కాల్ చేసే మోసగాళ్లు, మనీ లాండరింగ్, టెర్రరిజం, నార్కోటిక్స్ కేసులు, ట్రాఫికింగ్ వంటి తీవ్ర నేరాల్లో కేసులు నమోదయ్యాయని చెప్పి ప్రజలను భయపెట్టి డబ్బు



## దేశ సేవలో ప్రాణాలు కోల్పోయిన వారు స్మరణీయులు

### వీరనారి అవార్డుల ప్రదానోత్సవంలో సిపి సజ్జన్నార్

**హైదరాబాద్,నవంబరు29 వెలుతురు:** దేశ సేవలో ప్రాణాలు కోల్పోయిన అమరవీరుల త్యాగాలను మర్చిపోకూడదని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనార్ అన్నారు. సైనిక్‌పురి ఎంకే రావు మెమోరియల్ హాల్లో శనివారం బొండాడ గ్రూప్ ఆధ్వర్యంలో జరిగిన వీరనారి అవార్డుల ప్రదానోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా

## కెసిఆర్ ఎప్పుడు రావాలో అప్పుడే వస్తారు


- కొందరు మూర్ఖులు కనిపించడం లేదంటున్నారు
- కెసిఆర్‌ది దొంగదీక్ష అన్న వారికి ఉద్యమం ఏంతెలుసు
- కాంగ్రెస్ నేతలపై మండిపడ్డ బిఆర్ఎస్ నేత కెటిఆర్

**హైదరాబాద్,నవంబరు29 వెలుతురు:** కొందరు మూర్ఖులు కేసీఆర్ కనిపించడం లేదని అంటున్నారని.. గోడకు వేలాడదీస్తే తుపాకీ కూడా మౌనంగానే ఉంటుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. కేసీఆర్ లేకపోతే తెలంగాణ లేదని స్పష్టం చేశారు. తెలంగాణ ఉద్యమంలో పాల్గొనని వారు కేసీఆర్‌ను విమర్శిస్తున్నారని మండిపడ్డారు. పీసీసీ అధ్యక్షుడు కేసీఆర్ దీక్ష.. దొంగ దీక్ష అని మాట్లాడుతున్నారని.. అడ్డమైన మాటలు కొందరు మాట్లాడుతున్నారంటూ ఫైర్



## ఎపివైపు దూసుకొస్తున్న దిత్వా తుపాన్

- మూడురోజుల్లో భారీనుంచి అతి భారీ వర్షాలు,
- అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించిన విపత్తుల నిర్వహణ సంస్థ



**అమరావతి,నవంబరు29 వెలుతురు :**

దిత్వా తుఫాను ఆంధ్రప్రదేశ్ వైపునకు దూసుకుని వస్తోంది. దీంతో పలు జిల్లాలకు అలర్ట్ జారీ చేశారు. నైరుతి బంగాళాఖాతం ఆనుకుని ఉన్న శ్రీలంక తీరంలో దిత్వా తుఫాను ప్రభావం కొనసాగుతోందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ తెలిపారు. ప్రస్తుతానికి ఇది కారైకాల్‌కి 150 కిలోమీటర్లు, పుదుచ్చేరికి 280 కిలోమీటర్లు, చెన్నైకి 350 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతం

# రజాధాని రైతుల నుంచి డబ్బులు డిమాండ్

- సీఆర్‌డిఏ అధికారులతీరుపై మండిపడ్డ సీఎం
- కఠిన చర్యలు తీసుకుంటామని గట్టిగా హెచ్చరిక
- మూడు ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక జోన్లు
- మీడియాతో చిట్‌చాట్‌లో సీఎం చంద్రబాబు

**అమరావతి, నవంబరు29 వెలుతురు:**

రాష్ట్రంలో మూడు ప్రాంతాల అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు సీఎం చంద్రబాబు తెలిపారు. 3 ప్రాంతాల అభివృద్ధి కోసం ప్రత్యేక జోన్లు ఏర్పాటు చేస్తామన్నారు. రాజధాని రైతులంతా ఒకే గొడుగు కిందకు రావాలని పిలుపునిచ్చారు. వారు జెఏసిగా ఏర్పడి ప్రభుత్వంతో సంప్రదింపులకు సిద్దంగా ఉండాలన్నారు. ఈమేరకు సీఎం చంద్రబాబు మీడియాతో ఇష్టాగోష్ఠి సమావేశం



నిర్వహించారు. అన్ని ప్రాంతాల సమగ్రాభివృద్ధికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. రైతులంతా అమరావతి ప్రాంత అభివృద్ధి అసోసియేషన్ కిందకు రావాలని, జేఏసీగా ఏర్పడితే వారితో సంప్రదిస్తూ సమస్యలు పరిష్కరిస్తామన్నారు. క్యాపిటల్ గెయిన్స్ మినహాయింపు గురించి కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు వివరించాం. ఈ అంశంపై కేంద్రం చర్చించి నిర్ణయం తీసుకుంటుందని చెప్పారు. రాష్ట్ర పరిధిలో ఉన్న సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తాం అని చంద్రబాబు చెప్పారు.. రాజధాని రైతుల నుంచి ఎవరైనా సిబ్బంది డబ్బులడిగితే తీవ్ర పరిణామాలుంటాయని హెచ్చరించారు. భూ త్యాగాలు చేసిన రైతుల సమస్యలు పరిష్కరించాలి. ఈ విషయంలో తొలుత కొంత గ్యాప్ ఉంది. నాతో సమావేశమైన అనంతరం రైతులకు

వెలుతురు

## దీక్షా దివస్ పేరుతో డ్రామాలు

**హైదరాబాద్,నవంబరు29 వెలుతురు:**
బిఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు ఒక్కరోజే దీక్షా దివస్ చేసేవాళ్లని.. అధికారం పోయిన తర్వాత ఇప్పుడు పది రోజుల పాటు దీక్షా దివస్ పేరుతో నాటకాలు ఆడుతున్నారని మంత్రి సీతక్క విమర్శించారు. ప్రజలకు పదేళ్లలో చేసిన అభివృద్ధి ఏంటో ఈ దీక్షా దివస్‌లో చెప్పాలని డిమాండ్ చేశారు. అది చెపివుంటే ప్రజలు గమనించే వారని అన్నారు. రెండు సంవత్సరాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఎంతో చేసిందన్నారు. ఈ విజయాలను ప్రజలకు వివరించేందుకు తాము 10 రోజులపాటు కార్యక్రమాలు నిర్వహిస్తున్నా మని.. వీటిని అడ్డుకునే కుట్రతోనే దీక్షా దివస్ పేరుతో బిఆర్ఎస్ నాటకాలు ఆడుతోందని మండిపడ్డారు. తెలంగాణ వచ్చాక వందల రెట్లు లబ్ది పొందింది కేసీఆర్ కుటుంబమేనని అన్నారు. అమరులు పోయారు ..వారి కుటుంబాలు పోయాయని అన్నారు. కానీ బిఆర్ఎస్ నేతలు మాత్రం కోట్లకు పడగలెత్తారని మండిపడ్డారు. ఆ పార్టీ దగ్గర అధికారం మాత్రమే లేదు. కోట్లాది రూపాయలు ఉన్నాయి. అధికారం ఉంటేనే ప్రజల్లో ఉంటాం.. లేకపోతే బయటకే రావొద్దని ఆ పార్టీ నేతలు భావిస్తున్నారు. దీక్షా దివస్ పేరుతో చేస్తున్న డ్రామాలను తెలంగాణ ప్రజలు విశ్వసించరని మంత్రి అన్నారు. కొవిడ్‌ను ఆరోగ్యశ్రీలో చేర్చాలంటూ 2021లో ఇందిరా పార్క్ వద్ద సీతక్క దీక్ష చేపట్టారు. దీంతో ఆమెపై అప్పటి ప్రభుత్వం కేసు నమోదు చేసింది. కేసు విచారణలో భాగంగా నాంపల్లిలోని ప్రజా ప్రతినిధుల కోర్టుకు సీతక్క హాజరయ్యారు.

## ఎపివైపు దూసుకొస్తున్న దిత్వా తుపాన్

అయిందని వెల్లడించారు. గడిచిన 6 గంటల్లో 8 కిలోమీటర్ల వేగంతో తుఫాను కదులుతుందని వివరించారు. ఉత్తర వాయవ్య దిశగా కదులుతున్న తుఫాను చెన్నైకి అతి సమీపానికి వస్తుందని వివరించారు. ఈరోజు రాత్రికి తుపాను 60కిలోమిటర్ల వరకు ప్రయాణిస్తుందని చెప్పుకొచ్చారు. తీరానికి సమాంతరంగా ప్రయాణిస్తూ ఆయా ప్రాంతాలపై ప్రభావం చూపుతుందని అన్నారు. మూడు రోజుల్లో ఏపీలో కొన్నిచోట్ల భారీ, మరికొన్ని చోట్ల అతి భారీ, ఇంకొన్ని చోట్ల అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు. రెండు రోజుల వరకు తుఫాను తీరం దాటే పరిస్థితి లేదని అన్నారు. తీరం దాటకుండానే తుఫాను క్రమంగా బలహీనపడే అవకాశం ఉందని చెప్పుకొచ్చారు. ఆదివారం తెల్లవారుజామునకు తమిళనాడు, పుదుచ్చేరి, దక్షిణకోస్తాంధ్ర తీరాలకు చేరుకునే అవకాశం ఉందని చెప్పుకొచ్చారు. తుఫాను ప్రభావంతో చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడా భారీ వర్షాలు కురుస్తాయని తెలిపారు. ప్రకాశం, నెల్లూరు, కడప, అన్నమయ్య జిల్లాల్లో అక్కడక్కడ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వివరించారు. తుఫాను ప్రభావం దృష్ట్యా మత్స్యకారులు వేటకు వెళ్లరాదని సూచించారు. ఇప్పటికే వేటకు వెళ్లిన మత్స్యకారులు తిరిగి రావాలని కోరారు. మూడు రోజులపాటు మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్లొద్దని సూచించారు.

## రాజధాని రైతుల నుంచి డబ్బులు డిమాండ్

అన్నింటిపైనా స్పష్టత వచ్చింది. రాజధాని రైతులు కూడా ఆనందంగా ఉన్నారు. రెండో దశ భూ సమీకరణ ఉపయోగాలను వారికి వివరించానని అన్నారు. అమరావతి ఓ మున్సిపాలిటీగా మిగిలిపోకూడదు. ఇది మహానగరంగా మారితే వచ్చే ఫలితాలను రైతులు అర్థం చేసుకున్నారు. త్రిసభ్య కమిటీ నిరంతరం రైతులతో సంప్రదింపులు జరుపుతోంది. రాజధాని అభివృద్ధి ఇక అన్‌స్టాపబుల్. రాజధాని పరిసర ప్రాంతాల్లో లేఅవుట్ల సమస్యను త్వరలోనే పరిష్కరిస్తాం అన్నారు. గోదావరి పుష్కరాల నాటికి పోలవరం పూర్తి చేసే దిశగా కృషి చేస్తున్నాం. రాష్ట్రంలో అవినీతి నిర్మూలనకు ప్రత్యేక దృష్టి పెట్టాం. త్వరలోనే కార్యాచరణ రూపొందిస్తాం అని సీఎం చంద్రబాబు తెలిపారు. రైతులకు సంబంధించిన ప్రతి పనికి సిఆర్‌డిఏ అధికారులు డబ్బులు డిమాండ్ చేయడంపై విచారణ చేయిస్తాం అన్నారు. పనుల కోసం ప్రభుత్వ కార్యాలయానికి వెళ్లే రాజధాని రైతుల నుంచి సిబ్బంది డబ్బులు తీసుకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. భూమిని త్యాగం చేసిన రైతుల సమస్యలు పరిష్కరించకుండా డబ్బులు డిమాండ్ చేస్తారా అని మండిపడ్డారు. రాష్ట్రంలో మూడు ప్రాంతాల అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తున్నాం.. ఇందుకు అనుగుణంగా 3 ప్రాంతీయ జోన్లు ఏర్పాటు చేస్తామన్నారు. అభివృద్ధి ఏ ఒక్క ప్రాంతానికో పరిమితం కాకుండా అన్ని ప్రాంతాలు సమగ్రాభివృద్ధికి కృషి చేస్తున్నామని చెప్పుకొచ్చారు. వచ్చే ఏడాది నాటికి అమరావతి నిర్మాణం ఒక కొలిక్కి వస్తుంది.. రాజధాని ప్రాంతంలో కాకుండా మిగిలిన ప్రాంతాల్లో లేఔట్స్ కి త్వరలోనే అనుమతి ఇస్తాం.. క్యాపిటల్ గెయిన్సు కు సంబంధించి కేంద్రం నుంచి అనుమతులు రావాల్సి ఉందన్నారు. రాజధాని రైతులు కోరిన క్యాపిటల్ గెయిన్స్ మినహాయింపు కేంద్ర ఆర్థిక మంత్రికి వివరించాం.. కేంద్రం చర్చించి నిర్ణయం తీసుకుంటుంది.. రాష్ట్ర పరిధిలో ఉన్న సమస్యలన్నీ దశల వారీగా పరిష్కరిస్తాం.. రాష్ట్రంలో అవినీతి నిర్మూలనకు ప్రత్యేక దృష్టి పెట్టాం.. త్వరలోనే ఆ దిశగా కార్యాచరణ రూపొందిస్తామని సూచించారు.

## స్లీపర్ బస్సు ప్రమాదాలపై ఆందోళన

న్యూఢిల్లీ,నవంబరు29 : ఇటీవల స్లీపర్ బస్సుల కారణంగా జరిగిన పలు రోడ్డు ప్రమాదాల్లో అనేక మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ నేపథ్యంలో జాతీయ మానవ హక్కుల కమిషన్ రంగంలోకి దిగింది. నిబంధనలకు విరుద్ధంగా ఉన్న స్లీపర్ బస్సులను తక్షణం పక్కనపెట్టేయాలని అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు మార్గదర్శకాలు జారీ చేసింది. ఎన్‌హెచ్‌ఆర్‌సీ మార్గదర్శకాల ప్రకారం.. ఏఐఎస్:052, ఏఐఎస్:119 నిబంధనల మేరకు వాహనాలు ఉండేలా రిజిస్ట్రేషన్, రెన్యూవల్ సమయంలో చర్యలు తీసుకోవాలి. ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించాలి. బస్–బాడీ బిల్డింగ్ సంస్థలు, వాహనాల ఆపరేటర్లు నిబంధనలను అతిక్రమించకుండా కేంద్ర రోడ్డు రవాణా మంత్రిత్వ శాఖ జాతీయ స్థాయిలో ఓ వ్యవస్థను ఏర్పాటు చేయాలి. వాహనాల భద్రతకు సంబంధించి సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రోడ్ ట్రాన్స్‌పోర్టు (సీఐఆర్‌టీ) మార్గదర్శకాలను రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు అమలు చేయాలి. ఎమర్జెన్సీ సమయాల్లో అడ్డంకిగా మారే అవకాశం ఉన్న బస్సులోపలి ఏర్పాట్లను తొలగించాలి. అవసరమైన మేరకు బస్సులను రికాల్ చేసి మార్పులు చేసేలా మార్గదర్శకాలు జారీ చేయాలి. మోటార్ వాహన చట్టం, ఏఐఎస్ ప్రమాణాల ఉల్లంఘనలకు బస్సు తయారీదారులతో పాటు అధికారులు కూడా బాధ్యులు అయ్యేలా చర్యలు తీసుకోవాలి. రోడ్డు ప్రమాద ఘటనల్లో బాధితులకు సహాయం, పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలి. ఇటీవల రాజస్థాన్‌లో జరిగిన బస్సు ప్రమాదంలో 20 మంది మరణించారు. ఈ నేపథ్యంలో ఎన్‌హెచ్‌ఆర్‌సీ వద్ద ఫిర్యాదు దాఖలైంది. నిబంధనల అతిక్రమణ కారణంగా అమాయకులు ప్రాణాలు కోల్పోతున్నారని ఫిర్యాదుదారులు పేర్కొన్నారు. ఇది జీవించే హక్కు ఉల్లంఘనేనని తెలిపారు. దీంతో.. ప్రమాదానికి గల కారణాలపై అధ్యయనం నిర్వహించాలని సీఐఆర్‌టీని ఎన్‌హెచ్‌ఆర్‌సీ ఆదేశించింది.

## శ్రీలంకను అతలాకుతలం చేసిన దిత్వా

క్రమంలో శ్రీలంక ప్రభుత్వం దేశంలో అత్యవసర పరిస్థితిని ప్రకటించింది. వరదల వల్ల ఏర్పడిన విధ్వంసం కారణంగా తలెత్తిన అత్యవసర పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని శ్రీలంక అధ్యక్షుడు అనుర కుమార దిసనాయకే దేశమమంతటా అత్యవసర పరిస్థితిని ప్రకటిస్తూ గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేశారు. శనివారం శ్రీలంకను దాటిన దిత్వా తుఫాను 123 మందికి పైగా ప్రాణాలను బలిగొందని, విధ్వంసం, మౌలిక సదుపాయాలకు నష్టం వాటిల్లిందని ఆ దేశ అధికారులు తెలిపారు. 'దిత్వా శ్రీలంక నుండి భారత తీరం వైపు వెళ్లింది. ఈ క్రమంలో భారీ వర్షం, అధిక వేగంతో కూడిన గాలులు వీశాయి. ఈ తుఫాన్ కారణంగా ఇప్పటికే అనేక ప్రాంతాలు తీవ్రంగా నష్టపోయాయి. ఎంతో మంది జీవనం అస్తవ్యస్తంగా మారింది' అని వాతావరణ శాఖ డైరెక్టర్ జనరల్ అతుల కరుణనాయకే మీడియాతో తెలిపారు. ఇదే సమయంలో విపత్తు నిర్వహణ కేంద్రం శనివారం ఓ ప్రకటనలో పలు విషయాలను వెల్లడించింది. వారం రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా అనేక ఇళ్లు ధ్వంసమయ్యాయనియని తెలిపింది. 43వేల మందికి పైగా ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించామని డీఎంసీ జనరల్ డైరెక్టర్ సంపత్ తెలిపారు. పోలీసులు, అధికారులు, రెస్క్యూ సిబ్బంది సహాయక చర్యలు కొనసాగుతున్నా యన్నారు. లోతట్టు ప్రాంతాల్లో పరిస్థితి మరీ దయనీయంగా ఉందన్నారు. వందలమందిని తాత్కాలిక పునరావాసాలకు తరలించామని డీఎంసీ జనరల్ డైరెక్టర్ వెల్లడించారు.

# 1నుంచి పార్లమెంట్ శీతాకాల సమావేశాలు

**న్యూఢిల్లీ,నవంబరు29 వెలుతురు:**
పార్లమెంటు శీతాకాల సమావేశాలు డిసెంబర్ 1వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. డిసెంబర్ 19వ తేదీ వరకూ ఈ సమావేశాలు జరుగుతాయి. సమావేశాలకు ముందు సంప్రదాయంగా నిర్వహించే అఖిలపక్ష సమావేశాన్ని ఆదివారం ఉదయం 11 గంటలకు నిర్వహించ నున్నారు. కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన ఈ అఖిలపక్ష సమావేశం జరగనుంది. పార్లమెంటు సమావేశాలు సజావుగా జరిగేలా సహకరించాలని కేంద్రం కోరనుంది. సోమవారం నుంచి ప్రారంభమయ్యే పార్లమెంటు శీతాకాల సమావేశాల్లో పలు అంశాలపై చర్చకు విపక్షం కసరత్తు చేస్తోంది. సర్‌తో సహా ఢిల్లీ కాలుష్యం తదితర అంశాలు చర్చకు వచ్చే అవకాశం ఉంది. ఇకపోతే కీలకమైన పౌర అణు ఇంధన రంగంలో ప్రైవేటు రంగానికి ఆహ్వానం పలికేందుకు ఉద్దేశించిన 'ది ఆటమిక్ ఎనర్జీ బిల్లు-2025'తో సహా 10 కీలక బిల్లులు సభ ముందుకు రానున్నాయి. పార్లమెంటులో ప్రవేశపెట్టనున్న కీలకమైన బిల్లులలో 'ది ఆటకమిక్ ఎనర్జీ బిల్లు-2025'తో పాటు సెక్యూరిటీస్ మార్కెట్స్ కోడ్ బిల్లు (ఎస్ఎంసి)-2025, జాతీయ రహదారుల (సవరణ) బిల్లు, అర్బిట్రేషన్, కాన్సిలియేషన్ (సవరణ) బిల్లు, ఇన్సూరెన్స్ చట్ట (సవరణ) బిల్లు, ఇన్సాల్వెన్సీ, దివాలా కోడ్ (సవరణ) బిల్లు, కార్పొరేట్ చట్ట (సవరణ) బిల్లు, ది హైయర్ ఎడ్యుకేషన్ కమిషన్ ఆఫ్ ఇండియా బిల్లు-2025, ది మణిపూర్ గూడ్స్ అండ్ సర్వీసెస్ టాక్స్ (సవరణ) బిల్లు-2025, జన్ విశ్వాస్ (నిబంధనల సవరణ) బిల్లు-2025 ఉండనున్నాయి. సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా చట్టం-1992, డిపాజిటరీస్ చట్టం-1996, సెక్యూరిటీస్ కాంట్రాక్ట్స్ (నియంత్రణ) చట్టం-1956లను విలీనం చేసేందుకు 'సెక్యూరిటీస్ మార్కెట్స్ కోడ్ బిల్లు-2025'ను కేంద్రం తీసుకువస్తోంది. జాతీయ రహదారుల విస్తరణ, పొడిగింపుకోసం అవసరమైన భూసేకరణ ప్రక్రియ వేగంగా, అత్యంత పారదర్శకంగా జరిగేందుకు వీలుగా నేషనల్ హైవేస్ (సవరణ) బిల్లును తెస్తోంది. చేయని తప్పులకు కంపెనీ డైరెక్టర్లు బాధ్యులు అవుతున్నందున అవాంఛనీయ దర్యాప్తు, విచారణల నుంచి రక్షణ కల్పించాలని సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాల మేరకు ఆర్బిట్రేషన్, కాన్సిలేయేషన్ చట్ట సవరణ బిల్లును పార్లమెంటులో కేంద్రం ప్రవేశపెట్టనుంది. దీనిపై సూచనల కోసం కమిటీకి సిఫారసు చేసే అవకాశం ఉంది. కాగా, ది హయ్యర్ ఎడ్యుకేషన్ కమిషన్ ఆఫ్ ఇండియా బిల్లుతో ఏకీకృత ఉన్నత విద్యా కమిషన్ ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం కొత్త బిల్లు తీసుకురానుంది. కాగా, చండీగఢ్ కేంద్ర పాలిత ప్రాంతాన్ని రాజ్యాంగంలోని 240వ అధికరణ పరిధిలోకి తెచ్చే బిల్లు పార్లమెంటులో ప్రవేశపెడతారని అనుకున్నప్పటికీ అలాంటి ఆలోచన ఏదీ లేదని ఇటీవల కేంద్రం ప్రకటించింది. కాగా, ఈసారి పార్లమెంటు శీతాకాల సమావేశాల్లో పలు అంశాలను లేవనెత్తేందుకు విపక్షాలు కసరత్తు చేస్తున్నాయి. ప్రధానంగా ఎస్ఐఆర్ ఓటర్ల సవరణ జాబితా, అదానీ అంశం, ఢిల్లీ పొల్యూషన్ వంటి అంశాలను లేవనెత్తే అవకాశాలున్నాయి. దీనికి సంబంధించిన విపక్ష నేత రాహుల్ ఇప్పటికే ప్రకటన చేశారు.

## వేగంగా మామునూరు విమానాశ్రయ నిర్మాణం

రైల్వే కోచ్ ఫ్యాక్టరీ నిర్మాణ పనులు కూడా వేగంగా సాగుతున్నాయి. అమృత్ పథకం కింద వరంగల్ జిల్లాకు రూ.874 కోట్లు మంజూరయ్యాయి. కాజీపేట రైల్వేస్టేషన్ ఆధునికీకరణ పనులు త్వరగా పూర్తి చేయాలని చెప్పామని అన్నారు. హృదయ్ పథకం కింద పురాతన ఆలయాల పునరుద్ధరణకు కేంద్రం నిధులు ఇచ్చింది. రామప్ప ఆలయం అభివృద్ధి కోసం కేంద్రం రూ.146 కోట్లు ఖర్చు చేస్తోందని కిషన్‌రెడ్డి వివరించారు. బీసీ రిజర్వేషన్ల అంశంపై కాంగ్రెస్‌కి చిత్తశుద్ధి లేదని కిషన్‌రెడ్డి విమర్శలు చేశారు. బీసీలకు కాంగ్రెస్ అన్యాయం చేసిందని ఆరోపించారు. బీసీ రిజర్వేషన్ల విషయంలో కాంగ్రెస్‌దే పూర్తి బాధ్యత అని.. ఈ విషయంలో ఆ పార్టీది కపటనాటకమని ఎద్దేవా చేశారు. బీజేపీకి ప్రధాన శత్రువు కాంగ్రెస్ మాత్రమే అని స్పష్టం చేశారు. రిజర్వేషన్లపై బీఆర్ఎస్‌కు మాట్లాడే నైతికత లేదని ఆక్షేపించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో మెజారిటీ స్థానాలు బీసీలకే కేటాయిస్తామని పేర్కొన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ఫిరాయింపులను ప్రోత్సహించాయని మండిపడ్డారు. బీసీలకు ఇచ్చే సీట్లలో ముస్లింలు పోటీచేసే అవకాశం ఉందని.. ఇది బీసీలకు అన్యాయం చేసినట్లు కాదా...? అని ప్రశ్నించారు. మేడారం జాతరకు కేంద్ర ప్రభుత్వం నిధులు ఇస్తుందని స్పష్టం చేశారు కిషన్‌రెడ్డి.మామునూరు ఎయిర్‌పోర్ట్‌కు సంబంధించిన భూసేకరణ చివరి దశలో ఉందని చెప్పుకొచ్చారు. ఎయిర్‌పోర్ట్ విషయంపై కొంతమంది రైతులు కోర్టుకెళ్లారని.. తాము చట్టపరంగా ముందుకు వెళ్తామని స్పష్టం చేశారు. ఈ విషయంపై ఎయిర్‌లైన్స్ కంపెనీలతో తాము మాట్లాడుతున్నా మని వివరించారు. ఎయిర్‌పోర్ట్‌లు కట్టడమే కేంద్రం బాధ్యత అని.. విమానాలు నడిపేది ప్రైవేటు కంపెనీలేనని తెలిపారు. హైదరాబాద్ నుంచి పరిశ్రమలు పోతే మధ్యతరగతి ప్రజలు ఇబ్బందులు పడతారని.. ఈ విషయంపై తాము పోరాడుతున్నామని చెప్పుకొచ్చారు. పరిశ్రమలపై సీఎం రేవంత్‌రెడ్డి ఏకపక్షంగా నిర్ణయం తీసుకున్నారని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు.

## కెసిఆర్ ఎప్పుడు రావాలో అప్పడే వస్తారు

అయ్యారు. సింహం తన గాథను తాను చెప్పుకోకపోతే, వేటగాడు చెప్పే పిట్టకథనే నిజం అనుకుంటారు అంటూ కేటీఆర్ పేర్కొన్నారు. దీక్షా దివస్ కార్యక్రమంలో కేటీఆర్ మాట్లాడుతూ... కేసీఆర్ ఎప్పుడు బయటకు రావాలో అప్పుడే వస్తారని తెలిపారు. ఎదురుదాడి ఎలా చెయ్యాలో కేసీఆర్‌కు తెలిసినంతగా ఇంకెవరికీ తెలియదన్నారు. నాయకుడిని నాయకుడే అంటారని.. అర్భకుడిని అర్భకుడే అంటారంటూ వ్యాఖ్యలు చేశారు. ఇలా మాట్లాడితే తనకు అహంకారం అంటారని.. కానీ తాను ఇలానే మాట్లాడుతానని.. ఏం చేసుకుంటారో చూసుకోండి అని అన్నారు. మహాభారతంలో పాండవులు హీరోలు.. విలన్లు కౌరవులు అని.. అలాగే రామాయణంలో హీరో శ్రీరాముడు... విలన్ రావణుడని తెలిపారు. ఇప్పుడు తెలంగాణ కథలో హీరో ఉన్నాడు... శకునులు, మారీచులు ఉన్నారంటూ కామెంట్స్ చేశారు. చరిత్రను మలుపు తిప్పిన రోజు కేసీఆర్ దీక్ష చేసిన రోజు అని చెప్పుకొచ్చారు.

సచ్చుడో తెలంగాణ వచ్చుడో అన్న కేసీఆర్ నినాదం సునామీ సృష్టించిందన్నారు. కేసీఆర్ దీక్ష విఫలం కావాలని చాలా మంది ప్రయత్నం చేశారని ఆరోపించారు. తెలంగాణ ఉన్నంత కాలం కేసీఆర్ అనే పదాన్ని ఎవరూ తుడిచివేయలేరని స్పష్టం చేశారు. టైం బాగాలేనప్పుడు గ్రామ సింహాలు కూడా పులుల్లా గర్జిస్తాయంటూ ఎద్దేవా చేశారు. ఎన్నడూ జై తెలంగాణ అననోళ్ళు పెద్ద పెద్ద మాటలు మాట్లాడుతున్నారంటూ మండిపడ్డారు. మొదటి నుంచి విలన్ పాత్ర పోషిస్తున్నది కాంగ్రెస్ పార్టీ అంటూ విరుచుకుపడ్డారు. పది మంది ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించి బైఎలక్షన్స్‌కు రావాలంటూ సీఎం రేవంత్‌కు మాజీ మంత్రి సవాల్ విసిరారు. సోనియా గాంధీని బలిదేవత అన్నది ఇప్పుడున్న ముఖ్యమంత్రి అని గుర్తుచేశారు. సోనియా గాంధీకి అసెంబ్లీలో ధన్యవాదాలు తెలిపిన సంస్కారి కేసీఆర్ అని అన్నారు.

కేసీఆర్ దొంగ దీక్ష అయితే ఆనాడు కేంద్రంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు విరమించమని చెప్పిందని ప్రశ్నించారు. రాజీవ్ గాంధీ విగ్రహం స్థానంలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని పెట్టుకుందామని దీక్షా దివస్ సాక్షిగా ప్రతిజ్ఞ చేస్తున్నామన్నారు. కాంగ్రెస్ పార్టీ హీరోలను విలన్లుగా చిత్రీకరిస్తుందని విమర్శించారు. కాళేశ్వరం మీద కుట్ర జరిగిందని ఆరోపించారు. మేడిగడ్డ బ్యారేజ్‌ను బాంబులు పెట్టి కూల్చివేసే ప్రయత్నం జరిగిందన్నారు. గులాంల ఎగురులాట కొంత కాలమే... వచ్చె కాలమంతా గులాబీలదే అంటూ కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు.

# డిజిటల్ అరెస్ట్ పేరుతో మోసాలు

లాక్కోవడం ఈ స్కాం కీలక లక్ష్యంగా పోలీసులు హెచ్చరించారు. ఇలాంటి కాల్స్ ద్వారా అప్రమత్తంగా ఉండాలని సూచించారు.. బాధితులకు వీడియో కాల్ లేదా ఫోన్ ద్వారా అరెస్ట్ చేస్తున్నాం అని నటిస్తూ, ఖాతాలను ఫ్రీజ్ చేస్తామని, వారెంట్లు జారీ అయ్యాయని నమ్మించి మోసం చేస్తారని హెచ్చరించారు. మోసగాళ్లు తమ కుట్రను బలపరచేందుకు నకిలీ వారెంట్లు, లేఖలు వంటి కట్టుకథల డాక్యుమెంట్లు తయారు చేసి పంపిస్తారు. అనుమానం లేకుండా ఉండేందుకు కుటుంబ ప్రతిష్టకు హాని కలుగుతుందని చెప్పి ఒత్తిడి పెంచుతారు. కేసు నుండి బయటపడాలంటే భారీ మొత్తం డబ్బు సేకరించి సుప్రీం కోర్టుకు డిపాజిట్ చేయాలి అని చెప్పి వెంటనే ట్రాన్స్ఫర్ చేయిస్తారు. కుటుంబ సభ్యులకు చెప్పొద్దని హెచ్చరిస్తూ సోషల్ ఇంజినీరింగ్ పద్ధతులను వినియోగిస్తారని హెచ్చరించారు. ఈ నేపథ్యంలో సైబర్ క్రైమ్ యూనిట్ ప్రజలకు స్పష్టమైన సూచనలు ఇస్తోంది.. డిజిటల్ అరెస్ట్ అనే దాంట్లో ఏమీ లేదు. నిజమైన పోలీసులు ఎప్పుడూ ఫోన్, లేదా వీడియో కాల్ ద్వారా అరెస్ట్ చేయరు. కాలర్ స్పూఫ్ చేయబడవచ్చు కాబట్టి ఏ అధికారిక కాల్ వచ్చినా వెంటనే నమ్మేయకూడదు. పాన్, ఆధార్, బ్యాంక్ వివరాలు వంటి వ్యక్తిగత లేదా ఆర్థిక సమాచారాన్ని ఎవరితోనూ పంచకూడదు. అనుమానం వచ్చిన వెంటనే కాల్‌ను కట్ చేసి, కాలర్ ఇచ్చిన నంబర్లకు తిరిగి కాల్ చేయకుండా, స్థానిక పోలీస్ స్టేషన్ లేదా ప్రభుత్వ అధికారిక హెల్ప్‌లైన్‌ద్వారా మాత్రమే ధృవీకరించాలి.

మెసేజ్లు, స్క్రీన్‌షాట్లు, కాల్ లాగ్స్ వంటి సాక్ష్యాలను భద్రపరచడం కూడా చాలా ముఖ్యమని అధికారులు తెలిపారు. ఇలాంటి మోసాలు ఎదురైనపుడు వెంటనే నేషనల్ సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ 1930కు కాల్ చేయాలని లేదా ఫిర్యాదు చేయాలని సూచించారు. తాజా అప్డేట్ల కోసం హైదరాబాద్ సిటీ సైబర్ క్రైమ్ అధికారిక సోషల్ మీడియా పేజీలను,ఖాతాలను ఫాలో కావాలని చెప్పారు. డిజిటల్ ప్రపంచం వేగంగా మారుతున్న కొద్దీ మోసగాళ్ల పద్ధతులు కూడా అధునాతనంగా మారుతున్నాయి. ఒక్క ఫోన్ కాల్, ఒక్క మెసేజ్ కూడా భారీ నష్టానికి దారితీసే ప్రమాదం ఉందన్నారు.

# అన్ని గ్రామాల అభివృద్ధికి తన వంతుగా కృషి

**ఆదిలాబాద్ వెలుతురు నవంబర్ 29:**
అన్ని గ్రామాల సమానాభివృద్ధికి తన వంతుగా కృషి చేస్తానని ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వ పాలనకు ఆకర్షితులై ఎంతోమంది బిజెపిలో చేరుతున్నారని పేర్కొన్నారు. శనివారం బోరజ్ మండలంలోని రాంపూర్ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ లింగన్న, మాజీ ఉపసర్పంచ్ నందు తో పాటు సింగిల్ విండో డైరెక్టర్లు, పలువురు బీజేపీ లో చేరారు, ఈ సందర్భంగా వారికి ఎమ్మెల్యే కండువాలను కప్పి పార్టీ ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయల్ శంకర్ మాట్లాడుతూ పంచాయతీ ఎన్నికల్లో బీజేపీ బలపరిచిన అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని పిలుపునిచ్చారు. అదేవిధంగా ఎన్నికైన బీజేపీ పంచాయితీలకు రూ. 25 లక్షలు అందజేసేందుకు తనవంతుగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. గ్రామానికి మంచి చేయాలనే సదుద్దేశంతో బిజెపిలో చేరిన వారందరికీ తన పూర్తి మద్దతు ఉంటుందని అన్నారు. b ప్రజలతో మమేకమై గ్రామ అభివృద్ధికి పాటుపడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమం లో నాయకులు. రమేష్. నాందేవ్. సన్నీ. అశోక్ రెడ్డి. రమేష్. గట్టిగా క్రాంతి. తదితరులు పాల్గొన్నారు





## కెబిర్ పార్క్ వద్ద మల్టీ లెవెల్ పార్కింగ్

### - నేడు ప్రారంభించనున్న జిహెచ్ఎంసి

**హైదరాబాద్,నవంబరు29 ( వెలుతురు):**
భాగ్యనగరంలో తొలిసారిగా ఆటోమేటెడ్ స్మార్ట్ రోటరీ పార్కింగ్ అందుబాటులోకి రానుంది. ఆదివారం నుంచి జూబ్లీహిల్స్‌లోని కేబీఆర్ పార్క్ వద్ద జీహెచ్ఎంసీ ప్రారంభించనుంది. ఇప్పటికే మల్టీ లెవెల్ పార్కింగ్‌కు ట్రయల్ రన్ పూర్తి చేసింది. నగరంలో ఇదే మొదటి ఆటోమేటెడ్ స్మార్ట్ రోటరీ పార్కింగ్. ఉదయం, సాయంత్రం సమయంలో వాకింగ్‌కు వచ్చేవారితో పాటు చుట్టుపక్కల్లోని స్థానికులు వాహనాలను పార్కింగ్ చేసుకునే సదుపాయం కల్పించింది. జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో మల్టీలెవెల్ పార్కింగ్ వ్యవస్థను నిర్మించింది నవ నిర్మాణ్ అసోసియేట్స్. ఒకేసారి 72 కార్లు పార్కింగ్ చేసే సదుపాయం ఉంది. డిజైన్, బిల్డ్, ÷నాన్స్, ఆపరేట్, ట్రాన్స్‌ఫర్ మోడల్‌లో మల్టీ లెవెల్ పార్కింగ్‌ను నిర్వహించనుంది నవ నిర్మాణ అసోసియేట్. ముందగానే పార్కింగ్ బుక్ చేసుకునేందుకుగానూ నావిగేషన్, ఇతర సర్వీసుల కోసం ఒక మొబైల్ యాప్‌ను తీసుకురానుంది.

## తెలంగాణలో రాజకీయ కోలాహలం

రాష్ట్రవ్యాప్తంగా తొలిరోజు సర్పంచి పదవుల కోసం 3,242 నామినేషన్లు, వార్డు సభ్యుల స్థానాలకు 1,821 నామినేషన్లు దాఖలైనట్లు ఎన్నికల అధికారులు వెల్లడించారు. రెండో రోజు సర్పంచ్ స్థానాలకు 4901 నామినేషన్లు దాఖలు. రెండో రోజు వార్డు మెంబర్ల స్థానాలకు 9643 నామినేషన్లు దాఖలు అయినట్లు తెలిపారు. రెండు రోజుల్లో సర్పంచ్ స్థానాలకు 8198 నామినేషన్లు, 11502 వార్డు మెంబర్ నామినేషన్లు దాఖలు అయినట్లు వెల్లడించారు. మొదటి విడతలో 189 మండలాల్లోని 4,236 సర్పంచ్ స్థానాలకు, 37,440 వార్డు సభ్యుల స్థానాలకు ఎన్నికల కమిషన్ ఎన్నికలు నిర్వహించనున్నది. 30వ తేదీన నామినేషన్ పత్రాల పరిశీలన చేపడతారు. డిసెంబర్ 3 వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు విధించారు. అదే రోజు పోటీలో ఉన్న తుది అభ్యర్థుల జాబితాను ప్రకటిస్తారు. డిసెంబర్ 11న ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పోలింగ్ నిర్వహించనున్నారు. పోలింగ్ ముగిసిన వెంటనే, అదే రోజు మధ్యాహ్నం ఓట్ల లెక్కింపు చేపట్టి వార్డు సభ్యులు, సర్పంచుల ఫలితాలను వెల్లడిస్తారు.

## సర్పంచ్ ఎన్నిక కోసం ఎస్ఐ రాజీనామా

**కోదాడ,నవంబరు29 ( వెలుతురు):**
రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల కోలాహలం కొనసాగుతుంది. సర్పంచ్ ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఓ సబ్ ఇన్‌స్పెక్టర్ తన ఉద్యోగానికి రాజీనామా చేశాడు. కోదాడ టౌన్ ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న పులి వెంకటేశ్వర్లు తన ఉద్యోగానికి రాజీనామా సమర్పించారు. స్వస్థలం కోదాడ మండలం గుడిబండ గ్రామ సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేసేందుకు ఆయన స్వచ్ఛంద పదవి విరమణ చేశారు. పుట్టిన ఊరికి సేవ చేయడమే లక్ష్యంగా ఇంకా 5 నెలల సర్వీస్ ఉండగానే వీఆర్ఎస్ తీసుకున్నట్లు వెల్లడించారు. మేజర్ గ్రామ పంచాయతీ అయిన గుడిబండలో మొత్తం జనాభా 4,486. ఓటర్లు 3,813. వార్డులు 12. ఆదివారం నుండి నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ కొనసాగనుంది.

# భారతదేశ కార్మిక రంగం పరివర్తన..
# వికసిత్ భారత్ కోసం కార్మిక కోడ్‌లు ..

**డాక్టర్ ప్రదీప్ కుమార్ జెనా**

(రచయిత: డైరెక్టర్, కార్మిక - ఉపాధి మంత్రిత్వ శాఖ)




ఒక చారిత్రాత్మక పరిణామంగా నిలిచే నాలుగు కార్మిక కోడ్‌లను 2025 నవంబర్ 21 నుంచి కేంద్ర ప్రభుత్వం అమలు చేసింది. తద్వారా పార్లమెంట్ ఆమోదించిన కార్మిక సంస్కరణలు కార్యరూపం దాల్చాయి. ఈ కోడ్‌ల ప్రభావం గురించి వివిధ రకాల అభిప్రాయాలు, మీడియా కథనాలు వెలువడ్డాయి. ఎంతో కాలంగా ఉన్న కార్మిక సమస్యలపై ఇది చర్చలు, వాదోపవాదనలకు దారితీసింది. కోడ్‌ల సామర్థ్యం గురించి ఉన్న కొన్ని గందరగోళాలను ఈ వ్యాసం నివృత్తి చేస్తుంది. ప్రభుత్వం వివిధ కార్మిక చట్టాలు, బలమైన సామాజిక భద్రతా ఫ్రేమ్‌వర్క్ ద్వారా శ్రమకు ఉన్న గౌరవాన్ని నిలబెట్టడానికి నిరంతరం కృషి చేసింది. ఏదేమైనా కార్మిక వర్గంలో ఆర్థిక పరివర్తన తీసుకొచ్చేందుకు అర్థవంతమైన ఉపాధి అవకాశాలు లభించడం అనేది ఒక ప్రాథమిక అవసరం. భారత్ వంటి కార్మిక మిగులున్న ఆర్థిక వ్యవస్థలో ప్రభుత్వం అందరికీ ఉపాధిని కల్పించడం సాధ్యం కాదు. ఇక్కడే ప్రైవేట్ రంగం ఒక ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. దీనికి అనుకూలమైన సామాజిక-చట్టపరమైన ఫ్రేమ్‌వర్క్‌తో పాటు 21వ శతాబ్దపు భారతదేశ ఆకాంక్షలను ప్రతిబింబించే ప్రగతిశీల-దూరదృష్టి గల కార్మిక చట్టాలు అమల్లో ఉండాలి. దశాబ్దాలుగా భారత దేశపు కార్మిక వ్యవస్థను 29 కేంద్ర చట్టాలు నిర్వహిస్తున్నాయి. వీటిలో చాలా వరకు స్వాతంత్ర్యానికి పూర్వపు కాలం నాటివి. బహుళత్వం, క్లిష్టత, కాలం చెల్లిన నిబంధనలు అనే సవాళ్లను అధిగమించేందుకు రెండో జాతీయ కార్మిక కమిషన్-2002 చేసిన సిఫార్సులకు అనుగుణంగా కేంద్ర ప్రభుత్వం దేశ కార్మిక చరిత్రలో అత్యంత దూరదృష్టిగల నిర్ణయాల్లో ఒకటిగా పేర్కొనే సంస్కరణలను తీసుకొచ్చింది. వేతనాల కోడ్- 2019, సామాజిక భద్రత కోడ్- 2020, పారిశ్రామిక సంబంధాల కోడ్- 2020, వృత్తిపరమైన భద్రత- ఆరోగ్యం- పని పరిస్థితుల కోడ్- 2020 అనే నాలుగు సమగ్ర కార్మిక కోడ్‌లను చట్టాలుగా రూపొందించడం ద్వారా ఈ సంస్కరణలు వచ్చాయి. 1991 సరళీకరణ, నిర్మాణాత్మక సర్దుబాటు విధానాల తర్వాత చేపట్టాల్సిన సంస్కరణలకు కొనసాగింపుగా ఈ సంస్కరణలు ఉన్నాయి. ఇవి ప్రగతిశీల కార్మిక వ్యవస్థ, పారిశ్రామిక వృద్ధి కోసం ఒక ఆధునిక, ఆవిష్కరణ-ఆధారిత పద్ధతిని తీసుకువస్తున్నాయి. కార్మిక సంస్కరణలు: పాత కార్మిక చట్టాలను 'హేతుబద్ధీకరణ, ఆధునికీకరించటం ద్వారా నాలుగు కార్మిక కోడ్‌లు నియంత్రణ పద్ధతిని గణనీయంగా క్రమబద్ధీకరించాయి. పాత 29 చట్టాల కింద ఉన్న 1,228 సెక్షన్ల సంఖ్య కేవలం 480కి తగ్గింది. నియమాల సంఖ్య 1,436 నుండి 351కి తగ్గింది. ఫారాల సంఖ్య 181 నుంచి 73కి, రిజిస్టర్ల సంఖ్య 84 నుండి కేవలం 8కి వచ్చింది. ఈ ముఖ్యమైన ఏకీకరణ, 'హేతుబద్ధీకరణ దేశవ్యాప్తంగా కార్మికులకు జీవన సౌలభ్యాన్ని, యజమానులకు వ్యాపార సౌలభ్యాన్ని.. ఇలా రెండింటినీ పెంచుతుంది. వేతనాల కోడ్ కింద అత్యంత ముఖ్యమైన సంస్కరణల్లో ఒకటి 'కనీస వేతనాన్ని అందరికీ వర్తింప చేయటం'. ఇది వ్యవస్థీకృత, అవ్యవస్థీకృత రంగాల్లో ఉన్న ఉద్యోగులందరికీ వర్తిస్తుంది. గతంలో ఇది కొన్ని 'షెడ్యూల్ ఉద్యోగాలకు' మాత్రమే పరిమితమయ్యేది. రాష్ట్రాలు జాతీయ స్థాయి కంటే తక్కువ వేతనాన్ని నిర్ణయించలేవు. దీనివల్ల కేంద్ర ప్రభుత్వం నిర్ణయించే 'కనీస వేతనం' (ఫ్లోర్ వేజ్) ఈ విషయంలో ఉన్న ప్రాంతీయ అసమానతలను తగ్గిస్తుంది. మరొక ప్రగతిశీల మార్పు ఏంటంటే.. 'కార్మిక 'ఇన్‌స్పెక్టర్'ను 'ఇన్‌స్పెక్టర్-కమ్-ఫెసిలిటేటర్'గా చేయటం. మార్గనిర్దేశం చేయడంతో పాటు అవగాహన కల్పించడం వీరి ముఖ్య విధి. కఠినమైన, తరచూ విమర్శలకు గురైన "ఇన్‌స్పెక్టర్ రాజ్" నుంచి స్పష్టమైన మార్పును ఇది సూచిస్తుంది. అంతేకాకుండా ఈ నాలుగు కోడ్‌లు చిన్న నేరాలను నేరరహితం చేశాయి. మొదటిసారి ఉల్లంఘనలకు 'కాంపౌండింగ్ నిబంధనలు' వచ్చాయి. ఇది శిక్షించే విధానం నుంచి దిద్దుబాటు, విశ్వాసం-ఆధారిత నియంత్రణ విధానం వైపు మళ్లడాన్ని తెలియజేస్తోంది. నిర్దిష్ట వ్యవధి ఉద్యోగం అనే భావనను పారిశ్రామిక సంబంధాల (ఐఆర్) కోడ్ ప్రవేశపెట్టింది. ఇది నిర్దిష్ట వ్యవధి కార్మికులకు ఒక సంవత్సరం పనిచేసిన తర్వాతే గ్రాట్యుటీతో సహా శాశ్వత ఉద్యోగులతో సమానమైన ప్రయోజనాలను పొందేలా భరోసానిస్తోంది. ఈ సంస్కరణ కార్మికుల హక్కులు, సంక్షేమాన్ని కాపాడుతూనే నిర్వహణ అవసరాలకు అనుగుణంగా ఉద్యోగులను నియమించుకోవడానికి పరిశ్రమలకు ఎంతో అవసరమైన సౌలభ్యాన్ని అందిస్తుంది. ఇది కాంట్రాక్టు వ్యవస్థను తగ్గిస్తుంది. సమ్మెలు, లాకౌట్ల విషయంలో 14 రోజుల ముందు కార్మికులు నోటీసు ఇవ్వాలనే నిబంధన పారిశ్రామిక శాంతి, సామరస్యాన్ని ప్రోత్సహిస్తుంది. పాత చట్టంలో ఈ నిబంధన ప్రభుత్వ వినియోగ సేవలకు మాత్రమే వర్తించేది. అంతరాయం కంటే చర్చలు, సంప్రదింపుల ద్వారా వివాదాలను పరిష్కరించుకోవడాన్ని ఈ మార్పు ప్రోత్సహిస్తుంది. అదనంగా ఈ కోడ్ 'నెగోషియేటింగ్ యూనియన్' లేదా 'నెగోషియేషన్ కౌన్సిల్' ద్వారా ట్రేడ్ యూనియన్లకు చట్టబద్ధమైన గుర్తింపును అందిస్తుంది. దీనిని మీడియా విశ్లేషణలో విస్మరించారు. ఇది సామూహిక బేరసారాల యంత్రాంగాలను బలోపేతం చేసి కార్మిక సంక్షేమాన్ని ప్రోత్సహిస్తుంది. కర్మాగారాలు, గనులు, తోటలలో తొలగింపులు, లే-ఆఫ్‌లు, మూసివేతల సందర్భాల్లో ప్రభుత్వ ముందస్తు ఆమోదం కోసం ఉన్న పరిమితిని 100 మంది కార్మికుల నుంచి 300 మంది కార్మికులకు ఈ కోడ్ సవరించింది. ఈ సంస్కరణల ప్రక్రియలో అత్యంత ఆకాంక్షాత్మక సంస్కరణ సామాజిక భద్రత కోడ్‌లో భాగంగా జరిగింది. ఇది మొట్టమొదటిసారిగా గిగ్, ప్లాట్‌ఫామ్ కార్మికులను అధికారికంగా గుర్తించింది. దీనితో వర్తమాన శ్రామిక శక్తికి చట్టపరమైన సామాజిక రక్షణను అందించిన ప్రపంచంలోని మొట్టమొదటి దేశాల్లో భారత్ ఒకటిగా నిలిచింది. ఇది గిగ్, ప్లాట్‌ఫామ్ కార్మికులతో సహా అవ్యవస్థీకృత కార్మికులకు వివిధ సంక్షేమ పథకాల ద్వారా మద్దతునిచ్చేందుకు బహుళ రూపాల్లో ఆర్థిక వనరులు అందే యంత్రాంగాలతో కూడిన ఒక సామాజిక భద్రతా నిధిని ఏర్పాటు చేయాలని కూడా నిర్దేశిస్తోంది. తద్వారా సమ్మిళిత, సమానమైన కార్మిక సంక్షేమం వైపు ఒక ముఖ్యమైన అడుగు పడింది. అదేవిధంగా వృత్తిపరమైన భద్రత, ఆరోగ్యం, పని పరిస్థితుల (ఓఎస్‌హెచ్) కోడ్.. పని ప్రదేశంలో భద్రత, సంక్షేమం, పని పరిస్థితులకు సంబంధించిన నిబంధనలను తెలియజేస్తోంది. ఒకే రిజిస్ట్రేషన్, ఒకే లైసెన్స్, ఒకే రిటర్న్‌ను ఇది ప్రవేశపెట్టింది. ఇది దేశంలో వ్యాపార సౌలభ్యం దిశగా వద్ద ఒక ముఖ్యమైన ముందడుగు. లైసెన్స్ చెల్లుబాటు కాలం ఐదేళ్లుగా ఉంది. ముఖ్యంగా ఇది మహిళలు అన్ని రంగాలలో రాత్రి వేళల్లో కూడా పని చేయడానికి అనుమతిస్తోంది. దీని కోసం ఆయా మహిళల అనుమతితో తగిన భద్రతా చర్యలు తీసుకుంటే సరిపోతుంది. తద్వారా ఇది లింగ సమానత్వాన్ని ప్రోత్సహిస్తుంది. ఇది కార్మికులకు ఉచిత వార్షిక ఆరోగ్య పరీక్షలు, ఉద్యోగులందరికీ నియామక పత్రాలను జారీ చేయడాన్ని కూడా తప్పనిసరి చేసింది. ఇది వ్యవస్థీకృత నిర్వహణ మార్గం సుగమం చేస్తుంది. వీటితో పాటు ఈ కోడ్.. సంస్థలకు వర్తించే పరిమితులను పెంచడం ద్వారా చిన్న సంస్థలపై చట్టపరమైన భారాన్ని తగ్గించింది. కాంట్రాక్ట్ కార్మికులను ఉదాహరణగా తీసుకుంటే ఈ విషయంలో ఇది వర్తించాలంటే ఉండాల్సిన ఉద్యోగుల సంఖ్య 20 నుంచి 50కి పెరిగింది. ఫ్యాక్టరీ నిబంధనలు వర్తించాలంటే కూడా ఉండాల్సిన కార్మికుల సంఖ్య కరెంటు ఉపయోగించే యూనిట్ల విషయంలో 10 నుంచి 20కి, కరెంటు ఉపయోగించని యూనిట్ల విషయంలో 20 నుంచి 40కి పెరిగింది.

ఈ మార్పులు సమిష్టిగా మరింత క్రమబద్ధమైన, కార్మికులకు అనుకూలమైన, వ్యాపారాలకు అనుకూలమైన నియంత్రణ వాతావరణాన్ని సృష్టిస్తాయి. వికసిత్ భారత్ దిశగా: నాలుగు కార్మిక కోడ్‌లు సమష్టిగా కార్మికుల సంక్షేమం, పరిశ్రమలు- యజమాన్యాల సౌలభ్యం మధ్య సమతుల్యతను సాధించడానికి ప్రయత్నిస్తాయి. నిర్వచనాలను క్రమబద్ధీకరించడం, చట్టపరమైన ప్రక్రియలను డిజిటలైజ్ చేయడం, లింగ తటస్థతను ప్రోత్సహించడం ద్వారా కార్మికులందరికీ సమ ప్రాధాన్యం ఉండే వ్యవస్థను తీసుకొచ్చేందుకు నాలుగు కార్మిక కోడ్‌లు కృషి చేస్తాయి. ఇది 2047 నాటికి వికసిత్ భారత్ సాధించాలనే దేశ ఆకాంక్షకు దోహదపడుతుంది. పారిశ్రామికాభివృద్ధి పరిశోధన సంస్థ (ఐఎస్ఐడీ) ఇచ్చిన భారత పారిశ్రామిక అభివృద్ధి నివేదిక 2024-25 ప్రకారం భారత ప్రభుత్వ 'భారత్ కోసం తయారీ, ప్రపంచం కోసం తయారీ' విధానాల కారణంగా దేశంలో తయారీ రంగానికి గణనీయ స్థాయి అవకాశం ఉంది. ఈ విధానాలకు శ్రామిక, నైపుణ్య వనరులు ఎక్కువగా అవసరం. 2024లో 717 బిలియన్ డాలర్లుగా ఉన్న దేశ తయారీ రంగ విలువను 2030 నాటికి 1.45 ట్రిలియన్ డాలర్లకు (మొత్తం 7.5 ట్రిలియన్ డాలర్ల జీడీపీలో) అంటే రెట్టింపు కంటే ఎక్కువ చేయగల సామర్థ్యాన్ని భారత్ కలిగి ఉంది. దీన్ని బట్టి చూసుకుంటే ప్రత్యక్షంగా, పరోక్షంగా మిలియన్ల కొద్దీ గౌరవప్రదమైన ఉద్యోగాలు వస్తాయి. నాలుగు కార్మిక కోడ్‌ల అమలు అనేది పరిశ్రమలకు అవసరమైన సౌలభ్యం, నియంత్రణల సడలింపును అందిస్తూ మన శ్రామిక శక్తికి సార్వత్రిక కార్మిక సంక్షేమం, సామాజిక భద్రతను అందించే చర్యలకు తోడ్పడుతుంది.

## బొట్టుగూడ ఉన్నత పాఠశాలకు నూతన భవనాన్ని నిర్మిస్తున్న మంత్రి కోమటి రెడ్డి ని ఘనంగా సన్మానించిన పూర్వ విద్యార్థులు



హైదరాబాద్, వెలుతురు నవంబర్ 29:

నల్గొండ పట్టణంలో అత్యంత ప్రాముఖ్యత చెందిన బొట్టుగూడ ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల నూతన భవన నిర్మాణాన్ని కోమటిరెడ్డి ప్రతీక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేపట్టడం పట్ల బొట్టుగూడ పాఠశాల పూర్వ విద్యార్థులు నేడు రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకటరెడ్డి ని నేడు హైదరాబాద్ లోని ఆయన నివాసంలో కలిసి ఘనంగా సన్మానించారు. దాదాపు ఏడు దశాబ్దాల చరిత్ర గలిగి జాతీయ స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులు, ఎందరో ప్రముఖ ఉపాధ్యాయులు బోధించిన బొట్టుగూడ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఇన్నేళ్ళుగా ప్రయివేటు భవనంలో కొనసాగుతోంది. ఈ పాఠశాలకు శాశ్వత భవనం కావాలని మంత్రికి పూర్వ విద్యార్థులు విజ్ఞప్తి చేయగా ప్రకాశం బజార్ సమీపంలో ఉన్న ప్రభుత్వ స్థలంలో రూ. 8 కోట్లకు పైగా వ్యయంతో కోమటిరెడ్డి ప్రతీక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్మాణం చేపట్టారు. కార్పొరేట్ స్థాయి సౌకర్యాలతో డిజిటల్ క్లాసులు, కంప్యూటర్ విద్య, ఇంగ్లీష్ %ం% ఉర్దూ మీడియం బోధనకు ప్రాధాన్యత ఇస్తూ నిర్మాణం చేపట్టారు. ఇందుకు కృతజ్ఞతగా, బొట్టుగూడ పాఠశాల పూర్వ విద్యార్థులైన నల్గొండ జిల్లా వక్ఫ్ బోర్డు ప్రెసిడెంట్ హఫీజ్ ఖాన్, జీహెచ్ఎంసీ అడిషనల్ కమిషనర్ ఎన్. రఘుప్రసాద్, అడిషనల్ ఎస్.పి. పూర్ణ చందర్, సమాచార శాఖ జాయింట్ డైరెక్టర్ కన్నెకంటి వెంకట రమణ, అటవీ శాఖ డిప్యూటీ డైరెక్టర్ హలీం, గొట్టిపర్తి వేణుగోపాల్, ఏ. విశ్వేశ్వర్ రావు తదితరులు మంత్రి వెంకట రెడ్డిని కలసి ఘనంగా సన్మానించారు. కాగా, నూతనంగా నిర్మిస్తున్న బొట్టుగూడ పాఠశాల నిర్మాణ పనులు దాదాపుగా పూర్తయ్యాయని త్వరలోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీద దీన్ని ప్రారంభించనున్నట్లు మంత్రి కోమటి రెడ్డి వెల్లడించారు.

## దేశ సేవలో ప్రాణాలు కోల్పోయిన వారు స్మరణీయులు

హాజరై మాట్లాడారు. ఇండో పాక్ యుద్ధంలో అనేకమంది అమరులయ్యారని, వారి త్యాగాలను స్మరించుకోవాలని చెప్పారు. ఈ సందర్భంగా 51 మంది మాజీ సైనిక ఉద్యోగులు, మాజీ సైనికుల కుటుంబ సభ్యులకు అవార్డులను అందజేశారు. కార్యక్రమంలో బొందెడ గ్రూప్ ఛైర్మన్ రాఘవేంద్రరావు తదితరులు పాల్గొన్నారు. ఇదిలావుంటే హైదరాబాద్ పోలీసు శాఖ మరో కీలక నిర్ణయం తీసుకోనున్నట్లు తెలుస్తోంది. హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో సీబీటీ సెంట్రల్ ఇన్వెస్టి గేషన్ టీమ్‌ను ఏర్పాటు చేసేందుకు హైదరాబాద్ సీపీ సజ్జనార్ సన్నాహాలు చేస్తున్నారు. సెన్సేషనల్ కేసులతో పాటు కీలక కేసులను సిబిటికి బదిలీ చేసేలా చర్యలు తీసుకోనున్నారు. సాధారణ కేసులతో సంబంధం లేకుండా సీబీటీ టీమ్ ద్వారా కేసుల దర్యాప్తు వేగవంతం అవుతుందని భావిస్తున్నారు పోలీస్ ఉన్నతాధికారులు. కేసు దర్యాప్తు దగ్గర నుంచి కోర్టులో ఛార్జ్ షీట్స్, ట్రయల్ వరకు సిబిటి టీమ్ మానిటర్ చేసే విధంగా అధికారులు నిర్ణయం తీసుకోనున్నారు.

## జర్నలిస్టుల హక్కుల కోసం పోరుబాట

**- డిసెంబర్ 3న జర్నలిస్టుల మహాధర్నా**

హైదరాబాద్, వెలుతురు నవంబర్ 29:

తెలంగాణలో జర్నలిస్టుల సంక్షేమం తీవ్రంగా దెబ్బతిన్న నేపథ్యంలో, తమ హక్కుల సాధన కోసం పోరుబాటే ఏకైక మార్గమైపోయిందని టీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రాజేష్, చిన్న పత్రికల సంఘం రాష్ట్ర అధ్యక్షులు యూసుఫ్ బాబు, ప్రధాన కార్యదర్శి అశోక్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం సమాచార శాఖ కార్యాలయం వద్ద జరగనున్న మహాధర్నాకు సంబంధించిన కరపత్రాన్ని వారు ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ...గత ప్రభుత్వంలో అమలైన జర్నలిస్టుల సంక్షేమ పథకాలు తెలంగాణలో పూర్తిగా గల్లంతయ్యాయని, ప్రభుత్వాల నిర్లక్ష్యం మరింత పెరిగిందని మండిపడ్డారు. జర్నలిస్టుల కోసం అత్యవసరమైన ఆరోగ్య భద్రత, అక్రిడిటేషన్, సంక్షేమ నిధి, రక్షణ కమిటీలు నిలిచిపోయి సంవత్సరాలు గడిచినా, ప్రభుత్వం ఏ చర్యలు తీసుకోలేదని వారు విమర్శించారు. ముఖ్యంగా చిన్న పత్రికలు ఎదుర్కొంటున్న అక్రిడేషన్ సమస్యలు, 16 నెలలుగా ప్రకటన బిల్లుల విడుదలలో జాప్యం పై ఎన్నిసార్లు వినతిపత్రాలు ఇచ్చినా స్పందన లేకపోవడం బాధాకరమన్నారు. జర్నలిస్టులకు ఇంటి స్థలాల కేటాయింపు కూడా ఇంతవరకు అమలుకాలేదని, దీనివల్ల వేలాది మంది జర్నలిస్టులు నిరాశలో ఉన్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో డిసెంబర్ 3న మాసాబ్‌ట్యాంక్‌లోని సమాచార శాఖ కార్యాలయం వద్ద మహాధర్నా నిర్వహించనున్నట్లు ప్రకటించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న చిన్న పత్రికల సంపాదకులు, జర్నలిస్టులు భారీ ఎత్తున ధర్నాలో పాల్గొని తమ న్యాయమైన డిమాండ్లను వినిపించాలని పిలుపునిచ్చారు. సమస్యలు పరిష్కరించకపోతే పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరిక పలికారు. టీయూడబ్ల్యూజే అధ్యక్షులు విరహత్ అలీ పిలుపు మేరకు, అనుబంధ సంఘమైన చిన్న మధ్యతరగతి పత్రికల సంఘం కూడా ఈ మహాధర్నాకు సంపూర్ణ మద్దతు ప్రకటించింది. చిన్న పత్రికల సమస్యల పరిష్కారానికి ఈ మహాధర్నానే పెద్ద వేదిక కానుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐజేయూ సభ్యులు మాతంగి దాస్, చిన్న పత్రికల సంఘం రాష్ట్ర కోశాధికారి అజాం ఖాన్, రాష్ట్ర నాయకులు ఇక్బాల్, ఉస్మాన్ రషీద్, బాలకృష్ణ, అహ్మద్ అలీ, మురళి, వెంకటయ్య, అఫ్రోజ్, అమాన్, మోసిన్ అలీ, గౌస్, రియాసత్, ఇలియాజ్, అంజాద్, అన్వార్, శ్రీనివాస్, జాన్ షహీద్, ఖాసీం, ప్రకాష్, అసద్‌తో పాటు ఉర్దూ, ఇంగ్లీష్, తెలుగు పత్రికల సంపాదకులు పాల్గొన్నారు.



## కెసిఆర్ - ఒక పెద్ద దివాళా దివాస్!

**తెలంగాణ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు రేఖ బోయలపల్లి**



హైదరాబాద్ వెలుతురు నవంబర్ 29:

9 ఏళ్ల పాలనలో తెలంగాణను 7 లక్షల కోట్ల అప్పుల పాలు చేసి 1 లక్ష ఇరవై వేల కోట్ల బకాయిలు పెండింగ్లో పెట్టి రాష్ట్రాన్ని దివాళా తీయించిన నాయకుడు కేసీఆర్ తెలంగాణ నుంచి "తెలంగాణ" అనే పదం తీసేసి, బిఆర్ఎస్ అనే మరో "దివాళా పార్టీ"తో ప్రజల ముందుకు వచ్చి వరుస ఓటములు చవి చూశారు.


**తెలంగాణ అంటే నిజమైన ప్రేమ ఉంటే ఆ పేరే ఎందుకు తీయించారు?**

నిజమైన దీక్షాదివసులు అంటే తెలంగాణ కోసం ప్రాణాలు అర్పించిన 1,200 మందిరేఖ బోయలపల్లి తెలంగాణ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు అమరవీరులు. వారి త్యాగం సోనియా గాంధీ ని కదిలించింది. రెండు రాష్ట్రాల్లో కాంగ్రెస్‌కు నష్టం వస్తుందని తెలిసి కూడా తెలంగాణ ఇచ్చిన గొప్ప మనసున్న తల్లి సోనియాగాంధీ. అయినా కేసీఆర్ అనే వ్యక్తి తెలంగాణ ఉద్యమంలో కీలక భూమిక పోషించాడు అనే గౌరవం తో తెలంగాణ ప్రజలు మీకే రెండుసార్లు పట్టం కట్టారు. మీరు 10% పోరాడితే, 90% ప్రాఫిట్ మాత్రం కుటుంబమే మింగింది. సీఎం కుర్చీపై తెలంగాణ భావోద్వేగాన్ని లెక్కలేసి, పవర్, డబ్బు, ప్రాజెక్టులు, భూ దందాలతో లక్షల కోట్ల అవినీతి కప్పిపుచ్చారు. కుటుంబమంతా మంత్రులు -కానీ తెలంగాణ యువతకు ఉద్యోగం కాదు. నీళ్లు నిధులు నియామకాల పేరుతో తెలంగాణ ప్రజలకు ఆశ చూపించి నీళ్లు రాయలసీమ కు పంపించి నిధులు నీ కుటుంబం బుక్కి నియామకాలు నీ కుటుంబ సభ్యులకు కట్టబెట్టావు దళిత సీఎం చేస్తా అన్న మాట? తెలాస నుంచి కాంగ్రెస్‌లో విలీనం చేస్తా అన్న మాట? అవి కూడా తెలంగాణ భావోద్వేగాన్ని దోచుకోవడమే. చివరికి 9 ఏళ్ల పాలన = 7 లక్షల కోట్ల అప్పు + ఖాళీ రాష్ట్ర ఖజానా. ప్రజలు నిజం తెలుసుకున్నారు. అందుకే పార్లమెంట్‌లో జీరో, అసెంబ్లీలో ఓటమి, హైదరాబాద్‌లో 2 ఉపఎన్నికల్లో వరుసగా అవమానకర పరాజయాలు. ఇక మీరు పార్టీ పేరు పందసార్లు మార్చినా, వంద గెటప్స్ మార్చినా %-% తెలంగాణ ప్రజలు మిమ్మల్ని నమ్మరు



# సంపాదకీయం.. రాజకీయ పార్టీల నిబద్ధతకు పరీక్ష !

రాజకీయాల్లో సంకల్ప బలం ముఖ్యం. తమతో పాటు బడుగుబలహీన వర్గాలను ముందుకు తీసుకుని వెళ్దామన్న ప్రయత్నం చేయాలి. ఎంతసేపు వారే పల్లకి మోయాలన్న ఫ్యూడల్ భావాలను వీడాలి. పల్లకి ఎక్కే అవకాశం వారికి కూడా కల్పించాలి. వారినీ సానబెట్టి రాటదేలేలా చేయాలి. స్థానిక ఎన్నికల్లో 42 శాతం బిసి రిజర్వేషన్ల అభ్యర్థనను హైకోర్టు తిరస్కరించింది. ఇదే అదనుగా కాంగ్రెసేతర పార్టీలు కాంగ్రెస్‌ను తిట్టిపోస్తూ రాజకీయంగా లబ్ధిపొందాలని చూస్తున్నాయి. నిజానికి రాజకీయంగా లబ్ధి పొందాలంటే ఆయా వర్గాల్లో పట్టును సాధించాలి. అందుకు పార్టీ పరంగా ఆయా వర్గాలను ముందుకు తీసుకుని వెళ్లాలి. హైకోర్టు తీర్పు తరవాత గత్యంతరం లేని పరిస్థితు ల్లో ప్రభుత్వం పాతపద్ధతిలోనే స్థానిక ఎన్నికలకు సిద్ధం అయ్యింది. ఇది ఆహ్వానించదగ్గ విషయం. రిజర్వేషన్లు ఉంటేనే బిసిలను, ఎస్సీ,ఎస్టీలను ఆదరించడం కాదు...లేకున్నా వారికి రాజకీయంగా ప్రవేశం కల్పించాలి. ఇప్పుడు రాజకీయ పార్టీలు అదేపనిగా పాత వ్యవహారాలను తవ్వుతూ పోకుండా తమ పార్టీ పరంగా బిసిలు, ఎస్సీలు, ఎస్టీలను రాజకీయాంగా పైకి తీసుకుని వచ్చే ప్రయత్నాలు చేయాలి. ఎన్టీఆర్ తెలుగుదేశం పార్టీ పెట్టగానే ఎందరో ఎస్సీలు, ఎస్టీలు, బిసిలకు టిక్కెట్లు ఇచ్చి రాజకీయంగా వారికి అండగా నిలిచారు. అనామకులు ఎందరో రాజకీయంగా తెరపైకి చ్చారు. గుంటూరులో కాంగ్రెస్ దిగ్గజం ఆచార్య ఎన్‌జి రంగా లాంటి వారు అనామకుడి చేతిలో ఓటమి చెందారు. అలా ఆనాడు ఎన్టీఆర్ సృష్టించిన ప్రభంజనంలో మహామహులు ఓటమి చెందారు. కొత్త తరం రాజకీయాల్లోకి వచ్చింది. అలా రాజకీయాల్లోకి వచ్చి నిలదొక్కుకున్న వారు నిలదొక్కుకున్నారు. ఆ తరవాత




అదే ఒరవడి సాగింది. ఇది ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో బడుగు, బలహీనవర్గాల రాజకీయ ప్రవేశాలకు నాంది పలికింది. కుల ప్రాతిపదికను మొదటి కమిషన్ రిజర్వేషన్లను వ్యతిరేకిస్తే, కులాన్ని ఒక సూచికగా తీసుకోవాలని ఉన్నత న్యాయస్థానం మండల్ కమిషన్ తీర్పులో స్పష్టం చేసింది. 1992లో ఇందిరా సహాని కేసులో సుప్రీంకోర్టు మొత్తం రిజర్వేషన్లు 50శాతానికి మించకూడదని ఇచ్చిన తీర్పు ఫలితంగా తమిళనాడు సహా ఎన్నో రాష్ట్రాల్లో ప్రతిష్టంభన ఏర్పడింది. చివరికి ఇందిరా సహాని కేసు కూడా పరీక్ష ఎదుర్కొనక తప్పలేదు. తమిళనాడు 69శాతం రిజర్వేషన్లు కల్పించినప్పటికీ సుప్రీంకోర్టు విధించిన పరిధి వల్ల సందిగ్ధత ఏర్పడింది. దీంతో అసెంబ్లీలో ప్రత్యేక చట్టాన్ని తీసుకొచ్చి, 69శాతం రిజర్వేషన్లు అమలు అయ్యేట్టు, సుప్రీంకోర్టు విధించిన 50శాతం పరిధి నుండి రక్షణ పొందడానికి రాజ్యాంగం 9వ షెడ్యూల్లో చేర్చేట్టుగా అప్పటి ముఖ్యమంత్రి జయలలిత పావులు కదిపారు. అయితే ఇదంతా అసెంబ్లీ, పార్లమెంట్ వ్యవహారాల్లో పోరాడాల్సిన అంశం. అప్పటి వరకు ఈ వర్గాలను దూరం చేసుకోవడం తగదు. నిజానికి ఈ వర్గాలను దగ్గరకు చేసుకునేందుకు ఇదో మహత్తర అవకాశంగా రాజకీయ పార్టీలు భావించాలి. సర్పంచ్ పదవి అన్నది ఎవరైనా రాజకీయంగా ఎదగడానికి పరమపద సోపానం లాంటిది. యువతను రాజకీయాల్లో ఆహ్వానిం చేందుకు, గ్రామాలను అభివృద్ధిలో నిలిపేందుకు ఇదో మంచి అవకాశం. అధికార కాంగ్రెస్ సహా అన్ని పార్టీలు సర్పంచ్ ఎన్నికల్లో వివిధ కులవర్గాలకు చెందిన సమర్థులైన యువతను నిలపాలి. చదువున్న వారికి ప్రాధాన్యం ఇవ్వాలి. నిజాయితీ రాజకీయాలను ప్రోత్సహించాలి. అందుకు రిజర్వేషన్లు లేనిచోట్ల ఎస్సీ,ఎస్టీ, బిసి వర్గాలను నిలబెట్టాలి. వారంతా రాజకీయంగా ఎదగడానికి అవకాశం వస్తుంది.దీంతో రాజకీయాల్లో కొత్తనీరు రావడానికి ప్రాతిపదిక వస్తుంది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు తెలంగాణ ప్రభుత్వం పాత రిజర్వేషన్లతోనే పంచాయతీ ఎన్నికలను నిర్వహించక తప్పడం లేదు. మరొకవైపు శాసనసభలో చేసిన తీర్మానాలకు కట్టుబడి, 42 శాతం బీసీ రిజర్వేషన్ల అమలుకు రక్షణ కల్పించేలా 9వ షెడ్యూల్‌ను ఆశ్రయించాలనే ఉద్యమం కొనసాగుతోంది. ఈ విషయంలో ప్రచారం వేగంగా మారుమూల ప్రాంతాల ప్రజలకు కూడా చేరింది. గ్రామాల్లో కూడా ఇప్పుడిప్పుడే యువత రాజకీయాల వైపు మొగ్గుచూపుతోంది. ఎంతకాలం వృద్ధ జంబుకాలే పార్టీల్లో వేలాడకుండా కొత్తతరాన్ని ఆహ్వానించాలి. సమాజంలో అట్టడుగుస్థాయి వర్గాలను వెతికి పట్టుకుని, వారిని రాజకీయాల్లో ముందుకు తీసుకుని రావాలి. ఎంతకాలం వారిని కేవలం కార్యకర్తలుగానే ఉపయోగించకునే దౌర్భాగ్యం నుంచి బయటపడి నవతరం నాయకత్వం అవతరించే దిశగా నేడు పార్టీలు అడుగులు వేయాలి. పార్టీపరంగా వారికి అండదండలు కల్పించాలి. సవాళ్లను ఎదుర్కోవడానికి నిరంతర అవగాహన కల్పించాలి. వారిని రాజకీయాల్లో రాటుదేలేలా చేయాలి. విద్యార్థి ఉద్యమాలతో రాటుదేలిన వారిని ముందుకు దింపాలి. ఇందుకు పార్టీపరంగా సమైక్య పోరాటం అనివార్యంగా గుర్తించాలి. తెలంగాణ శాసనసభలో చేసిన ఏకగ్రీవ తీర్మాణాలకు అనుగుణంగా అన్ని రాజకీయ పార్టీలు 42శాతం రిజర్వేషన్లకు ఆమోదం తెలిపాయి. అదే స్ఫూర్తితో బీసీ సభ్యులను ఇప్పుడు గెలిపించుకోవాలి. పంచాయతీ ఎన్నికలలో సర్పంచ్ ఎన్నికకు పార్టీ గుర్తు ఉండదన్న నెపంతో వీరిని పక్కన పెట్టాలని చూస్తే అసెంబ్లీ తీర్మానాలకు విలువ ఉండదు. అందువల్ల అన్ని పార్టీలు ఈ విషయంలో తీవ్రంగా ఆలోచన చేసి, రిజర్వేషన్లు లేనిచోట్ల వివిధ వర్గాల అభ్యర్థులను నిలబెట్టి ముందుకు నడిపించాలి. రాజకీయాలలో ప్రతి ఒక్కరూ ఓటు వేసే విధంగా మనకు సమానత్వం ఉంది. కానీ సామాజిక, ఆర్థిక జీవితంలో మనకు అసమానతలు అనేకం ఉన్నాయి. ప్రధానంగా రాజకీయాల్లో పదవుల పందేరంలో ఇప్పటికీ అంగ్రవర్గాలదే పైచేయిగా ఉంటోంది. మనం ఈ వైరుధ్యాన్ని వీలైనంత త్వరగా తొలగించాలి. లేకుంటే అసమానతలు ఎదుర్కొంటున్న వారిలో ఆవేశం కట్టలు తెంచుకుంటే, అజమాయిషీ చెలాయిస్తున్న వారు అడుసులో కూరుకు పోతారు. ఎంతో కష్టపడి నిర్మించిన రాజకీయ ప్రజాస్వామ్య నిర్మాణాన్ని బలోపేతం చేయాలంటే అసమానతలు అన్నవి తొలగించుకుంటూ పోవాలి. అందుకు రిజర్వేషన్లే ప్రాతిపదిక కానవసరం లేదు. రాజకీయ సంకల్పం ఉంటే ఇది సాధ్యం అవుతుంది. ఉన్నత వర్గాల వారికి చట్టసభల్లో స్థానాలు తగ్గించి, బీసీ వర్గాలకు స్థానాలు పెంచడం వల్ల సామాజిక సామరస్యత వస్తుంది. ఇప్పుడు రిజర్వేషన్ల కోసం కొట్లాడుతున్న బీసీ నాయకులను ఎన్నికలలో గెలిపించిన చరిత్రను లిఖించినవారు అవుతారు.

## ఓ పథకం బలహీనమైతే... వేల విద్యార్థుల భవిష్యత్తులు

# అంధకారంలోకి తోచినట్టు కాదా...!



మన్నారం నాగరాజు
తెలంగాణలో లోక్‌సత్తా పార్టీ
మాజీ అధ్యక్షుడు.

*రాజకీయ నాయకులు పదవులు, ప్రాభవం కోసం కాదని, సమాజ సేవ కోసం రావాలనే భావన ప్రతి ప్రజాస్వామ్య దేశానికి పునాది. ఆ ధర్మాన్ని కార్యరూపంలో చూపించిన నాయకుల్లో స్వర్గీయ డా. వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి పేరు ముందుంటుంది. ఆయన తీసుకువచ్చిన "ఫీజు రీయింబర్స్మెంట్" పథకం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఒక అమోఘమైన చరిత్రను సృష్టించింది. పేద, మధ్యతరగతి యువత చదువుకి డబ్బులే అడ్డుగా మారకూడదనే సంకల్పమే ఈ పథకానికి కారణం.ఆ సమయంలో వేలాది కుటుంబాలు పిల్లల ఉన్నత విద్య కోసం అప్పులు తీసుకుని, ఆర్థిక ఒత్తిడితో ఉన్నారు. ప్రైవేట్ కళాశాలల్లో చదవడం సామాన్యుడికి అంత సులభం కాదు. అటువంటి సమయంలో రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వ నిర్ణయం ఒక సామాజిక విప్లవంలా మారింది. ఇంజినీరింగ్, మెడిసిన్, డిగ్రీ, పీజీలుపి కోర్సు అయినా ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులు ధైర్యంగా చేరగలిగారు. చదువు మాత్రమే జీవితాన్ని మార్చగలదన్న నమ్మకాన్ని ఈ పథకం బలపరచింది.*

వేలాది మంది మొదటి తరం గ్రాడ్యుయేట్లు, ఇంజినీర్లు, వైద్యులు ఈ పథకం వల్ల సమాజంలో వెలుగు చూసారు. ఒక కుటుంబాన్ని మాత్రమే కాదు, ఆ కుటుంబం వెనుక ఉన్న తరాల భవిష్యత్తును ఈ పథకం మారుస్తుందని అనుభవం చూపింది. పేదరికపు చక్రాన్ని తెంచే శక్తి విద్యలో ఉందని రాజశేఖర్ రెడ్డి ఆచరణ ద్వారా దేశానికి తెలియజేశారు.నేడు కూడా యువత, తల్లిదండ్రులు ఈ పథకాన్ని కృతజ్ఞతతో గుర్తు చేసుకుంటారు. ఇది కేవలం ప్రభుత్వ పథకం కాదుబీ సామాజిక న్యాయం, సమాన అవకాశాల కోసం పోరాడిన ఒక మహానాయకుని సంతకం. రాజకీయ నాయకుడు ప్రజల జీవితాల్లో నిజమైన మార్పు తేవాలంటే ఎలా ఉండాలో వైఎస్సార్ ఇచ్చిన మార్గదర్శకం ఇదే. ఇకవిద్య అనేది ప్రతి సమాజానికీ భవిష్యత్తును నిర్మించే మహత్తర సాధనం. ఒక పేద కుటుంబం పిల్లవాడు చదువుకుంటే కేవలం అతని వ్యక్తిగత జీవితం మాత్రమే మారదు, అతడి కుటుంబం, అతడి వంశం, అతడి గ్రామం, చివరకు సమాజమే ఒక మెట్టు ముందుకు చేరుతుంది. అందుకే విద్యపై ప్రభుత్వం పెట్టే పెట్టుబడి అనేది సాధారణ ఖర్చుగా చూడకూడదు. అది భవిష్యత్తుపై చేసే అత్యంత విలువైన పెట్టుబడి. అయితే ఈ విలువను గుర్తించి, పేదలకు ఉన్నత విద్య చేరువ చేయడానికి ప్రత్యేకమైన విధానంగా ఫీజు రీయింబర్స్మెంట్‌ను అమలు చేసిన దూరదృష్టి నాయకుడు డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి. ఆయన కాలంలో ఉన్నత విద్య అంటే ధనికుల ఆస్తి కాదు,పేదలకు కూడా అందుబాటులో ఉన్న హక్కు. అయితే నేడు అదే పథకం మహత్వాన్ని కోల్పోతూ, తూట్లు పెట్టుకుంటూ, వేలాది విద్యార్థుల భవిష్యత్తును అనిశ్చితిలోకి నెట్టేస్తున్న అత్యంత సీరియస్ దశలోకి ప్రవేశించిందనిపిస్తోంది.ఒకప్పుడు ఫీజు రీయింబర్స్మెంట్ పథకం కారణంగా పేద కుటుంబాల పిల్లలు ఇంజినీరింగ్, మెడిసిన్, డిగ్రీ, పీజీ, పాలిటెక్నిక్ వంటి ఎన్నో కోర్సుల్లో చేరి, భవిష్యత్తుపై ధైర్యంగా అడుగులు వేసేవారు. వారి కుటుంబాలు కూడా "మన బిడ్డ చదువుకుంటున్నాడు, రేపు ఉద్యోగం వస్తుంది, మన పరిస్థితి మారుతుంది" అనే నమ్మకంతో ప్రజలు జీవించేవాళ్ళు, కాని ఇటీవలి సంవత్సరాల్లో పరిస్థితి పూర్తిగా మారిపోయింది. ప్రభుత్వం రీయింబర్స్మెంట్‌ను సమయానికి విడుదల చేయకపోవడం, బడ్జెట్ కేటాయింపులను తగ్గించడం, కొత్త నియమాలు పెట్టడం, కాలేజీలను ఆర్థిక సంక్షోభంలోకి నెట్టడం. విద్యార్థుల భవిష్యత్తును నేరుగా ప్రభావితం చేస్తున్నాయి.ఇప్పటి పరిస్థితి ఏమిటంటే, పేద కుటుంబాల్లో చదువుతున్న చాలా మంది విద్యార్థులు రీయింబర్స్మెంట్ ఆలస్యం వల్ల ప్రమాదకరమైన స్థితిలో నిలిచిపోయారు. కాలేజీలు ఫీజులు రాలేని కారణంగా వారిపై ఒత్తిడి పెడుతున్నాయి. "రీయింబర్స్మెంట్ రాకపోతే మేము క్లాసుల్లోకి అనుమతించలేం", "సెమిస్టర్ పరీక్షలకు మీరు ఫీజు చెల్లించాలి", "రీయింబర్స్మెంట్ వచ్చినప్పుడు మేము రీఫండ్ చేస్తాం" వంటి మాటలు విని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు రోజూ భయాందోళనల్లో ఉన్నారు. దీనివల్ల పేద పిల్లలు, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలకు చెందిన అభ్యుదయ ఆశతో చదువుతున్న యువకులు, తమ చదువును కొనసాగించాలా? లేక ఇంటికి వెళ్లి ఏదైనా కార్మిక పని చేసి కుటుంబాన్ని ఆదుకోవాలా? అనే రెండు మార్గాల మధ్య చిక్కుకుపోతున్నారు.వాస్తవానికి ప్రైవేట్ కాలేజీల పరిస్థితి కూడా అంతే దారుణంగా ఉంది. రీయింబర్స్మెంట్ బకాయిలు 6 నెలలు, 1 సంవత్సరం, కొన్నిసార్లు 2 సంవత్సరాల వరకూ పెండింగ్‌లో ఉండటం వలన కాలేజీలు తమ సిబ్బందికి జీతాలు చెల్లించలేని స్థితికి చేరాయి. ల్యాబ్ పరికరాల నిర్వహణ, హాస్టల్ సదుపాయాలు, విద్యార్థుల సేవా కార్యక్రమాలు అన్నీ బలహీనపడ్డాయి. ఉపాధ్యాయులు స్థిరమైన జీతం రాకపోవడంతో నిరుత్సాహానికి గురవుతున్నారు. కొన్ని కాలేజీలు తాళాలు వేసిన ఉదాహరణలు కూడా ఉన్నాయి. కాలేజీలు మూసివేయబడడం అంటే వాటిలో చదువుతున్న వేలాది విద్యార్థులు అకస్మాత్తుగా వీధుల్లోకి రావడం. ఇవన్నీ చూస్తే రీయింబర్స్మెంట్ వ్యవస్థను నిలబెట్టడంలో ప్రభుత్వం ఎంత వైఫల్యం చెందిందో స్పష్టంగా తెలుస్తోంది.

ఇంకా అత్యంత బాధాకరమైన విషయం ఏమిటంటే ఫీజు రీయింబర్స్మెంట్ పంపకాల్లో తీవ్ర గందరగోళం, నిబంధనల మార్పులు, సకాలంలో క్లియరెన్స్ లేకపోవడం వంటి వాటి వలన విద్యార్థులలో పెద్ద సంఖ్యలో డ్రాప్ అవడం ప్రారంభమైంది. ఒక విద్యార్థి మధ్యలో చదువు మానేస్తే అది వ్యక్తిగత పరాజయం కాదు, అది ఒక సామాజిక నష్టం. అతని కుటుంబం చేసిన త్యాగాలన్నీ వృథా అవుతాయి. అతని భవిష్యత్తు అనిశ్చితిలో పడుతుంది. ఉద్యోగాల్లో పోటీ భారీగా ఉన్న ఈ కాలంలో, ఒక డిగ్రీ ఆపేయడం అంటే అతని జీవితం పూర్తిగా వెనుకబడిపోవడం. కాని దురదృష్టకరం ఏమిటంటే, ఈ డ్రాప్ అవుతున్న యువతపై ఎవరు దృష్టి పెట్టడం లేదు. కనీసం ప్రభుత్వం తో పాటు , రాజకీయ నాయకులు కూడా. స్పందించాల్సిన అవసరం ఉంది. ఇక విద్యార్థులు మానసిక ఒత్తిడితో బాధపడుతున్నారు. "రీయింబర్స్మెంట్ డబ్బులు ఎప్పుడు వస్తాయి?" అనే ప్రశ్నకు ఎవరు సమాధానం చెప్పడం లేదు. అధికారులు ఒకరికి ఒకరు బదిలీ ఉంటూ, పత్రాలు ఒక టేబుల్ నుంచి మరో టేబుల్‌కి మాత్రమే కదిలిపోతున్నాయి. కానీ ప్రభుత్వం పథకాన్ని కొనసాగిస్తున్నామని చెప్పినా, వాస్తవంలో ఆ పథకం ప్రాణాంతక స్థితిలోకి వెళ్లింది. విద్యార్థుల అభ్యాసం క్రమశిక్షణగా సాగాలంటే ఆర్థిక భారం ప్రభుత్వం భుజాన వేసుకోవాలి. కానీ ప్రభుత్వం కాలం గడుస్తున్న కొద్దీ విద్యపై పెట్టుబడిని తగ్గిస్తూ, పథకాలను బలహీనపరుస్తూ ఉంటే, ఎలా పేదలు ఉన్నత విద్య సాధిస్తారు?డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి ఆ అమూల్యమైన పథకాన్ని ప్రారంభించినప్పుడు ఒక గొప్ప లక్ష్యం ఉండేదిపేద పిల్లలకు విద్యలో సానుకూల అవకాశాలు ఇవ్వడం. ఆ లక్ష్యం ఒక సామాజిక భవిష్యత్తును మార్చే పథకం. కానీ నేడు అదే పథకం నిర్లక్ష్యానికి గురవుతూ, తన విలువను కోల్పోకుండా పోరాడుతున్న స్థితికి చేరింది. పైగా, ప్రతి సంవత్సరం వేలాది విద్యార్థులు రీయింబర్స్మెంట్ ఆలస్యం వల్ల పరీక్షలు రాయకపోవడం, ఇంటికి వెళ్లిపోవడం, హాస్టల్‌లో బకాయిలతో అవమానకర పరిస్థితులు ఎదుర్కోవడం వంటి సంఘటనలు పెరుగుతున్నాయి. ఒక ప్రభుత్వం విద్యార్థుల సమస్యలను పట్టించుకోకపోతే, ఆ ప్రభుత్వం భవిష్యత్తును పట్టించుకోకుండా ఉన్నట్టే.


కాలేజీలు కూడా నేటి పరిస్థితుల్లో బలహీనపడ్డాయి. ఒక్కో విద్యార్థి ఫీజు రీయింబర్స్మెంట్ 35,000 నుంచి 70,000 వరకు ఉన్నప్పటికీ, కాలేజీలు సంవత్సరాల తరబడి ఆ డబ్బుల కోసం ఎదురు చూస్తున్నాయి. ప్రైవేట్ కాలేజీలు వాణిజ్య వ్యాపారాలుగా కనిపించినా, వాటిలో నడుస్తున్న అధ్యాపకులు, సిబ్బంది కూడా కుటుంబాలు ఉన్న మనుషులే. వారికి వేతనాలు రాకపోతే ఆ కుటుంబాల పరిస్థితి కూడా అలాగే దెబ్బతింటుంది. ఈ మొత్తం సంక్షోభం యొక్క మూలం ప్రభుత్వ నిర్లక్ష్యం, బాధ్యత లేకపోవడం.విద్యార్థులు ఇంతటి ఆర్థిక ఒత్తిడిలో చదువుతుంటే వారి విద్యా నాణ్యత ఎలా మెరుగుపడుతుంది? ఒక విద్యార్థి ఆలోచన మొత్తం రేపటి ఫీజు గురించి ఉంటే, అతని దృష్టి చదువుపై ఎలా ఉంటుంది? విద్యార్థులు అనిశ్చితిలో ఉన్న సమాజం అభివృద్ధి చెందదు. మనం దేశంగా బలంగా ఎదగాలంటే మన యువతకు బలోపేతమైన విద్య మరియు ఆర్థిక భద్రత అవసరం. కానీ ప్రస్తుతం జరుగుతున్నది దీని పూర్తిగా విరుద్ధం.ప్రభుత్వం ఏవైనా పథకాలు ప్రారంభించవచ్చు, ఏవైనా నూతన కార్యక్రమాలు ప్రకటించవచ్చు. కాని విద్యపై ఉండే పథకాల విషయంలో రాజకీయాలు చేయకూడదు. విద్యకు సంబంధించిన పథకాలు ప్రభుత్వాలు మారినా, పార్టీలు మారినా, నిరంతరంగా కొనసాగాలి. ఒక విద్యార్థి చదువును మధ్యలో ఆపడం అంటే సమాజానికే నష్టం. విద్యార్థి తన సమయాన్ని కోల్పోతాడు, కుటుంబం తన ఆశను కోల్పోతుంది, రాష్ట్రం తన నైపుణ్యాన్ని కోల్పోతుంది. అయినప్పటికీ ఈ దశలో రాజకీయ నాయకుల నిశ్శబ్దం ఎంతో బాధాకరం.ప్రస్తుతం అత్యవసరం ఏమిటంటేరీయింబర్స్మెంట్ బకాయిలన్నిటినీ వెంటనే క్లియర్ చేయటం."రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఫీజు రీయింబర్స్మెంట్, స్కాలర్షిప్ పథకాలను మరింత పారదర్శకంగా అమలు చేస్తామని హామీ ఇచ్చారు. కానీ, ప్రస్తుతం తీవ్ర నిర్లక్ష్యం జరుగుతున్నది. రాష్ట్రంలో 1,800 ప్రైవేట్ కాలేజీల్లో చదువుతున్న 14 లక్షల మంది విద్యార్థులకు రూ. 8,042 కోట్ల ఫీజు రీయింబర్స్మెంట్, రూ. 1,924 కోట్ల స్కాలర్షిప్లు పెండింగ్లో ఉన్నాయి. ఈ నిధులు చెల్లించకపోవడంతో విద్యార్థులతో పాటు కళాశాల యాజమాన్యాలు, వాటిలో పనిచేస్తున్న 2.5 లక్షల మంది ఉద్యోగులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విద్యా సంస్థల్లో అక్రమాలు ఉంటే చర్యలు తీసు కోవాలి కానీ బకాయిలను ఆపడం సరికాదు. ఇక తెలంగాణ ప్రభుత్వం అప్పుల్లో ఉంది అని ముఖ్యమంత్రి ఒక వేదికపై చెప్పారు -కానీ ప్రభుత్వంలో ఎమ్మెల్యేలు, ఎంపీల కొరకై 1, ఏప్రిల్ 2023, కేంద్రప్రభుత్వం, నాయకులు తమ జీతాలు పెంచు కున్నారు. కనీసం ఒక నెల జీతాన్ని పిల్లల విద్యకోసంఇవ్వ లేదా? అనే ప్రశ్న. ఇక తెలంగాణ రాష్ట్రం అప్పులకూపంలో కూరుకుపోతున్న సంగతి అందరికీ తెలిసినదే. వేల కోట్ల రూపాయల రుణాలు తీసుకుని, వాటి వడ్డీలు చెల్లించలేని పరిస్థితిలో ప్రభుత్వ ఖజానా నిలబెట్టిన రీతిని చూస్తుంటే, ఇది పాలకుల చేతుల్లో ఆర్థిక పరిపాలనకు వచ్చిన పతనా నికి నిదర్శనం. కానీ ఇది మనదేశంలో ఆశ్చర్యంగా భావిం చనవసరంలేదు. ఎందుకంటే ఒకవైపు అప్పుల సంగతి గగ్గోలు పెట్టుతుంటే, ఇంకొకవైపు ఎమ్మెల్యేలు, ఎంపీలు, ముఖ్యమంత్రులు తమ జీతాలను సర్దుబాటు చేసుకుంటు న్నారు. పైగా పెంచుకుంటూపోతున్నారు? పేదరికం, నిరు ద్యోగం, రేషన్ కోత, విద్యుత్ ధరల పెంపు, ఎల్పీజీ ధరల బాదుడు ఇలా ఒక సామాన్యుడి బతుకు ప్రతీ మూలకు దెబ్బతింటుంటే, నాయకులకు మాత్రం వెండిగిన్నెల్లో భోజ నం నడుస్తోంది. మంత్రుల వృథా ఖర్చులు, అధికారులు దుబారా ఖర్చులు ఎక్కువయ్యాయి, పిల్లలు ప్రభుత్వ పాఠ శాలల్లో పుస్తకాలు లేక చదువుతుంటే, నాయకుల పిల్లలు విదేశీ స్కూళ్లలో చదువుతున్నారు. ప్రతి సంవత్సరం బడ్జెట్ప్రవేశపెట్టినప్పుడు, ప్రభుత్వ ఖర్చులలో నాయకుల జీతభత్యాలు, ఒక పెద్ద భాగాన్ని ఆక్రమిస్తుంటాయి. ప్రజలు తమ పిల్లల కోసం విద్య కోసం అప్పులు చేస్తుంటే, నాయకులు మాత్రం అధికారానికి వందల కోట్లు ఖర్చుచేస్తూ ఎన్నికలు గెలుస్తు న్నారు. కనీసం ఒక్క నెల జీతాన్ని రాష్ట్రంలోని పేద విద్యా ర్థుల విద్యకోసం విరాళంగా ఇవ్వడంవల్ల, వేలమంది చిన్నా రులకు పుస్తకాలు, దుస్తులు, ఫీజు సహాయం చేయవచ్చు. ప్రభుత్వ పాఠశాలల్లో టాయిలెట్లు, బలపరిచిన తరగతి గదులు నిర్మించవచ్చు. విద్యాబోధనలో నాణ్యత పెంపు కోసం ఉపాధ్యాయులకు అవసరమైన సదుపాయాలు కల్పిం చవచ్చు. కనీస బాధ్యత చూపించాల్సిన అవసరం ఉంది. ఇకకాలేజీలకు స్పష్టమైన టైమ్‌లైన్ ఇవ్వటం. విద్యార్థుల కుటుంబాలకు "మీ పిల్లలు చదువుతున్నంత కాలం ప్రభుత్వం మీతో ఉంది" అనే ఆత్మవిశ్వాసం ఇవ్వడం. పేదలకు విద్య చేరువ కావడం అనేది ఓ ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదు,అది మానవ హక్కులకు దగ్గరగా ఉన్న అత్యంత ప్రధాన నైతిక బాధ్యత.తద్వారా, నేటి పరిస్థితుల్లో ప్రభుత్వం మేల్కొనాల్సిన సమయం ఆసన్నమైంది. పథకాన్ని బలోపేతం చేయాలి, సమయానికి చెల్లింపులు చేయాలి, రీయింబర్స్మెంట్‌ను రాజకీయాల మీద ఆధారపడకుండా రక్షించాలి. విద్యార్థులు అయోమయంలో ఉండకూడదు. పేద పిల్లవాడి ఆశలు తూట్లు పొడవకూడదు. ఒక పథకం బలహీనపడితే అది పది వేల భవిష్యత్తులను దెబ్బతీస్తుంది. అందుకే విద్యార్థుల కోసం, సమాజం కోసం, రాబోయే తరాల కోసం, ప్రభుత్వం ఇప్పటికైనా తన బాధ్యతను గ్రహించి, ఫీజు రీయింబర్స్మెంట్ పథకాన్ని పునర్జీవితం చెయ్యాలని కోరుకుందాం.

# కంప్యూటర్ శిక్షణ

నియో కర్సర్ సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు నిరుద్యోగులకు, మహిళలకు, వయోపరిమితి లేకుండా, గత 8 సంవత్సరాలుగా కంప్యూటర్ కోర్సులు నేర్పిస్తున్నాము. ఆసక్తి కలిగిన వారు వెంటనే దరఖాస్తు చేసుకోగలరు.
మేము అందిస్తున్న కోర్సులు :
ఎం ఎస్ ఆఫీస్. అడ్వాన్స్ ఎక్సెల్. ట్యాలి. తెలుగు డి.టి.పి. ఇంగ్లీష్ డి. టి .పి. ఫోటోషాప్ . పేజ్ మేకర్. కార్క్ ఎక్స్ ప్రెస్ ( న్యూస్ పేపర్ డిజైనింగ్)
విద్యార్హత : కనీసం 10వ తరగతి.
వివరాలకు ఈ కింది నంబర్ ని సంప్రదించండి. 9494864040.
నియో కర్సర్, సుందరయ్య విజ్ఞాన కేంద్రం. బాగ్ లింగంపల్లి, హైదరాబాద్.

# ప్రధానమంత్రి నరేంద్ర మోడీ కి బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగం గౌడ్ లేఖ

**- పార్లమెంట్ బీసీ రిజర్వేషన్ల బిల్లు పెట్టి బీసీలకు విద్యా ఉద్యోగ రాజకీయ రంగాల్లో రిజర్వేషన్లు కల్పించాలని విజ్ఞప్తి**



**హైదరాబాద్ వెలుతురు నవంబర్ 29:** డిసెంబర్ ఒకటి నుంచి జరిగే పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో బీసీలకు విద్యా ఉద్యోగ రాజకీయ రంగాల్లో జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు కల్పించేందుకు వెంటనే పార్లమెంటులో బీసీ రిజర్వేషన్ల బిల్లు పెట్టి ఆమోదించాలని కోరుతూ బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగం గౌడ్ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ గారికి లేఖ రాసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా లింగం గౌడ్ మాట్లాడుతూ బీసీలకు విద్యా ఉద్యోగ రాజకీయ రంగాల్లో రిజర్వేషన్లు కల్పించాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో చట్టం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపిందని దానిని యధావిధిగా పార్లమెంట్లో చట్టం చేయాలని విజ్ఞప్తి చేస్తున్నాం.రాత్రికి రాత్రి ఈడబ్ల్యూఎస్ పేరుతో అగ్రకులాలకు 10 శాతం రిజర్వేషన్ల కోసం చట్టం చేసిన మీరు బీసీల పట్ల సవతి తల్లి ప్రేమ చూపించడం సరికాదన్నారు.రాజకీయ అధికారం ద్వారానే బీసీల అభివృద్ధి సాధ్యం కనుక,మా న్యాయమైన వాటా కోసం రిజర్వేషన్లు కల్పించి సామాజిక న్యాయం చేయాలి.

# పీర్జాదిగూడలో ఘనంగా దీక్ష దీవాస్..

**- హాజరైన మల్లారెడ్డి,జక్క వెంకట్ రెడ్డి.**





**మేడిపల్లి నవంబర్ 29 వెలుతురు:** తెలంగాణ రాష్ట్ర సాధన దశ,దిశను మార్చిన అపురూప ఘట్టమే దీక్షా దివస్.పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో జరిగిన దీక్షా దీవాస్ కార్యక్రమానికి మాజీ మంత్రి, మేడ్చల్ శాసన సభ్యులు చామకూర మల్లారెడ్డి,నగర మాజి మేయర్ జక్క వెంకట్ రెడ్డి,యూత్ అధ్యక్షుడు పైళ్ల ప్రభాకర్ రెడ్డి హాజరై తెలంగాణ తల్లి విగ్రహానికి,అమరవీరుల స్తూపానికి పుష్పాంజలి ఘటించి అనంతరం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ ప్రదాన కార్యదర్శి ఎడవల్లి రఘువర్ధన్ రెడ్డి,మాజి కార్పొరేటర్లు,యూత్ నాయకులు ప్రవీణ్ రెడ్డి,సతీష్ గౌడ్,రాజశేఖర్ రెడ్డి,రఘు,షాహిద్,రవికుమార్ భీమ్రావు,సతీష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# హుస్నాబాద్‌లో పలు అభివృద్ధి పనులు

**- 3న సిఎం చేతుల మీదుగా ప్రారంభం**

**- పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన పొన్నం**



**సిద్దిపేట,నవంబరు29 ( వెలుతురు):** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జిల్లాల పర్యటనలో భాగంగా డిసెంబర్ 3వ తేదీన హుస్నాబాద్‌లో పర్యటించనున్నారు. పలు కార్యక్రమాల్లో సీఎం పాల్గొంటారు. అనంతరం భారీ బహిరంగ సభలో ప్రసంగించనున్నారు. సీఎం పర్యటన దృష్ట్యా పోలీసు అధికారులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ క్రమంలో హుస్నాబాద్ పట్టణ శివారులోని ఏనె వద్ద మైదానంలోని బహిరంగ సభ ప్రాంగణాన్ని మంత్రి పొన్నం ప్రభాకర్ పరిశీలించారు. పోలీసులకు మంత్రి పొన్నం కీలక ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మీడియాతో మాట్లాడారు. ప్రజాపాలన ప్రభుత్వం రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా జరిగిన అభివృద్ధి, ఇంకా చేయాల్సిన అభివృద్ధి పనులపై ఈ సభలో ముఖ్యమంత్రి మాట్లాడుతారని చెప్పుకొచ్చారు. హుస్నాబాద్ నియోజకవర్గానికి సంబంధించిన అనేక అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేస్తారని మంత్రి పొన్నం ప్రభాకర్ వివరించారు. ముఖ్యమంత్రి, కేబినెట్ మంత్రుల సహకారంతో మిగిలిన సమస్యలను ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పరిష్కరించి ముందుకెళ్లే ప్రయత్నం చేస్తామని పేర్కొన్నారు. నాలుగు జిల్లాల మధ్యలో కేంద్రంగా ఉన్న హుస్నాబాద్ నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేసేలా కృషి చేస్తున్నామని తెలిపారు. ముఖ్యమంత్రి సభకు హుస్నాబాద్ నియోజకవర్గ ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ కోరారు.

# నారాయణ పాఠశాలలో థ్యాంక్స్ - గివింగ్ కార్యక్రమం





**హయత్ నగర్ నవంబర్ 29 (వెలుతురు):** హయత్ నగర్ నారాయణ పాఠశాలలో థీమ్ ఆఫ్ ది మంత్ లో బాగంగా ఈ కిడ్స్, ఈ చాంప్స్ విద్యార్థులు "థ్యాంక్స్ - గివింగ్" కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పిల్లలు తమ తమ మానవత్వాన్ని సేవాగుణాన్ని వ్యక్తపరిచారు. ఇందుకు గాను పిల్లలు పండ్లు, కూరగాయలు, బియ్యం, దుస్తులు మొదలైనవి హయత్నగరలోని "సుధీర్ ఫౌండేషన్" కు వెళ్ళి అక్కడ ఉన్న అనాథపిల్లలకు అందించారు. పిల్లలలో సాంఘీక సేవాభావాలు పెంపొందింప జేయడమే ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశం. ఈ కార్యక్రమానికి పిల్లల తల్లిదండ్రులు కూడా తమవంతు ప్రోత్సాహాన్ని పిల్లలకు అందించారు. ఈ కార్యక్రమంలో భాగంగా నారాయణ స్కూల్ ఎ.జి.యం రవీంద్రబాబు గారు ఎ, ప్రిన్సిపల్ లావణ్య, మానస మరియు ఇతర ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# హిమాయత్ నగర్ డివిజన్లోఎస్సీ, ఎస్టీ సివిల్ రైట్స్ డే ....



**హైదరాబాద్ వెలుతురు నవంబర్ 29:** హిమాయత్ నగర్ డివిజన్లో సంజయ్ గాంధీ నగర్ బస్తీలో హిమాయత్ నగర్ ఎమ్మార్వో సంధ్యారాణి ఎస్సీ, ఎస్టీ సివిల్ రైట్స్ డే అనే కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది, ఈ యొక్క కార్యక్రమానికి కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్ గౌడ్ , నారాయణగూడ సీఐ శైలేశ్వర్ , సివిల్ సప్లై డిపార్ట్మెంట్, ఎలక్ట్రిసిటీ, వాటర్ వర్క్స్, జిహెచ్ఎంసి, ఆల్ డిపార్ట్మెంట్స్ అఫీషియల్స్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వచ్చిన



అధికారులను ప్రజల వద్దకు వచ్చినప్పుడు వారికి అందే స్కీములు గాని వారికి సంబంధించిన సమస్యలు గానీ తెలియజేసినప్పుడు వాటికి సంబంధించిన పూర్తి వివరాలతో రావాల్సిందిగా అప్పుడు మాత్రమే ఇలాంటి కార్యక్రమం నిర్వహించడం వలన ఉపయోగం ఉంటుందని వాటికి సంబంధించిన వివరాలను క్లియర్గా ప్రజలకు తెలప లేనప్పుడు ప్రభుత్వం నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో ప్రజలకు వారి యొక్క రైట్స్ వినియోగించుకునే అవకాశం ఉండదని పూర్తి వివరాలతో సంబంధిత అధికారులు రావాలని తెలియజేశారు ముఖ్యంగా సివిల్ సప్లై విభాగం వారు ప్రభుత్వం తరఫున ఇచ్చిన రేషన్ కార్డుల యొక్క వివరాలు తీసుకుని వస్తేనే గవర్నమెంట్ కు మంచి పేరు వస్తుందని అలాగే సివిల్ సప్లై విభాగం వారు తాము చేసిన సర్వేలలో రేషన్ కార్డు అందరి వారికి దానిలో ఉన్న సమస్యలు సరిగ్గా తెలియజేయాలని ముఖ్యంగా బస్తీలలో ప్రభుత్వ ఆరు పథకాల స్కీములో వాళ్ళు ఏదైతే అప్లై చేశారో అదే రేషన్ కార్డు ఫామ్ అని అనుకుంటున్నారని కాకుండా వాళ్లు ఏదైతే వెళ్లి మీసేవ సెంటర్లో అప్లై చేసుకోవాలో దాని పట్ల వాళ్లకి అవగాహన లేదు కాబట్టి అక్కడ ఉన్న వారిలో చాలా మార్పు అప్లై చేసుకోలేకపోయారని కాబట్టి వారికి అవగాహన ఏర్పరచాల్సిందిగా చెబుతూ ఈ కార్యక్రమాన్ని ఇక ముందట పూర్తి వివరాలతో నిర్వహించాల్సిందిగా అధికారులు కోరడం జరిగింది, ఈ యొక్క కార్యక్రమంలో సంజయ్ గాంధీనగర్ బస్తివాసులు అందరూ పాల్గొనడం జరిగింది.

# బికెసిఆర్ ని మరో మారు ముఖ్యమంత్రి చేసేవరకు ప్రతి నాయకుడు, కార్యకర్త దీక్షగా పనిచేయాలి

**: బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్**






**కుత్బుల్లాపూర్ వెలుతురు నవంబర్ 29**

ఈరోజు కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధి గండి మైసమ్మ లోని మేడ్చల్ జిల్లా బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు అధ్యక్షతన నిర్వహించిన "దీక్షా దివాస్" కార్యక్రమంలో బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్, ఎమ్మెల్సీ నవీన్ రావు, మాజీ మంత్రి ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి, ఎమ్మెల్యేలు మాధవరం కృష్ణారావు, బండారి లక్ష్మారెడ్డి, మర్రి రాజశేఖర్ రెడ్డి, పార్లమెంట్ ఇంచార్జ్ రాగిడి లక్ష్మారెడ్డి, ఎంబీసీ మాజీ చైర్మన్ నందికంటి శ్రీధర్ లు పాల్గొని తెలంగాణ రాష్ట్ర సాధకులు, బిఆర్ఎస్ అధినేత కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ....అడుగడుగున అవమానాలు, వివక్షతకు గురైన ఈ ప్రాంతం ప్రత్యేక రాష్ట్ర సాధన ద్వారా ఆవిర్భవించిన తెలంగాణను పదేళ్ల కాలంలో దేశంలోనే అగ్రపథాన నిలిపిన దార్శనికులు, బిఆర్ఎస్ అధినేత కేసీఆర్ గారన్నారు. నాడు తెలంగాణ రాష్ట్రం కోసం తమ పదవులను సైతం తృణప్రాయంగా వదిలేసిన గొప్ప నాయకులు కేసీఆర్ గారు అని అన్నారు. తెలంగాణ రాష్ట్రం కోసం పోరాడిన తీరును, ఉద్యమ పంథాను నేటి యువతకు తెలియజేయాలన్నారు. రానున్న తెలంగాణ సార్వత్రిక ఎన్నికల్లో కేసీఆర్ మరోమారు సీఎం చేసే వరకు ప్రతీ నాయకుడు, కార్యకర్త ఒక దీక్షతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, అభిమానులు, మహిళా నాయకురాలు, కార్యకర్తలు, అనుబంధ సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# కెసిఆర్ దీక్ష.. దివాస్ వల్లే రాష్ట్రం సిద్ధించింది.

## - కార్పొరేటర్ మాధవరం రోజా దేవి రంగారావు...

**కూకట్ పల్లి నవంబర్ 29 వెలుతురు:** కెసిఆర్ దీక్ష దివాస్ వల్లే తెలంగాణ రాష్ట్రం సిద్ధించిందని కార్పొరేటర్ మాధవరం రోజా దేవి రంగారావు అన్నారు. దీక్ష దివాస్ సందర్భంగా శేరిలింగంపల్లి నియోజకవర్గం, వివేకానంద నగర్ డివిజన్ లోని మాధవరం నగర్ కాలనీ లోగల డివిజన్ పార్టీ కార్యాలయం నందు ఆమె స్థానిక నాయకులతో కలిసి పార్టీ జెండాని ఆవిష్కరించి అనంతరం గండి మైసమ్మ చౌరస్తా లోని మేడ్చల్, మల్కాజ్గిరి జిల్లా బిఆర్ఎస్ పార్టీ కార్యాలయానికి తరలి వెళ్లారు.ఈ సందర్భంగా కార్పొరేటర్ రోజా దేవి మాట్లాడుతూ తెలంగాణ ప్రజలకి నేడు శుభకరమైన రోజు అని అన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఎన్నో ఏళ్లుగా కష్టపడిన రానీ తెలంగాణను కెసిఆర్ 2001లో పార్టీని స్థాపించి ఉద్యమం నడిపించి తెలంగాణ ప్రజలందరికీ ఏకతాటిపైకి తీసుకువచ్చి 29 నవంబర్ 2009 దీక్ష చేపట్టి తెలంగాణ వచ్చుడో కేసీఆర్ సచ్చుడో అనే నినాదం తోటి ప్రారంభించి పది రోజులు దీక్ష చేయడం వలన ఆనాటి కేంద్ర ప్రభుత్వం తెలంగాణ ని గత్యంతరం లేని పరిస్థితిలో 9 డిసెంబర్ 2009 నాడు తెలంగాణ నీ ప్రకటించి నందున 2 జూన్ 2014 రోజు నా తెలంగాణను ఏర్పాటు చేసి ప్రజలకు




విముక్తి కలిగించిన దాంట్లో కేసీఆర్ విజయం సాధించడం జరిగిందన్నారు. తెలంగాణ ప్రజలు మర్చిపోలేని రోజు అని పేర్కొన్నారు. అలాగే ఇప్పుడు ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం మళ్లీ అలాంటి పరిస్థితులను తెలంగాణ ప్రజలకి చూపిస్తున్నారు కనుక మరొకసారి తెలంగాణ ప్రజలందరూ కూడా కేసీఆర్ వైపు ఉండి మళ్లీ కేసీఆర్ ని ముఖ్యమంత్రి నీ చేసుకునే విధంగా ఉద్యమం చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ సీనియర్ నాయకులు గొట్టుముక్కల పెద్ద భాస్కరరావు, మాచర్ల భద్రయ్య, వేముల ఆంజనేయులు, శ్రీనివాస్, సత్యనారాయణ, జగదీష్ గౌడ్, రామచందర్, రవీందర్ రావు, నరసింహారెడ్డి, మోహన్ రావు, మల్లయ్య, శేఖర్, బండప్ప, యాదగిరి, ప్రవీణ్, బాబు, విక్రమ్, చిన్న, సోమేష్ ,అరవింద్, రవి, మోహన్ చారి, శ్రీనివాస్, జై, కుమార్, వెంకటేశ్వరరావు, సంతోష్, నవీన్, హరి, అనిల్, ప్రవీణ్, మల్లేష్, నవీన్ చారి, వెంకట్, మహేష్, మురళి, సతీష్, రామ్మూర్తి, సాయి, రాము, మాధవి రెడ్డి, శైలజ, రాధిక, కరుణ, తదితరులు పాల్గొన్నారు.

# ఆదరించండి అభివృద్ధి చేస్తా

**- మారేపల్లి మల్లారెడ్డి కొమ్మాయిగూడెం కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థి**



**రామన్నపేట వెలుతురు న్యూస్ నవంబర్ 29:**
ఈ ఎన్నికల్లో తనను ఆదరిస్తే కొమ్మాయిగూడెం గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానని కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థి మారేపల్లి మల్లారెడ్డి పేర్కొన్నారు. ప్రభుత్వ పథకాలు పేదల ఇంటింటికి చేరే విధంగా కృషి చేస్తానని డ్రైనేజీ వాటర్ సమస్య లేకుండా పరిష్కరిస్తానని తెలిపారు. పేదల కష్టాలు తీర్చడానికి ముందుకు వస్తానని గ్రామస్తులకు తెలిపారు. గ్రామాలలో మౌలిక సదుపాయాలు కల్పన కృషి చేస్తానని గ్రామానికి సేవ చేస్తూ రుణాలు తీర్చుకుంటానని తెలిపారు.

# దీక్షా దివాస్ కార్యక్రమంలో పాల్గొన్న బిఆర్ఎస్ నాయకులు



**రామన్నపేట వెలుతురు న్యూస్ నవంబర్ 29:**
మండల కేంద్రంలో బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో దీక్ష దివాస్ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. కెసిఆర్ సచ్చుడు తెలంగాణ వచ్చుడో అనే నినాదంతో కెసిఆర్ తలపెట్టిన దీక్షా దివాస్ కార్యక్రమం సందర్భంగా పట్టణ కేంద్రంలోని సుభాష్ సెంటర్ వద్ద కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేయడం జరిగింది. అలాగే ఆసుపత్రిలో పేషెంట్లకు అరటి పండ్లు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు పోషబోయిన మల్లేశం మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బందెల రాములు మాజీ ఎంపీటీసీలు సాల్వేర్ అశోక్, వేమవరం సుధీర్ బాబు, జిల్లా నాయకులు కన్నెబోయిన బలరాం, బద్దుల రమేష్, ఎస్కే చాంద్, పట్టణ కార్యదర్శి జాడ సంతోష్ నాయకులు బాలగోని నరసింహ, మిర్యాల మల్లేష్, బొడ్డు అల్లయ, దుండగుల సమ్మయ్య, జాల అమరేందర్ రెడ్డి, గోదాస్ ప్రవీణ్, బొలుగుల కృష్ణ, వంగాల యాదయ్య, నల్ల సైదులు, బాసాని రాజు, గట్టు శేఖర్, పెద్దగోని రాజు, వంగాల సాయి తదితరులు పాల్గొనడం జరిగింది.

# కపిల్ కుటీర్ ఆధ్వర్యంలో పిల్లల దత్తత కార్యక్రమం పై అవగాహన





**కరీంనగర్ వెలుతురు నవంబర్ 29:**
కరీంనగర్ పట్టణం హౌసింగ్ బోర్డ్ లో గల సంక్షేమ ట్రస్ట్ కపిల్ కుటీర్ శిశు సంరక్షణ కేంద్రంలో "దత్తత మాసం" సందర్భంగా పిల్లలను దత్తత తీసుకున్న తల్లిదండ్రులు , దత్తతకు దరఖాస్తు చేసుకున్న వారికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా సంక్షేమ అధికారి మార్త సరస్వతి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో న్యాయపర పైన దత్తత, రక్తసంబంధీకులనుండి మాత్రమే పిల్లలను దత్తత తీసుకోవాలనే విషయంపై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో సి డబ్ల్యూ సి చైర్ పర్సన్ శ్రీరామోజు ధనలక్ష్మి ,డిసిపిఓ పర్వీన్ , సంరక్షణ కేంద్రం ఉపాధ్యక్షుడు వకులా వకులా- రాజారెడ్డి. డి సి పి యు , చైల్డ్ హెల్ప్ లైన్ సిబ్బంది శిశుగృహ మేనేజర్ తేజస్వి పూదరి శాంత,జోగు తిరుపతి,రాజు చైల్డ్ హెల్ప్ లైన్ కోఆర్డినేటర్ ఆవుల సంపత్ యాదవ్ , మాడుగుల రమేష్, మాదాసు కవితా దేవి, మునిగంటి మునిగంటి రాజకుమార్ రాజకుమార్ సాదినేని రమేష్, నాయిని స్వప్న సుందరగిరి సాయి కిరణ్ గౌడ్, కడే మహేష్, ఎడ్ల ప్రియాంక సంరక్షణ సిబ్బంది శ్రీనివాస్ , కృష్ణవేణి, బాల సదన్ సూపరిండెంట్ సంతోషిని , శ్రీలత, లక్ష్మి సరస్వతి, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీరామ మందిరం అయ్యప్ప సేవ సమితి ఆధ్వర్యంలో డాక్టర్ డి ఓం ప్రకాష్ గారికి ఘనంగా సన్మానం

**వెలుతురు నారాయణఖేడ్ నవంబర్ 29 :**



సంగారెడ్డి జిల్లా :- నారాయణఖేడ్ పట్టణం శ్రీరామ మందిరం అయ్యప్ప సేవ సమితి ఆధ్వర్యంలో అయ్యప్ప స్వాములు ఇటీవల గౌరవ డాక్టరేట్ పొందిన డాక్టర్ డి ఓం ప్రకాష్ గారికి అయ్యప్ప స్వాములు అందరూ కలిసి ఘనంగా సన్మానించడం జరిగింది ఈ కార్యక్రమంలో గురుస్వామి శివానంద్ గురుస్వామి మాట్లాడుతూ ఓం ప్రకాష్ స్వామి అంటేనే ఎల్లప్పుడు సేవలలో ముందుండే స్వామి అనునిత్యం ప్రజల కోసం ఆలోచించే మంచి వ్యక్తిత్వం గల స్వామి అని కొనియాడారు ఈ కార్యక్రమంలో గురుస్వామి శివానంద్ గురుస్వామి, సునీల్ గురు స్వామి, మల్లు పటేల్ గురుస్వామి, పాండు గురు స్వామి, అర్థం రమేష్ గురుస్వామి, మోహన్ లాల్ గురు స్వామి, ప్రశాంత్ లాల్ గురు స్వామి, దత్తు గురుస్వామి, చెన్ను పటేల్ స్వామి,రవి స్వామి, నగేష్ స్వామి,ప్రకాష్ ఆచార్య స్వామి, సురేష్ స్వామి, మదన్ స్వామి, నవీన్ స్వామి మరియు శ్రీరామ మందరా అయ్యప్ప సేవ సమితి స్వాములు అందరూ స్వాములు పాల్గొన్నారు.

# ప్రమాదాలకు నిలయంగా దొడ్లపల్లి - ఎర్రవల్లి రోడ్డు

**- రోడ్డుకు ఇరువైపుల చెట్లు పెరగడం, సూచిక బోర్డులు లేకపోవడంతో తరచూ ప్రమాదాలు**

**- పట్టించుకోని అధికారులు**



**వెలుతురు, చారకొండ నవంబర్ 29 :**
వాతావరణ సమతుల్యతకు చెట్లు పెంచాలనే ఉద్దేశం వాస్తవమేగాని రోడ్డుకు ఇరువైపులా ఏపుగా ప్రయాణానికి అడ్డుగా ఉన్న చెట్ల మొక్కల తొలగింపుపై సంబంధిత అధికారులు ఎనలేని జాప్యం చేస్తున్నారు. నాగర్ కర్నూలు జిల్లా, చారకొండ మండలంలోని దొడ్లపల్లి నుంచి ఎర్రవల్లి వరకు రోడ్డుకు ఇరు వైపులా కంప చెట్లు అడ్డంగా ఏపుగా పెరిగాయి. దీంతో వాహనదారులు ఈ రోడ్డుపై ప్రయాణం చేయాలంటేనే జంకుతున్నారు. ఆ రోడ్డు లో ప్రయాణించే వాహనదారులు ఎదురుగా వచ్చే వాహనాలను గుర్తించక ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ప్రయాణికులు వాపోతున్నారు. మూలమలుపులను గుర్తించే విధంగా సూచిక బోర్డులు లేకపోవడంతో, ఎక్కడ మూలమలుపులు ఉన్నాయో తెలియక తరచూ వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పరిస్థితి ఇలా ఉన్న అధికారులు ఎవరూ పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సర్పంచ్ ఎన్నికల సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి ఓటర్లు తమ గ్రామాలకు పెద్ద ఎత్తున రావడంతో ఈ రోడ్డులో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు వెంటనే చొరవ తీసుకుని రోడ్డుకు ఇరువైపులా పెరిగిన చెట్లను తొలగించి ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా చూడాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

# కాంగ్రెస్ సర్కార్ బీసీ రిజర్వేషన్లు తగ్గిస్తూ జారీ చేసిన జీవో 46 పై భగ్గుమన్న బిజెపి శ్రేణులు.

**- రేవంత్ రెడ్డి ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ బిజెపి ఆందోళన....**

**- జీవో ప్రతుల దహనం...**

**- ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు..**







**కరీంనగర్ వెలుతురు నవంబర్ 29:**
బీసీ రిజర్వేషన్లు తగ్గిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో 46 పై కరీంనగర్ బిజెపి శ్రేణులు భగ్గుమన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ ఓబీసీ మోర్చా రాష్ట్ర నాయకులు అడిచర్ల రాజు ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం కరీంనగర్లోని తెలంగాణ చౌక్ లో ఆందోళన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేసి , జీవో 46 ప్రతులను దహనం చేశారు. ఈ ప్రోగ్రాం లో పాల్గొన్న బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు , మాజీ డిప్యూటీ మేయర్ గుగ్గిల్లపు రమేష్ , ఓబీసీ రాష్ట్ర నాయకులు అడిచర్ల రాజు లు మాట్లాడుతూ కామారెడ్డి బీసీ డిక్లరేషన్ పేరిట కాంగ్రెస్ చేసిన వాగ్దానాలన్నీ నీటి మూటలేనని స్పష్టంగా బీసీ సమాజానికి అర్థమైందన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ పేరిట కాంగ్రెస్ ఇన్నాళ్లు రాజకీయ డ్రామాలు చేసిందని , నేడు జీవో 46 జారీ చేసి బీసీలకు రిజర్వేషన్లను తగ్గించి కాంగ్రెస్ సర్కార్ బీసీ ప్రజానీకాన్ని తీవ్రంగా మోసం చేసిందన్నారు . 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని ప్రస్తుతం స్థానిక సంస్థల్లో బీసీలకు కేవలం 22 శాతం రిజర్వేషన్లు ఇవ్వడం దారుణం అన్నారు. దీంతో ప్రస్తుత గ్రామపంచాయతీ ఎన్నికల్లో బీసీలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని తెలిపారు. జీవో 46 ను ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని, లేకపోతే జరగబోయే ఎన్నికల్లో బీసీలు రాష్ట్ర ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్తారని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు గుజ్జ శ్రీనివాస్, బండ రమణారెడ్డి ,ఏన్నం ప్రకాష్ , నరహరి లక్ష్మారెడ్డి ,గుంజేటి శివకుమార్, శానగొండ వాసు, నాంపల్లి శ్రీనివాస్, మాసం గణేష్, అవదుర్తి శ్రీనివాస్ ,తిరుపతి సుధాకర్ పటేల్ ,హరి ప్రసాద్ పటేల్ ,ఎడ్ల ప్రసన్న , రంగు సంపత్ గౌడ్, కట్ట రాజు , వొద్నలా కోటేశ్వర్ బోయిని శ్రీనివాస్, పైడి ప్రసాద్ పర్వతం మల్లేశం, బత్తిని మహేష్, అజయ్ ,నారాయణ, తిరుమల్ రెడ్డి, కచ్చకాయల, రాజేంద్రప్రసాద్, గుంటుక శంకర్ లతోపాటు వివిధ మోర్చా బాధ్యులు, కరీంనగర్ జోన్ నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# అయ్యప్ప స్వాముల యాదగిరిగుట్ట గిరిప్రదక్షిణ.. సరికొత్త రికార్డు సృష్టించేనా ..!!?

**డిసెంబర్ 1 న రెండు తెలుగు రాష్ట్రాల నుండి యాదగిరిగుట్టకు భారీ ఎత్తున అయ్యప్ప మాల ధారణ స్వాముల రాక**

**తెల్లవారుజామున 5 గంటల నుండి ప్రారంభం కానున్న అయ్యప్ప స్వాములు, భక్తుల యాదగిరిగుట్ట మహా గిరిప్రదక్షిణ**

**భారీ ఎత్తున ఏర్పాట్లు చేస్తున్న యాదగిరిగుట్ట దేవస్థానం అధికారులు, అయ్యప్ప సేవాసమితి సభ్యులు**

**యాదగిరిగుట్ట గిరిప్రదక్షిణ చేసే అయ్యప్ప స్వాములు అందరికీ స్వామి వారి గర్భాలయ దర్శనం, ఉచిత లడ్డు ప్రసాదం పంపిణీ**

**అయ్యప్ప స్వాములకు వసతి ,పార్కింగ్, వైద్య సదుపాయం, అల్పాహారం, భోజన ప్రసాద పంపిణీకి భారీ ఏర్పాట్లు**



**పుట్ట హనుమంత్**
**( సీనియర్ జర్నలిస్టు )**
**యాదగిరిగుట్ట , వెలుతురు ( నవంబర్ 29 )**
డిసెంబర్ ఒకటవ తేదీ సోమవారం రోజున యాదగిరిగుట్ట శబరిమలను తలపించేలా అయ్యప్ప స్వాములతో కిక్కిరిసిపోనుందా....? యాదగిరిగుట్ట మరో శబరిమలను తలపించనుందా ..? రెండు తెలుగు రాష్ట్రాల తో పాటు దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి అయ్యప్ప స్వాములు భారీగా యాదగిరిగుట్టకు తరలి రానున్నారా? డిసెంబరు ఒకటిన యాదగిరిగుట్టలో భారీ ఎత్తున జరిగే అయ్యప్ప స్వాముల యాదగిరిగుట్ట మహా గిరి ప్రదక్షిణ సరికొత్త రికార్డును సృష్టించనుందా ? అంటే అయ్యప్ప స్వాములు భక్తుల నుండి అవుననే సమాధానం వస్తుంది... డిసెంబర్ ఒకటో తేదీన యాదగిరిగుట్టలో అయ్యప్ప స్వాముల చే భారీ ఎత్తున యాదగిరిగుట్ట మహా గిరిప్రదక్షిణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ప్రతి సంవత్సరం లాగే ఈసారి కూడా అయ్యప్ప స్వాములు భారీ ఎత్తున అత్యంత ప్రతిష్టాత్మకంగా యాదగిరిగుట్ట గిరిప్రదక్షిణను నిర్వహించేందుకు పెద్ద ఎత్తున ఏర్పాటు చేస్తున్నారు. ఈ గిరిప్రదక్షిణ కార్యక్రమానికి రెండు తెలుగు రాష్ట్రాల తో పాటుగా వివిధ ప్రాంతాల నుండి భారీ ఎత్తున వేల సంఖ్యలో అయ్యప్ప మాలధారణ స్వాముల తో పాటు భక్తులు హాజరుకానున్నారు. ఇందుకు తగ్గట్లుగా అటు యాదగిరిగుట్ట దేవస్థానం వారు ఇటు యాదగిరిగుట్ట పట్టణంలోని అయ్యప్ప కొండ అయ్యప్ప సేవాసమితి వారు పెద్ద ఎత్తున ఏర్పాట్లు నిర్వహిస్తున్నారు. యాదగిరిగుట్ట గిరి ప్రదక్షిణ కు ఒకరోజు ముందుగా యాదగిరిగుట్టకు చేరుకునే అయ్యప్ప స్వాములకు వసతి కోసం కొండపైన డార్మెటరీ హాలు తులసి కాటేజీ అయ్యప్ప కొండ తదితర ప్రాంతాల్లో వసతి సౌకర్యాన్ని ఏర్పాటు చేస్తున్నారు అదేవిధంగా అయ్యప్ప స్వాములకు అల్పాహారం అందించే సౌకర్యాన్ని ఏర్పాటు చేసేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నారు. అయ్యప్ప స్వాములకు ఉచిత వైద్య సదుపాయం, వసతితో పాటు గిరి ప్రదక్షిణ ముగిసిన తర్వాత మధ్యాహ్నం అన్న ప్రసాదాన్ని పంపిణీ చేయనున్నారు. పెద్ద ఎత్తున అయ్యప్ప స్వామి వారిని పల్లకి సేవలో ఉపయోగించేందుకు తగిన ఏర్పాట్లు చేస్తున్నారు . కాశీ నుండి కన్యాకుమారి వరకు అదేవిధంగా శబరిమలకు వెళ్లిన గోమాత ఈ గిరి ప్రదక్షణ కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నారు ఆయా దేవాలయాల ప్రతిష్ట కార్యక్రమాలను నిర్వహించిన అర్చకులు పండితులు పీఠాధిపతులు ఆధ్యాత్మికవేత్తలు భారీ ఎత్తున ఈ అయ్యప్ప స్వాముల మహా గిరి ప్రదక్షిణ కార్యక్రమానికి హాజరుకానున్నారు దీంతో యాదగిరిగుట్ట మరో శబరిమలను తలపించనుంది అనే ప్రచారం రూపొందుకుంది ఈ మేరకు ఇప్పటికే రెండు తెలుగు రాష్ట్రాల్లో స్థానిక అయ్యప్ప సేవా సమితి వారు పెద్ద ఎత్తున ప్రచారం నిర్వహించారు ఈ గిరి ప్రదక్షిణలో సన్నాయి డోలు మంగళ వాయిద్యాలు డీజే సౌండ్ సిస్టంలో ఆధ్యాత్మిక పాటలు గీతాలు ఏర్పాటు చేయనున్నారు దేవస్థానం వారు యాదగిరిగుట్ట కొండ చుట్టూ గిరి ప్రదక్షిణ దారిలో ప్రత్యేక లైటింగ్ సిస్టం ఏర్పాటు చేస్తున్నారు ఆధ్యాత్మిక కార్యక్రమాలు భక్తుల భజనలతో యాదగిరిగుట్ట ఆధ్యాత్మిక వైభవంతో భక్తులకు కన్నుల పండుగ గా మారనుంది. మొత్తానికి అయ్యప్ప స్వాముల ఈ మహా గిరిప్రదక్షిణ కార్యక్రమానికి అటు యాదగిరిగుట్ట దేవస్థానం అధికారులు ఇటు అయ్యప్ప సేవాసమితి వారు అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకొని భారీ ఏర్పాట్లు చేస్తున్నారు దీంతో డిసెంబర్ 1న యాదగిరిగుట్టలో అయ్యప్ప స్వాములు నిర్వహించే యాదగిరిగుట్ట మహాగిరి ప్రదక్షిణ కార్యక్రమం మరో సరికొత్త రికార్డును సృష్టించనుందా ? అనే చర్చ పెద్ద ఎత్తున జరుగుతోంది.

## భారీ ఎత్తున అయ్యప్ప స్వాముల మహా గిరి ప్రదక్షిణ :

యాదగిరిగుట్ట దేవస్థానం వారి సహకారంతో ప్రతి సంవత్సరం నిర్వహించే అయ్యప్ప స్వాముల గిరి ప్రదక్షిణ కార్యక్రమం డిసెంబర్ 1వ తేదీ సోమవారం రోజున చేపడుతున్న సందర్భంగా. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అయ్యప్ప స్వామి మాలదారులు యాదగిరిగుట్ట కొండ చుట్టు గిరి ప్రదక్షణ కార్యక్రమంలో అధిక సంఖ్యలో అయ్యప్ప స్వాములు భక్తులు పాల్గొనాలని అయ్యప్ప సేవా సమితి ట్రస్టు సభ్యులు పిలుపునిచ్చారు. యాదగిరిగుట్ట అయ్యప్ప స్వామి కొండ ట్రస్ట్ సభ్యులు. అధ్యక్షులు సుడుగు శ్రీనివాస్ రెడ్డి. ప్రధాన కార్యదర్శి పెద్ది శ్రీనివాసులు గుప్తా. కోశాధికారి బింగి పాండు. గురుస్వామి ర్యాకల రాజు తదితరులు శనివారం యాదగిరిగుట్ట పట్టణంలోని అయ్యప్ప కొండపై నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. గిరి ప్రదక్షణకు ఒక రోజు ముందుగా వచ్చే స్వాములకు యాదాద్రి దేవస్థానం వారు వసతి తో పాటు గర్భాలయ దర్శనం లడ్డు ప్రసాదం అల్పాహారం కూడా అంద చేస్తున్నారని ట్రస్ట్ సభ్యులు తెలిపారు. పెద్ద ఎత్తున నిర్వహిస్తున్న ఇట్టి కార్యక్రమంలో వేల సంఖ్యలో స్వాములు వస్తారని తెలిపారు కొండ చుట్టూ భక్తి గీతాలతో మంగళ వాయిద్యాలతో పల్లకి సేవ ఊరేగింపుగా తీసుకువస్తామని అన్నారు అధిక సంఖ్యలో స్వాములు గిరి ప్రదక్షిణలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కాగలరని కోరారు. అయ్యప్ప స్వాముల గిరిప్రదక్షిణ కార్యక్రమాన్ని రెండు తెలుగు రాష్ట్రాల నుండి భారీ ఎత్తున అయ్యప్ప స్వాములు భక్తులు విచ్చేసి విజయవంతం చేయాలని వారు కోరారు. గిరిప్రదక్షిణ తర్వాత అయ్యప్ప స్వాములకు ఉచితంగా యాదగిరిగుట్ట దేవస్థానం వారు స్వామివారి గర్భాలయ దర్శనంతో పాటు లడ్డు ప్రసాద్ ని ఉచితంగా అందజేయమన్నారని అన్నారు ఒకరోజు ముందుగా వచ్చే అయ్యప్ప స్వాములకు వసతి సౌకర్యాన్ని కల్పించనున్నామని అదేవిధంగా అల్పాహారాన్ని అందించనున్నట్లు తెలిపారు స్వాములకు స్వామివారి అంతరాలయ దర్శనం గర్భాలయ దర్శనంతో పాటు అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తున్నామని అన్నారు. అయ్యప్ప చారిటబుల్ ట్రస్ట్ అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో అయ్యప్ప స్వాములకు అన్నప్రసాద వితరణతో పాటు అన్ని రకాల సౌకర్యాలు ఏర్పాటు చేశామని తెలిపారు. అదే విధంగా స్థానిక ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య అయ్యప్ప స్వాములకు ప్రత్యేకంగా పెద్ద ఎత్తున సహకరిస్తున్నారని వారికి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేస్తున్నామని వారు తెలిపారు. గతంలో కూడా ఆయన అయ్యప్ప కొండకు అనేక రకాలుగా సేవలు అందించారని తెలిపారు. డిసెంబర్ 1న జరిగే ఈ గిరి ప్రదర్శన కార్యక్రమాన్ని భక్తులందరూ విజయవంతం చేయాలని వారు కోరారు. ఈ సమావేశంలో గౌరవ సలహాదారులు మురారి శెట్టి నాగేశ్వరరావు , పాల బాలు , కూరపాటి విష్ణుమూర్తి , సార కరుణాకర్, సుక్కల ఉప్పలయ్య , వేముల రవీందర్, సుడుగు రాజ్ కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థుల విజయం ఖాయం

**- కాంగ్రెస్ పార్టీ యాదగిరిగుట్ట మండల అధ్యక్షులు మంగ సత్యనారాయణ**



**యాదగిరిగుట్ట , వెలుతురు ( నవంబర్ 29 )**

యాదగిరిగుట్ట మండలంలోని అన్ని గ్రామాల లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులే ఘనవిజయం సాధిస్తారని కాంగ్రెస్ పార్టీ యాదగిరిగుట్ట మండల అధ్యక్షులు మంగ సత్యనారాయణ ధీమా వ్యక్తం చేశారు. యాదగిరిగుట్ట మండలం మల్లాపురం గ్రామ సర్పంచ్ అభ్యర్థిగా మంగ సత్యనారాయణ శనివారం దాతర్ పల్లి గ్రామంలోని నామినేషన్ కేంద్రంలో నామినేషన్ వేశారు . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థులు పెద్ద ఎత్తున విజయం సాధిస్తారని అన్నారు యాదగిరిగుట్ట మండలంలో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన 23 మంది సర్పంచ్ అభ్యర్థులు విజయం సాధించడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు ఇప్పటికే దాదాపుగా గౌరాయపల్లి కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని అన్నారు. అదేవిధంగా త్వరలో మరో గ్రామానికి కూడా తమ పార్టీ బలపరిచిన అభ్యర్థి ఏకగ్రీవం అయ్యే అవకాశం ఉందని తెలిపారు. అదేవిధంగా తాను మల్లాపురంలో పెద్ద ఎత్తున విజయం సాధిస్తానని ధీమా వ్యక్తం చేశారు . ఈ సందర్భంగా ఆయనను అభిమానులు పార్టీ నాయకులు కార్యకర్తలు పూలమాలలు శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. అదేవిధంగా యాదగిరిగుట్ట మండలం లప్ప నాయక్ తండ సర్పంచ్ అభ్యర్థిగా ధీరావత్ గాసిరాం నాయక్ శనివారం దాతర్ పల్లి లోని నామినేషన్ కేంద్రంలో నామినేషన్ వేశారు అదేవిధంగా వార్డు సభ్యులుగా ధీరావత్ సురేష్, .ధీరావత్ రేణుక మోహన్ , ధీరావత్ మౌనిక రమేష్ , .ధీరావత్ భూలి నర్సింహా , ధీరావత్ విజయ రాజు , .ధీరావత్ కమల కిషన్ లు నామినేషన్ వేశారు ఈ కార్యక్రమంలో అజ్మీరా మాను, ధీరావత్ జాగీర్, రణధీర్, మంగ్య, భరత్, నర్సింహా, శంకర్, అజ్మీరా కిషన్, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

## చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్టులో సత్తా చాటిన రంజోల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థినులు







**జహీరాబాద్ వెలుతురు నవంబర్ 29:**

సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని సైన్స్ సెంటర్‌లో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన చెకుముకి సైన్స్ ట్యాలెంట్ టెస్టులో రంజోల్, ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆంగ్ల మాధ్యమ విభాగం విద్యార్థినులు ప్రతిభ చాటారు. పదవ తరగతి విద్యార్థిని మోసినా మెహ్విన్, తొమ్మిదవ తరగతి విద్యార్థిని భవాని, ఎనిమిదవ తరగతి విద్యార్థిని శృతి సమిష్టిగా ఏర్పరిచిన జట్టు పోటీలో తృతీయ స్థానం సాధించి పాఠశాలకు గౌరవం తీసుకువచ్చింది. విజేతలను ప్రధానోపాధ్యాయులు నానుసింగ్ రాథోడ్ ప్రత్యేకంగా అభినందించారు. వారి ఆధ్వర్యంలో విద్యార్థినులకు బహుమతులు, మెమెంటోలు అందజేస్తూ మరింత ఉన్నత లక్ష్యాల వైపు పయనించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుల బృందం కూడా పాల్గొని విద్యార్థినుల ప్రతిభను ప్రశంసించింది. ప్రత్యేకంగా, విద్యార్థినుల విజయంలో కీలకపాత్ర పోషించిన రిటైర్డ్ ఉపాధ్యాయులు యం. రాంచంద్రయ్య అందించిన మార్గదర్శకత, ప్రోత్సాహానికి పాఠశాల తరఫున ధన్యవాదాలు తెలిపారు. విద్యార్థుల అకాడమిక్ పురోగతిలో ఇలాంటి శాస్త్రీయ కార్యక్రమాలు కీలకమని ఉపాధ్యాయులు పేర్కొన్నారు.

## అన్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పుస్తకార్ గ్రంథాలయం ఏర్పాటు



**వెలుతురు నారాయణఖేడ్ నవంబర్ 29 :**



సంగారెడ్డి జిల్లా :- నారాయణఖేడ్ జడ్పిహెచ్ఎస్ పాఠశాలలో అన్స్ ఫౌండేషన్ పుస్తకార్ ఆధ్వర్యంలో 50 వేల విలువగల 450 పుస్తకాలతో గ్రంథాలయంను శనివారం ప్రారంభం చేశారు.. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం మన్మధ కిషోర్ మాట్లాడుతూ విద్యార్థుల మేధస్సును పెంపొందించడానికి గ్రంథాలయంలోని పుస్తకాలు చాలా ఉపయోగపడతాయన్నారు. విజ్ఞానాన్ని వినోదాన్ని సృజనాత్మకను పెంపొందించడానికి పుస్తకాలలో ఉన్న అంశాలను విద్యార్థులు క్షుణ్ణంగా చదివి ఉన్నత స్థితికి రావాలన్నారు.. మా పాఠశాల ఉపాధ్యాయులు చంద్రశేఖర్ ఆచార్య సహకారంతో అన్స్ ఫౌండేషన్ పుస్తకార్ గ్రంథాలయ వ్యవస్థాపకురాలు శోభా బన్సాలి, ప్రోగ్రామ్ డైరెక్టర్ శ్రుతి హెగ్డే మరియు రాజేశ్వర్ కి ధన్యవాదాలు తెలిపారు .ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు రాజశేఖర్, చంద్రశేఖర్ ఆచార్య, విద్యార్థులు పాల్గొన్నారు..

# గ్రామ సమస్యల పరిష్కారానికి కృషి

**- ఎమ్మెల్యే పాయల్ శంకర్**





**ఆదిలాబాద్ వెలుతురు నవంబర్ 29:**

గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి నా తరఫున హామీ ఇవ్వండి వాటిని పూర్తిచేసే బాధ్యత తీసుకుంటానని ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు భారతీయ జనతా పార్టీ జిల్లా కార్యాలయంలో శనివారం నిర్వహించిన అదిలాబాద్ రూరల్ మావలా సత్నాల మండలాల పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు పంచాయితీల్లో భాజపా మద్దతు ఇచ్చిన అభ్యర్థులు గెలిచేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అన్నారు మీ గ్రామాల్లో మీరే రథసారథులు కావాలని ఆయన సూచించారు కార్యకర్తలు సమన్వయంతో అభ్యర్థుల గెలుపు కోసం పాటుపడాలని కోరారు గ్రామ ప్రజలు ఏవైనా సమస్యలను మీ దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తామని హామీ ఇవ్వండి వాటిని పూర్తిచేసే బాధ్యత నేను తీసుకుంటానని ఆయన భరోసా ఇచ్చారు ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు బ్రహ్మానంద్. మాధవరావు . దయాకర్. సంతోష్. రఘుపతి. క్రాంతి. భాస్కర్. కరుణాకర్ రెడ్డి. మండలా నాయకులు తదితరులు పాల్గొన్నారు

## అటవీ శాఖ అధికారుల ఇబ్బందులను తొలగించి మారుమూల ఏజెన్సీ ప్రాంతాల గ్రామాలకు రోడ్డు సౌకర్యాలు కల్పించేందుకు తన వంతుగా కృషి చేస్తా

**- ఎమ్మెల్యే పాయల్ శంకర్**



**ఆదిలాబాద్ వెలుతురు నవంబర్ 29:**

అటవీ శాఖ అధికారుల ఇబ్బందులను తొలగించి మారుమూల ఏజెన్సీ ప్రాంతాల గ్రామాలకు రోడ్డు సౌకర్యాలు కల్పించేందుకు తన వంతుగా కృషి చేస్తానని ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు, శనివారం ఆదిలాబాద్ రూరల్ మండలంలోని తిప్ప, అల్లికోరి గ్రామాలకు చెందిన తాజా మాజీ సర్పంచ్ లతో పాటు వివిధ పార్టీల కు చెందిన పలువురు బీజేపీ లో చేరారు. ఈ సందర్భంగా వారికి ఎమ్మెల్యే కండువాలను కప్పి పార్టీ ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయల్ శంకర్ మాట్లాడుతూ ఎంపీ, ఎమ్మెల్యే ఎన్నికల సమయంలో ప్రజలు ఆశీర్వదించి బిజెపి ఎంపీ, ఎమ్మెల్యేలను గెలిపించిన విధంగానే రానున్న గ్రామ పంచాయతీ ఎన్నికల్లో సైతం బిజెపి బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలని కోరారు. అదేవిధంగా ఏకగ్రీవంగా ఎన్నికైన బీజేపీ పంచాయితీలకు రూ. 25 లక్షలు అందజేసేందుకు తనవంతుగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. రాజకీయాలకు అతీతంగా గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలు చేపడతానని హామీ ఇచ్చారు. ప్రధానంగా ఏజెన్సీ ప్రాంతాల్లోని గ్రామాల్లో రోడ్డు సౌకర్యాలు లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు బిజెపి నాయకులు. దయాకర్. సంతోష్. మడావీ హనుమంతు. లింగు పటేల్. రమేష్. జోగు రవి. రవీందర్. తదితరులు పాల్గొన్నారు

## లయన్ శక్తి న్యూ వాయిసెస్ నల్గొండ సౌజన్యంతో వికలాంగులకు వీల్ చైర్స్ పంపిణీ

**నల్లగొండ వెలుతురు నవంబర్ 29:**

లయన్స్ ఇంటర్నేషనల్ వారు ఇండియ క్రిస్టియన్ మినిస్ట్రీస్ సౌజన్యంతో లయన్స్ క్లబ్ ఆఫ్ శక్తి న్యూ వాయిసెస్ వారి ఆధ్వర్యంలో 22 వీల్ చైర్స్ కవినెంట్ చర్చి గొల్లగూడ నందు పంపిణీ చేశారు ఇట్టి కార్యక్రమంలో ముఖ్య అతిథిగా జిల్లా ఎస్.పి.శరత్చంద్ర పవర్ పాల్గొని లబ్దిదారులకు ఈ చైర్స్ నీ అందచేశారు వారు మాట్లాడుతూ అయ్.సి.ఎమ్. డైరెక్టర్ జెస్సీ పాల్ గారిని అభినదించారు అలానే ఈ కార్యక్రమంను చేపట్టిన లయన్స్ శక్తి న్యూ వాయిస్ జోన్ చైర్మన్ లయన్ డాక్టర్ ఝాన్సీ రాణీ పసలపూడి ని ప్రత్యేకంగా అభినందించారు మరియు అయ్. సి.ఎమ్ కోఆర్డినేటర్ సాల్మన్ ని ప్రోత్సాహ పరచారు, లయన్ ఇంటర్నేషనల్ 320 ఇ గవర్నర్ గారు పి. ఎమ్ జె. ఎ ఫ్ లయన్ మదన్ మోహన్ రేపాల గారు చేపట్టిన అన్ని కార్యక్రమాలు ను ఉద్దేశించి అభినందించారు గవర్నర్ పి.ఎమ్ జె ఎఫ్ మదన్ మోహన్ రేపాల గారు మాట్లాడుతూ ఇలాంటి సేవలు అందించిన శక్తి న్యూ వాయిస్ సభ్యులను జోన్ చైర్మన్ నీ అభినంచారు ఇంకా సేవాకార్యక్రమాలు ఎన్నో చేపట్టాలని సూచించారు ఈ కార్యక్రమంలో గవర్నర్ 1 పి.ఎమ్ జె.ఎఫ్ లయన్ కె.వి. ప్రసాద్ గారు గవర్నర్ 2 పి.ఎమ్.జ ఎఫ్ లయన్ సతీష్ కుమార్ కోడె గారు, ప్రెసిడెంట్ కోటా




సరిత గారు, బిషప్ సమర్పణ్ కుమార్ లయన్ మాధవిసెక్రటరీ, లయన్ కరుణ ట్రెజరర్ , లయన్ తబిత ,లయన్ విజయ, లయన్ అనీ ప్రీతి గార్లు పాల్గొని విజయ వంతం చేశారు

## సీబీసీ రాజ్యాంగ దినోత్సవ ఫోటో ఎగ్జిబిషన్‌ను సందర్శించిన పాట్నా హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎల్. నరసింహా రెడ్డి


**- విద్యార్థులతో మాటామంతీ**

**హైదరాబాద్ వెలుతురు 29 నవంబర్ 2025:**



కేశవ్ మెమోరియల్ ఎడ్యుకేషనల్ సొసైటీ సహకారంతో సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ (సీబీసీ) హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న రాజ్యాంగ దినోత్సవ ఫోటో ఎగ్జిబిషన్‌ను కేశవ్ మెమోరియల్ ఎడ్యుకేషనల్ సొసైటీ (కేఎంఈఎస్) అధ్యక్షులు, హైదరాబాద్ విశ్వవిద్యాలయం ఛాన్సలర్, పాట్నా హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎల్. నరసింహా రెడ్డి శనివారం రోజున సందర్శించారు. జస్టిస్ రెడ్డితో పాటు సీబీసీ అదనపు డైరెక్టర్ జనరల్ శ్రీమతి శ్రుతి పాటిల్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. రాజ్యాంగ దినోత్సవం, వందేమాతరం ఏ150 సమాచార ప్యానెల్‌లను ఆయన ఆసక్తిగా పరిశీలించారు. విద్యార్థులకు రాజ్యాంగ ఇతివృత్తాలను ఆకర్షణీయంగా, సమాచారం అందించే విధంగా ప్రదర్శించడానికి చేసిన ప్రయత్నాలను ఆయన అభినందించారు. కేశవ్ మెమోరియల్ కాలేజ్ ఆఫ్ లా (కేఎంసీఎల్) విద్యార్థులనుద్దేశించి ప్రసంగించిన జస్టిస్ నరసింహా రెడ్డి... భారత రాజ్యాంగ ప్రాముఖ్యతను ప్రధానంగా ప్రస్తావించారు. డాక్టర్ బీ.ఆర్. అంబేద్కర్ నేతృత్వంలోని ముసాయిదా కమిటీ చేసిన అద్భుత కృషికి ఫలితంగా రాజ్యాంగాన్ని ఆయన అభివర్ణించారు. రాజ్యాంగం అనుకూలతే దాని గొప్ప బలం అన్న జస్టిస్ నరసింహా రెడ్డి... సాంకేతికత, న్యాయం అందించడం, పరిపాలన, సంక్షేమం సహా అభివృద్ధి చెందుతున్న సామాజిక అవసరాలకు అనుగుణంగా దానిని మార్చుకోవచ్చని పేర్కొన్నారు. ప్రాథమిక హక్కులను భారత ప్రజాస్వామ్యానికి కేంద్ర బిందువుగా అభివర్ణించిన జస్టిస్ నరసింహా రెడ్డి... పౌరులు తమ ప్రాథమిక విధులను సక్రమంగా నిర్వర్తించినప్పుడే ఈ హక్కులు అర్థవంతంగా ఉంటాయని అన్నారు. భారత్ ఇప్పుడు దాని శాస్త్రీయ, ఆర్థిక విజయాల కోసం మాత్రమే కాకుండా సహనం, బలమైన కుటుంబ వ్యవస్థలు, యోగా వంటి సామాజిక విలువల కోసం కూడా ప్రపంచ గౌరవాన్ని పొందుతోందని ఆయన వ్యాఖ్యానించారు. ప్రతి పౌరుడినీ సమానంగా చూడాలనీ, సోదర భావంతో పనిచేయాలని జస్టిస్ రెడ్డి విద్యార్థులకు సూచించారు. అనంతరం విద్యార్థులతో మాటామంతీలో వారు అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానమిచ్చారు. ఈ కార్యక్రమంలో కేఎంఈఎస్ కార్యదర్శి శ్రీ ఎ.వి. సుబ్రహ్మణ్యం, సంయుక్త కార్యదర్శి శ్రీ బి. శ్రీధర్ రెడ్డి, కేఎంసీఎల్ ప్రిన్సిపాల్ డాక్టర్ వాణి అక్కపెద్ది, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

# HILT పాలసీలో పారదర్శకత ఉంటే మంత్రి ఉత్తమ్ ఎందుకని చర్చకు రాలేదు?




**హైదరాబాద్ వెలుతురు నవంబర్ 29:** హైదరాబాద్ ఇండస్ట్రియల్ ల్యాండ్ ట్రాన్స్ ఫర్మేషన్ (HILT) పాలసీ ప్రతిపక్షాలకు అర్థం కాలేదనడం మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి గారి దివాళాకోరుతనానికి నిదర్శనం. ప్రభుత్వ విధానంలో పారదర్శకత ఉంటే, దానిపై చర్చించేందుకు అసెంబ్లీ మీడియా పాయింటుకు రమ్మని నేను నిన్న చేసిన సవాలును మంత్రి ఉత్తమ్ ఎందుకు స్వీకరించలేదు. అంటే హిల్ట్ పాలసీలో పారదర్శకత లేదని రుజువైనట్టే కదా.

### రూ.ఆరు లక్షల 29 వేల కోట్ల భూములను రూ.ఐదు వేల కోట్లకే ఎందుకు కట్టబెడుతున్నారు?

హిల్ట్ పాలసీలో ఎలాంటి కుంభకోణానికి అస్కారం లేదంటున్న మంత్రి ఉత్తమ్ గారు ... మేము ఆరు రోజులుగా అడుగుతున్న ప్రశ్నలకు ఎందుకు సమాధానాలు చెప్పడం లేదు. ఏ ప్రాతిపదికన హిల్ట్ పాలసీని రూపొందించి రూ.ఆరు లక్షల 29 వేల కోట్ల విలువైన భూములను రూ.ఐదు వేల కోట్లకు ఎందుకు కట్టబెడతున్నారనే ప్రశ్నకు సమాధానమేదీ?

### కోకాపేటలో ఎకరం ధర రూ.151 కోట్లు. మరి పారిశ్రామిక వాడల్లో భూముల ధర రూ.54 లక్షలా?

కోకాపేటలోని భూములకు HMDA నిన్న శుక్రవారం రెండో విడత నిర్వహించిన వేలంలో ఎకరానికి రూ.151 కోట్ల ధర పలికింది. మొన్న ఎకరం ధర రూ.137కోట్లు. ఈ లెక్కన హిల్ట్ పాలసీలో భాగంగా 22 పారిశ్రామిక వాడల్లో ఉన్న భూముల ధర సగటున ఎకరం సుమారు రూ.68 కోట్లుగా ఉంటుందని అంచనా. ఆ మేరకు ప్రభుత్వం కన్వర్షన్ చేస్తున్న 9292 ఎకరాలకు మార్కెట్ ధర ప్రకారం వచ్చే మొత్తం రూ.ఆరు లక్షల 29 వేల కోట్లు. ఈ లెక్కలు తప్పని మంత్రి ఉత్తమ్ చెప్పదలచుకున్నారా? ప్రభుత్వం ఈ భూములను ఎకరం రూ.54 లక్షలకే ఇచ్చేయడం లూటీ కాక మరేమిటి?

### బీఆర్ఎస్ హయాంలో జరిగిన ఇండస్ట్రియల్ ల్యాండ్ స్కాం కాంగ్రెస్ సర్కారుకు ఆదర్శమా?

హిల్ట్ పాలసీ కాంగ్రెస్ ప్రభుత్వం కొత్తగా తెచ్చింది కాదని, దీనిపై గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే చర్చ జరిగిందంటున్న మంత్రి ఉత్తమ్ ... బీఆర్ఎస్ హయాంలో జరిగిన అవినీతిని, అక్రమాలను ఆదర్శంగా తీసుకుంటున్నారా చెప్పాలి.

### బీఆర్ఎస్ చేసిన భూ బాగోతాన్ని కాంగ్రెస్ మంత్రులు ఎందుకు బయట పెట్టడం లేదు?

బీఆర్ఎస్ హయాంలో పారిశ్రామిక భూముల బదలాయింపులలో జరిగిన తప్పిదాలను బయట పెడుతామని మీ క్యాబినెట్ సబ్ కమిటీ సహచరులైన భట్టి విక్రమార్క, శ్రీధర్ బాబు మాట్లాడారు కదా, మరి ఎందుకని బయటపెట్టడం లేదు. బీఆర్ఎస్ పెద్దలతో మీకున్న మ్యాచ్ ఫిక్సింగ్ ఏంటి.

### బీఆర్ఎస్ హయాంలో GRID Policy పేరుతో ల్యాండ్ స్కాం జరిగింది కదా!

ఇపుడు రేవంత్ సర్కార్ చేస్తున్న ల్యాండ్ స్కామునే గతంలో బీఆర్ఎస్ సర్కార్ కూడా హైదరాబాద్ GRID పాలసీ (Growth in Dispersion) చేసిందని మంత్రి శ్రీధర్ బాబు అంగీకరించారు. అజామాబాద్, కూకట్‌పల్లి, హాఫీజ్‌పేటలోని పారిశ్రామిక భూములకు ఫ్రీ హెూల్డ్ పేరిట బీఆర్ఎస్ ప్రభుత్వమే యాజమాన్య హక్కులు కల్పించిందని, ఈ మేరకు 2023 ఆగస్టు 20న జీవోను జారీచేశారని శ్రీధర్‌బాబు తెలిపారు. బీఆర్ఎస్ సర్కారు ఇలా ఫ్రీ హెూల్డ్ పేరిట ఎకరాకు రూ.50 నుంచి రూ.60కోట్లకు ఉన్న విలువైన భూములను ఎకరాకు రూ.10 కోట్లకే కట్టబెట్టారని, ఇలా వందల కోట్ల ప్రభుత్వ భూములను అప్పటి మంత్రి కేటిఆర్ తన వారికి అప్పనంగా కట్టబెట్టి ప్రజాధనాన్నికొల్లగొట్టారని శ్రీధర్ బాబు ఆరోపించారు.

### బీఆర్ఎస్ అపుడు GRID Scam కు పాల్పడితే కాంగ్రెస్ ఇప్పుడు HILT Scam కు స్కెచ్ వేసింది!

అంటే అపుడు బీఆర్ఎస్ సర్కార్ GRID పాలసీ తెచ్చి పారిశ్రామిక వాడల్లోని భూముల ఓనర్లకు ఫ్రీ హెూల్డ్ ఇస్తూ భూ దోపిడీకి పాల్పడింది. కాబట్టి ఇపుడు తాము చేస్తే తప్పేంటనే ధోరణిలో మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడడం సిగ్గుచేటు. నాడు గ్రిడ్ పాలసీతో బీఆర్ఎస్ వందల ఎకరాల పారిశ్రామిక భూములను కొల్లగొడితే. నేడు కాంగ్రెస్ సర్కార్ హిల్ట్ పాలసీ ద్వారా ఏకంగా 22 పారిశ్రామిక వాడలనే మింగిస్తోంది. అంటే కాంగ్రెస్ సర్కార్ అవినీతి అనకొండ. ఇండిస్ట్రియల్ ల్యాండ్ లూటీ ఎపిసోడుకు బీఆర్ఎస్ కిటికీలు తెరిస్తే, కాంగ్రెస్ ఇపుడు తలుపులు తెరవడం కాదు, ఏకంగా గోడలనే కూల్చేసింది. దొంగల పాలన పోయి గజదొంగల పాలన వచ్చింది. అంటే రాష్ట్రంలో గొర్రెలను తినేటోడు పోయి బర్రెలను తినేటోడు వచ్చిండన్నమాట.

### HILT Policy పై క్యాబినెట్ మీటింగ్ లో అసలు లోతైన చర్చ జరుగిందా?

అసలు ఈ HILT పాలసీపై ఈ నెల 17న జరిగిన క్యాబినెట్ మీటింగులో కూడా లోతైన చర్చ జరగలేదు. దీనిపై ప్రభుత్వం రూపొందించిన డ్రాఫ్ట పాలసీని మంత్రులకు సర్కులేట్ చేసి, వారు చదివాక మళ్లీ వెనక్కి తీసుకున్నారంటే సీఎం రేవంత్ రెడ్డి ఎంత పకడ్బందీగా ఈ రూ.ఆరు లక్షల 29 వేల కోట్ల కుంభకోణానికి స్కెచ్ వేసారో స్పష్టమవుతోంది.

### HILT Policy జీవో -27లో క్యాబినెట్ సబ కమిటీ ప్రస్తావనే లేదు ఎందుకని ?

ప్రభుత్వానికి ఆదాయ మార్గాలను పెంచే క్యాబినెట్ సబ్ కమిటీ చేసిన కసరత్తు మేరకే ఈ హిల్ట్ పాలసీ వచ్చిందని మంత్రి ఉత్తమ్ చెబుతున్నారు. మరి అదే నిజమైతే ఈ నెల 22న ప్రభుత్వం జారీ చేసిన జీవో-27లో TGIIC చేసిన సిఫారసుల మేరకు అని ఎందుకు పేర్కొన్నారు. మరి క్యాబినెట్ సబ్ కమిటీ సిఫారసుల మేరకు అని జీవోలో ఎందుకు స్పష్టత ఇవ్వలేదు.

### ఆ నలుగురు మంత్రులు దుష్టచతుష్టయం, వారికి లై డిటెక్టర్ పరీక్షలు నిర్వహించాలి.

జీవో-27లో అసలు క్యాబినెట్ సబ్ కమిటీ ప్రస్తావనే లేదు. ఎందుకంటే అసలు క్యాబినెట్ సబ్ కమిటీ ఏనాడు హైదరాబాద్ ఇండస్ట్రియల్ ల్యాండ్ అంశాన్ని చర్చించలేదు. సీఎం రేవంత్ రెడ్డి ఆఫర్ చేసిన రూ.వేలకోట్ల డబ్బుమూటలకు ఆశపడిన నలుగురు మంత్రులు దుష్టచతుష్టయం గా మారిపోయి క్యాబినెట్ సబ్ కమిటీలో చర్చించామంటూ అబద్దాలు చెబుతున్నారు. క్యాబినెట్ సబ్ కమిటీ రిపోర్టు పేరుతో రూ.ఆరు లక్షల 29 వేల కోట్ల స్కాముకు పాల్పడిన ఈ దుష్టచతుష్ట యానికి లై డిటెక్టర్ టెస్టులు నిర్వహిస్తే వీరి బండారం, రూ.ఆరు లక్షల 29 వేల కోట్ల ల్యాండ్ లూటీ స్కామ్ బయటపడుతుంది

### పరిశ్రమలను తరలించి ఆ భూముల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేయమనడం ప్రభుత్వ విధానమా?

హైదరాబాద్‌ను కాలుష్య రహితంగా, ప్రపంచస్థాయి నగరంగా తీర్చిదిద్దేందుకే పరిశ్రమలను నగరం బయటకు పంపుతున్నట్లు మంత్రి ఉత్తమ్ గారు చెప్పారు. సరే, పరిశ్రమలను ఎక్కడికి తరలిస్తున్నారో, వాటికి ఎక్కడ భూములను కేటాయించారో ఎందుకని చెప్పడం లేదు. అంటే ఈ పరిశ్రమలను మూసేసి వాటి ఓనర్లను ఆ భూముల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసుకోమంటున్నారా. ఇదేనా కాంగ్రెస్ ప్రభుత్వ పారిశ్రామిక విధానం.

### పరిశ్రమలను ఫ్యూచర్ సిటీలో రీ లోకేట్ చేయొచ్చు కదా?

కాలుష్యమే ప్రధాన కారణమైతే మనుగడలో ఉన్న పరిశ్రమలను ఔటర్ రింగ్ రోడ్డు బయట, ఫ్యూచర్ సిటీలో ఉన్న వేలాది ఎకరాల్లో రీ లోకేట్ చేయొచ్చు కదా ... ల్యాండ్ టు ల్యాండ్ ఇచ్చి హైదరాబాద్ నడిబొడ్డున ఉన్న 9292 ఎకరాల భూమిని ప్రభుత్వమే స్వాధీనపరుచుకోవచ్చు కదా. అలా చేయకుండా S.R.O. వ్యాల్యూలో 30 శాతానికే ల్యాండ్ కన్వర్షనుకు అనుమతివ్వడం స్కాము కాక మరేంటి?

### పరిశ్రమల పొల్యూషన్ పై ఎన్విరాన్మెంటల్ స్టడీ రిపోర్ట్ ఏది?

మరి ఈ 22 పారిశ్రామిక వాడల్లో ఉన్న కాలుష్యకారక పరిశ్రమలు ఎన్ని ఉన్నాయి. వాటి వల్ల ఎలాంటి దుష్పరిణామాలు సంభవిస్తున్నాయనే అంశంపై నిపుణుల నివేదిక ఏమైనా ప్రభుత్వం వద్ద ఉందా? ఎన్విరాన్ మెంటల్ స్టడీ ఏమైనా చేసారా? ఏ ప్రాతిపదికన ఈ పరిశ్రమలన్నీ కాలుష్య కారకాలని ప్రభుత్వం నిర్ధారించింది.

### పరిశ్రమల భూముల్లో అపార్ట్మెంట్లు నిర్మించ వచ్చని ఏ నిపుణుల కమిటీ చెప్పింది?

మరి 50 ఏళ్లుగా ఈ పరిశ్రమలు విడుదల చేస్తున్న రసాయనిక వ్యర్థాలు భూమిలో ఇంకిపోవడం వల్ల ఈ ప్రాంతాల్లో అపార్ట్మెంట్లు నిర్మించి నివాసానికి అనుమతించినట్టయితే విషతుల్యమైన భూగర్భ జలాల వల్ల అక్కడ నిర్మించే అపార్ట్మెంట్లలో నివసించే ప్రజలకు అనారోగ్య సమస్యలు రావా? ఇలాంటి అంశాలపై లోతైన అధ్యయనం ప్రభుత్వం ఏమైనా చేసిందా? ఎలాంటి ఎన్విరాన్మెంటల్ స్టడీ చేయకుండా కాలుష్యకారక పరిశ్రమల స్థానంలో నివాసాలను ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం ఎలా అనుమతి ఇస్తుంది. ఇది ప్రజారోగ్యంతో చెలగాటం కాదా?

### రూ.ఆరు లక్షల 29 వేల కోట్ల విలువైన భూములను రూ.ఐదు వేల కోట్లకే కట్టబెట్టడం ల్యాండ్ లూటీ కాక మరేమిటి?

పరిశ్రమలకు చెందిన 9,292 ఎకరాల భూముల్లో నిర్మాణాలు చేసుకోవచ్చుంటూ, వాటిని ఆ ల్యాండ్ ఓనర్లకే అడ్డికి పావుశేరు ధరలకే ఎందుకు కట్టబెడుతున్నారు. రూ.ఆరు లక్షల 29 వేల కోట్ల విలువైన భూములను కేవలం రూ.ఐదు వేల కోట్లకే కట్టబెట్టడం కుంభకోణం కాక మరేంటి.

### ఇది Insider Trading Scam. and Quid Pro Quo Scam

జూబ్లీహిల్స్ ప్యాలెస్ సీఎం రేవంత్ రెడ్డి గ్యాంగ్ ముందుగానే 22 పారిశ్రామికవాడల్లో రెక్కీ నిర్వహించి, అక్కడున్న సంస్థలకు చెందిన వారితో అగ్రిమెంట్లు కుదుర్చుకున్న తర్వాత ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి HILT పాలసీని క్యాబినెటులో ఆమోదించారు. ఇది ముమ్మాటికీ Insider Trading Scam. ఇది క్విడ్ ప్రో కో స్కాం.

### ఈ స్కాములో సీఎం ది ప్రధాన వాటా. మంత్రులకు, గాంధీ ఫ్యామిలీకి వాటా ఉంది.

రూ.ఆరు లక్షల 29 వేల కోట్ల కుంభకోణంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో సహా మొత్తం క్యాబినెటుకు, కాంగ్రెస్ హైకమాండ్ పెద్దలకు భాగస్వామ్యం ఉంది. రూ.ఆరు లక్షల 29 వేల కోట్ల స్కాములో రూ.మూడు లక్షల 30 వేల కోట్లు సీఎం రేవంత్ రెడ్డికి, క్యాబినెట్ సబ్ కమిటీ మంత్రులు నలుగురికి రూ.15 వేల కోట్ల చొప్పున రూ.60వేల కోట్లు, మిగిలిన 11 మంది మంత్రులకు రూ.10వేల కోట్ల చొప్పున వారికి రూ.లక్ష 10 వేల కోట్లు. కాంగ్రెస్ హైకమాండ్ నేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలకు చెరో రూ.50వేల కోట్ల చొప్పున రూ.లక్ష కోట్లు, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు రూ.30 వేల కోట్లు ముట్టనున్నాయి.

### రేవంత్ రెడ్డి సీఎం గా కాకుండా ల్యాండ్ లూటీ మాఫియా డాన్ లా వ్యవహరిస్తున్నారు.

కాంగ్రెస్ సర్కార్ చేస్తున్నది ల్యాండ్ కన్వర్షన్ కాదు, ల్యాండ్ లూటీకి పాల్పడుతోంది. రాష్ట్రాన్ని ల్యాండ్ లూటీ మాఫియా రాజ్యమేలుతోంది. సీఎం రేవంత్ రెడ్డి ల్యాండ్ లూటీ మాఫియా డాన్ లా, మంత్రులు ల్యాండ్ లూటీ గ్యాంగ్ స్టర్లుగా వ్యవహరిస్తున్నారు.

### అసెంబ్లీలో చర్చించిన తర్వాతే హిల్ట్ పాలసీని టేకప్ చేయాలి. జీవో 27ను రద్దు చేయాలి.

హిల్ట్ పాలసీలో ఎలాంటి అవినీతి లేదంటున్న మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి గారికి దమ్ముంటే సీఎం రేవంత్ రెడ్డి గారిని ఒప్పించి తక్షణమే అసెంబ్లీని సమావేశపరచాలి. అసెంబ్లీలో చర్చించిన తర్వాతే హిల్ట్ పాలసీని అమలు చేయాలి. ఈ పాలసీని అమలు చేసేందుకు జారీ చేసిన జీవో-27ను తక్షణమే రద్దు చేయాలి.

### హిల్ట్ పాలసీ ల్యాండ్ లూటీ స్కామ్ అని రుజువు చేయకపోతే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తాను. సవాలుకు మంత్రులు, సీఎం సిద్ధమా?

మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికే కాదు, దుష్టచతుష్టయమైన క్యాబినెట్ సబ్ కమిటీ మంత్రులకు సవాల్ చేస్తున్న, వారు నలుగురు కలిసి వచ్చినా సరే, విడి విడిగా వచ్చినా సరే, ఎక్కడైనా సరే, ఎప్పుడైనా సరే బహిరంగ చర్చకు సిద్ధం. హిల్ట్ పాలసీ రూ.ఆరు లక్షల కోట్ల మేర అవినీతికి ఆస్కారమున్న ల్యాండ్ లూటీ స్కామ్ అని రుజువు చేస్తాను. రుజువు చేయలేకపోతే నేను నా ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి రాజకీయ సన్యాసం స్వీకరిస్తాను. మరి హిల్ట్ పాలసీ భారీ ల్యాండ్ లూటీ స్కామ్ అని రుజువు చేస్తే దుష్టచతుష్టయంతో పాటు ల్యాండ్ లూటీ మాఫియా డాన్ లా వ్యవహరిస్తున్న రేవంత్ రెడ్డి కూడా సీఎం పదవికి రిజైన్ చేయాలి.

# సర్పంచ్ పదవికి పోటీలో మాజీ మావోయిస్ట్

**- శివంగలపల్లి సర్పంచ్ స్థానానికి పోటీకి సిద్ధం**

**రాజన్నసిరిసిల్ల,నవంబరు29 ( వెలుతురు):**
తెలంగాణలో జరుగుతున్న పంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్ స్థానానికి మాజీ మావోయిస్టు నేత జ్యోతి బరిలోకి దిగుతున్నారు. మావోయిస్టు పార్టీలో 19 సంవత్సరాలుగా పనిచేసి ప్రజా సమస్యల పోరాటానికి కృషి చేశానని, 2023 సంవత్సరంలో సంవత్సరంలో లొంగిపోయిన అనంతరం, గ్రామంలో ప్రజల సమస్యలపై దృష్టి సాధించినట్లు తెలిపారు. మూడేళ్ల క్రితం లొంగి పోయిన మాజీ మావోయిస్టు నేరెళ్ల జ్యోతి సర్పంచిగా పోటీ చేసేందుకు నామినేషన్ దాఖలు చేశారు. రాజన్న సిరిసిల్ల జిల్లా శివంగలపల్లికి చెందిన నేరెళ్ల జ్యోతి 2005లో దళ సభ్యురాలిగా చేరారు. కోనరావుపేట జిల్లా పరిషత్తు ఉన్నత పాఠ శాలలో 2001లో పదో తరగతి చదివిన జ్యోతి.. 19 ఏళ్ల ప్రస్థానంలో జిల్లా కమిటీ సభ్యురాలి స్థాయికి చేరారు. రాష్ట్ర ప్రెస్ ఇన్ ఛార్జిగా కూడా బాధ్యతలు నిర్వహించారు. 2023లో అనారోగ్య కారణాలతో కరీంనగర్ ఎస్పీ సుబ్బారాయుడు ముందు లొంగిపోయారు. ప్రస్తుతం గ్రామంలోనే ఉంటున్న జ్యోతి పంచాయతీ ఎన్నికల రిజర్వేషన్లలో శివంగలపల్లి సర్పంచ్ స్థానాన్ని బీసీ మహిళకు కేటాయించారు. ప్రజాసేవ చేసే అవకాశం కోసం సర్పంచి పోటీలో నిల బడినట్లు జ్యోతి తెలిపారు.

# స్టాక్ మార్కెట్ ట్రేడింగ్ పేరుతో భారీ మోసం

**- ముఠాను అరెస్ట్ చేసిన సైబర్ క్రైమ్ పోలీసులు**

**హైదరాబాద్,నవంబరు29 ( వెలుతురు):**
స్టాక్ మార్కెట్ ట్రేడింగ్ పేరుతో భారీ మోసాలకు పాల్పడుతున్న ముఠాను హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్టు చేశారు. ముంబయిలో ఇద్దరిని అరెస్టు చేయగా.. వారిలో ప్రధాన నిందితుడు రవికుమార్‌తో పాటు మ్యూల్ బ్యాంక్ అకౌంట్లు సమకూరుస్తున్న శివేంద్ర అశోక్ సింగ్ ఉన్నారు. హైదరాబాద్‌కు చెందిన వ్యక్తికి ట్రేడింగ్ పేరుతో రూ.12.30 లక్షలు మోసం చేసినట్లు సమాచారం. నిందితులపై దేశవ్యాప్తంగా 12 కేసులు ఉన్నట్లు గుర్తించారు. నిందితుల విచారణలో మరిన్ని విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశముందని పోలీసులు భావిస్తున్నారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు వీరిని వలపన్ని పట్టుకున్నారు.

# ఏకగ్రీవం జాబితాలో మరో గ్రామం

**- చిన్నఅడిశర్లపల్లి పంచాయతీపై ఏకాభిప్రాయం**

**నల్లగొండ,నవంబరు29 ( వెలుతురు):**
సర్పంచ్ ఏకగ్రీవంలో మరో గ్రామం చేరింది. గ్రామ అభివృద్ధి లక్ష్యంగా గ్రామస్థులు ఏకగ్రీవానికి మొగ్గుచూపారు. నల్గొండ జిల్లా కొండమల్లేపల్లి పరిధిలోని చిన్నఅడిశర్లపల్లి గ్రామ పంచాయతీ సర్పంచిగా వెంకటయ్య గౌడ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గ్రామాభివృద్ధి కోసం రూ.51.30 లక్షలు సొంత నిధులు సమకూరుస్తానని ఆయన గ్రామస్థుల ఎదుట అంగీకరించినట్లు తెలుస్తోంది. ఆ మొత్తాన్ని గ్రామంలోని ప్రధాన సమస్యల పరిష్కారానికి వినియోగించాలని గ్రామపెద్దలు తీర్మానించినట్లు సమాచారం. వాస్తవానికి ఇక్కడ మూడో విడతలో ఎన్నిక జరగాల్సి ఉంది. అయితే, గ్రామంలో ఎలాంటి గొడవలు లేకుండా సర్పంచిని ఏకగ్రీవంగా ఎన్నుకోవడంపై గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# ఆత్మత్యాగం చేసిన వారికన్నా మీరు గొప్పా?

- **శ్రీకాంతచారి ఆత్మత్యాగం గుర్తుకు రావడం లేదు**
- **గద్దర్, కోదండరాం, అందె శ్రీ, గూడ అంజయ్యలను ఎందుకు విస్మరించారు**
- **కెటిఆర్ వ్యాఖ్యలను గట్టిగా తిప్పికొట్టిన ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్**



**హైదరాబాద్,నవంబరు29 ( వెలుతురు):**
తెలంగాణ సాధనలో అమరవీరుల త్యాగాల కంటే కేసీఆర్ దీక్షను పెద్దదని చెప్పుకోవడం సరైందా అని ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ ప్రశ్నించారు. కేసీఆర్ చేసిన దీక్ష నిజంగా ఎలా జరిగిందో ప్రజలందరికీ తెలుసని, ఆ దీక్షను మహోన్నతంగా చూపించడానికి బీఆర్ఎస్ ప్రయత్నం చేయడం దారుణమని వ్యాఖ్యానించారు. ఈ మేరకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. తెలంగాణ కోసం ప్రాణాలు అర్పించిన శ్రీకాంతాచారి, యాదయ్య, ఇషాన్ రెడ్డి, కానిస్టేబుల్ కిష్టయ్య వంటి అమరవీరుల త్యాగాలు ఎంత గొప్పవో గుర్తు చేశారు. అలాంటి త్యాగాలను పక్కన పెట్టి కేసీఆర్ దీక్షను ప్రోత్సహించడం బీఆర్ఎస్ నాయకుల రాజకీయ నాటకమని అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి తెలంగాణ ఉద్యమకారులకు చూపుతున్న గౌరవం ప్రత్యేకమని, కేసీఆర్ మాత్రం ఉద్యమకారులను జైల్లో పెట్టిన చరిత్ర కలిగి ఉన్నాడని దయాకర్ అన్నారు. తెలంగాణ ప్రజల రుణం తీర్చుకునే పనిలో రేవంత్ రెడ్డి ఉన్నారని, ఆయన పాలన మానవతా స్ఫూర్తిని ప్రతిబింబిస్తోందని పేర్కొన్నారు. పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ కేసీఆర్ దీక్షపై విమర్శలు చేస్తే కేటీఆర్ ఎందుకు అంత అసహనం చూపుతున్నాడని దయాకర్ ప్రశ్నించారు. కాంగ్రెస్‌లో పనిచేసిన కాలంలో తెలంగాణ కోసం చిన్నారెడ్డి సంతకాల సేకరణలో మహేష్ గౌడ్ కీలకపాత్ర పోషించారని గుర్తు చేశారు. సాగరహారం రోజున కేసీఆర్, కేటీఆర్ ఎక్కడ ఉన్నారని కూడా ప్రశ్నించారు. బీఆర్ఎస్ నాయకత్వంపై దయాకర్ ఘాటు వ్యాఖ్యలు చేస్తూ.. కాంగ్రెస్ విలీనానికి కేసీఆర్ అవకాశవాద రాజకీయాల వల్లే అడ్డుపడ్డాడని, మిలియన్ మార్చ్‌ను కూడా వ్యతిరేకించాడని తెలిపారు. గద్దర్, కోదండరాం, అందె శ్రీ, గూడ అంజయ్య వంటి ఉద్యమకారులు కేసీఆర్‌కు నచ్చరని అన్నారు. ఉద్యమ సమయంలో మరణించిన శ్రీకాంతాచారిని బీఆర్ఎస్ గుర్తు చేసుకోవడం లేదని ఎత్తి చూపారు. సోనియా గాంధీ వల్లే తెలంగాణ ఏర్పడిందని కేసీఆర్ అనేకసార్లు చెప్పినా, అదే సోనియా గాంధీని తర్వాత అవమానించడం అతని స్వభావానికి నిదర్శనమని దయాకర్ చెప్పారు. తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్‌ను చంపడానికి కేసీఆర్ ప్రయత్నించాడని ఆరోపించారు. రేవంత్ రెడ్డి సీఎం అయ్యి సోనియా గాంధీకి తెలంగాణ బహుమతి ఇచ్చారని, బీఆర్ఎస్‌గా మారిన రోజే కేసీఆర్ పార్టీలో తెలంగాణ ఆత్మ చనిపోయిందని విమర్శించారు. అందె శ్రీ అంత్యక్రియల సందర్భంగా రేవంత్ రెడ్డి చూపిన మానవత్వం అందరిని ఆకట్టుకుందని అన్నారు. కేటీఆర్ రాజీవ్ గాంధీపై వ్యాఖ్యలు చేస్తే సహించబోమని దయాకర్ హెచ్చరించారు. ప్రస్తుతం బీఆర్ఎస్‌లో 420 ముద్ర వేసుకున్న నాయకులు మాత్రమే మిగిలారని, సర్పంచ్ ఎన్నికల్లో సెంటిమెంట్ కోసం హడావిడి చేస్తున్నారని ఎద్దేవా చేశారు. తెలంగాణ ఉద్యమం పేరిట రాష్ట్రాన్ని దోచుకున్నవారు బీఆర్ఎస్ నాయకులేనని వ్యాఖ్యానించారు.

# ప్రభుత్వ స్థలంలో విల్లాలు కట్టి అమ్మకం

**- రెయిన్‌బో మెడోస్ నిర్మాణ సంస్థ మోసం**

**హైదరాబాద్,నవంబరు29 ( వెలుతురు):**
సంగారెడ్డి జిల్లాలోని కిష్టారెడ్డిపేటలో రెయిన్‌బో మెడోస్ నిర్మాణ సంస్థ పాల్పడిన అతిపెద్ద రియల్ ఎస్టేట్ మోసం తాజాగా వెలుగు చూసింది. ప్రభుత్వ స్థలంలో విల్లాలను కట్టి 40కోట్లకు మోసం చేసింది. రెవెన్యూ అధికారులు ఈ తతంగాన్ని చోద్యం చూశారే తప్ప నిలదీయలేదు. హెచ్‌ఎండీఏ ఆమోదించిన లేఅవుట్‌గా నమ్మించి, పలు సర్వే నంబర్లలో ఏకంగా 40 విల్లాలను అక్రమంగా నిర్మించి అమాయక ప్రజలకు విక్రయించారు. ఇటీవల రెవెన్యూ అధికారుల సర్వేలో ఈ విల్లాలన్నీ సర్వే నంబర్లు 198, 199, 204, 208, 210లలోని ప్రభుత్వ భూమిలో ఉన్నట్లు నిర్ధారణ కావడంతో, కొనుగోలు దారులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విల్లాల కోసం ఒక్కో కుటుంబం రూ. 90 లక్షల నుంచి రూ. 1.1 కోటి వరకు వెచ్చించింది. మొత్తంగా, బాధితులు సుమారు రూ. 40 కోట్లకు పైగా పెట్టుబడిని నష్టపోయే పరిస్థితి ఏర్పడింది. ఈ మోసం వెలుగులోకి రాగానే, తమకు న్యాయం చేయాలంటూ బాధితులు ఆందోళనకు దిగారు. గతంలోనే కొందరు బాధితులు అనుమానం వ్యక్తం చేసినప్పుడు, ఆ భూమి ప్రభుత్వానిదని తేలితే తాము తీసుకున్న డబ్బు మొత్తాన్ని తిరిగి చెల్లిస్తామని రెయిన్‌బో మెడోస్ సంస్థ లిఖితపూర్వక ఒప్పందం (ఓక్షజ) ఇచ్చింది. అయితే, ఇప్పుడు అది ప్రభుత్వ స్థలం అని నిర్ధారణ కావడంతో, నిర్మాణ సంస్థ స్పందించకుండా ముఖం చాటేయడంతో బాధితులు దిక్కుతోచని స్థితిలో పడిపోయారు. తమ ఇళ్లు ప్రభుత్వ భూమిలో ఉన్నట్లు తేలడంతో, హెచ్‌ఎండీఏ, ఎంఆర్‌ఓ, ఆర్‌డిఓ వంటి ప్రభుత్వ వ్యవస్థలు ప్రభుత్వ భూమిని తనిఖీ చేయకుండా ఈ నిర్మాణాలకు ఎలా అనుమతి ఇచ్చాయని బాధితులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సంస్థ తమను మోసం చేసిందని ఆరోపిస్తూ, సంస్థ భాగస్వాములైన ఇంటూరి నాగేశ్వరరావు, ఇంటూరి ప్రసాద్, ఎన్.వి. నరసింహారావులపై క్రిమినల్ కేసు నమోదు చేసి, తమకు అయిన నష్టాన్ని పూర్తిగా తిరిగి ఇప్పించాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రస్తుతం, బాధితులు అమీన్‌పూర్ పోలీసులను ఆశ్రయించేందుకు సిద్ధమవుతున్నారు. ఈ వ్యవహారంపై అధికార యంత్రాంగం ఎలా స్పందిస్తుందో, బాధితులకు న్యాయం జరుగుతుందో లేదో తెలియాల్సి ఉంది.

# సిమ్ లేకుండా వచ్చే కాల్స్‌కు చెక్

**- కమ్యూనికేషన్ యాప్స్ కట్టడికి రంగం సిద్ధం**

**- సిమ్ బైండింగ్ తప్పనిసరి చేస్తూ కేంద్రం ఆదేశాలు**

**న్యూఢిల్లీ,నవంబరు29 ( వెలుతురు):**

సైబర్ నేరగాళ్లు వెబ్, ఇతర వాట్సప్, టెలిగ్రామ్, సిగ్నల్, అర్టటై వంటి కమ్యూనికేషన్ యాప్స్ ద్వారా కాల్స్ చేయకుండా కట్టడికి కేంద్రం రంగంలోకి దిగింది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం కీలక ఆదేశాలు జారీ చేసింది. సిమ్ బైండింగ్‌ను తప్పనిసరి చేసింది. అంటే డివైజ్‌లో సిమ్ కార్డు ఉంటేనే యాప్ సర్వీసులను పనిచేసేలా చూడాలని డిపార్ట్‌మెంట్ ఆఫ్ టెలికమ్యూనికేషన్స్ సూచించింది. టెలికమ్యూనికేషన్ సైబర్ సెక్యూరిటీ సవరణ నిబంధనలు, 2025లో భాగంగా యాప్ ఆధారిత కమ్యూనికేషన్ సేవలందించే సంస్థలకు తాజాగా డాట్ ఈ ఆదేశాలు జారీ చేసింది. కమ్యూనికేషన్ యాప్స్ దుర్వినియోగం కాకుండా నిత్యం సిమ్ కార్డుతో అనుసంధానం అయ్యేలా చూడడం ఈ రూల్ ముఖ్య ఉద్దేశం. 90 రోజుల్లో ఈ నిబంధనలను అమలు చేయాలని పేర్కొంది. కొత్త నిబందనల ప్రకారం.. కమ్యూనికేషన్ యాప్స్‌ను టెలి కమ్యూనికేషన్ ఐడెంటిఫై యూజర్ ఎంటిటీస్గా పేర్కొంటారు. యూజర్ ఏ సిమ్‌తో అయితే అకౌంట్ రిజిస్టర్ చేశారో, ఆ సిమ్ మాత్రమే ఆ ఫోన్‌లో ఉంటేనే యాప్ పని చేస్తుంది. సిమ్ తీసేస్తే లేదా ఫోన్ మార్చితే యాప్ ఆటోమాటిక్‌గా లాగౌట్ అవుతుంది. ఒకవేళ యూజర్ వెబ్ బ్రౌజర్‌లో ఈ సేవలను ఉపయోగిస్తే.. సదరు ప్లాట్‌ఫామ్ ప్రతి ఆరు గంటలకు లాగౌట్ అయ్యేలా చూడాలి. మళ్లీ సేవలు పొందాలంటే క్యూఆర్ కోడ్ ద్వారా లాగిన్ అవ్వాల్సి ఉంటుంది.ప్రస్తుతం యాప్ ఇన్‌స్టలేషన్ సమయంలోనే సిమ్‌కార్డును ధ్రువీకరించుకుంటున్నారు. ఒకవేళ సదరు డివైజ్ నుంచి సిమ్‌కార్డు తొలగించినా, డీయాక్టివేట్ చేసినా సేవలు మాత్రం కొనసాగుతున్నాయి. దీంతో ఇతర దేశాల్లో ఉండే సైబర్ నేరగాళ్లు యాప్స్‌ను వినియోగించుకోవడం సాధ్యమవుతోంది. సిమ్ బైండింగ్ నిబంధనల వల్ల మోసపూరిత కార్యకలాపాలు తగ్గుతాయని సైబర్ నిపుణులు విశ్లేషిస్తున్నారు. వీటిని వాట్సప్, టెలిగ్రామ్ వంటి సంస్థలు ఎలా అమలు చేస్తాయో చూడాలి. ఎవరైతే డీయాక్టివేట్ అయిన సిమ్‌కార్డుతో వాట్సప్ వంటి యాప్స్‌ను వినియోగిస్తున్నారో వారు కూడా ఈ నిబంధనల వల్ల సేవలు పొందలేరు. ప్రస్తుతం యూపీఐ పేమెంట్ యాప్స్ సిమ్ ఉంటేనే సేవలందిస్తున్నాయి.

# తదుపరి సిఎస్‌గా సాయిప్రసాద్

**- ఉత్తర్వులు జారీచేసిన ప్రభుత్వం**

**అమరావతి,నవంబరు29 ( వెలుతురు):**

ఏపీ నూతన సీఎస్‌గా జి.సాయిప్రసాద్‌ను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. 2026 మార్చి ఒకటో తేదీ నుంచి సాయిప్రసాద్ బాధ్యతలు స్వీకరించనున్నారు. ఈ మేరకు సాధారణ పరిపాలనా శాఖ పొలిటికల్ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్. సురేశ్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుత సీఎస్ కె. విజయానంద్ పదవీకాలాన్ని మరో మూడు నెలల పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది సర్కార్. ఈ మేరకు జీవో నంబర్ 2230ను విడుదల చేసింది ప్రభుత్వం. మరోవైపు.. పదిమంది డిప్యూటీ కలెక్టర్‌లకు పోస్టింగ్‌లు ఇస్తూ ప్రభుత్వ ఉత్తర్వులు జారీ చేసింది. ఈమేరకు జీవో ఆర్టీ నెంబర్ 2228 జారీ చేశారు సీఎస్ విజయానంద్.

# ఒకే కుటుంబంలో తీరని విషాదం

**- అంతుచిక్కని వ్యాధితో ముగ్గురు బాలల మృతి**

**- ఘటనతో అప్రమత్తం అయిన అధికార యంత్రాంగం**

**- గ్రామంలో వైద్యశిబిరం ఏర్పాటుచేసి పర్యవేక్షణ**


**లక్నో,నవంబర్29( వెలుతురు):**

ఉత్తరప్రదేశ్ లో విషాదకర ఘటన చోటుచేసుకుంది. తీవ్ర జ్వరంతో బాధ పడుతూ గంటల వ్యవధిలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు చిన్నారులు మృత్యువాత పడ్డారు. ఈ ఘటన ఆ రాష్ట్రంలో తీవ్ర కలకలం రేపింది. విషయం తెలిసిన వెంటనే అధికారులు అప్రమత్తమయ్యారు. నెబువా నౌరంగియా బ్లాక్‌లోని గులార్హియా తోలా గ్రామంలో వరుసగా ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు చిన్నారులు మృతి చెందారు. వారి మృతికి కారణాలు తెలియరాలేదు. పింటు గౌర్ అనే వ్యక్తి కుమార్తె మంజు(7) వారం క్రితం అనారోగ్యానికి గురైంది. స్థానిక వైద్యుడి వద్ద చికిత్స అందించినప్పటికీ బాలిక కోలుకోలేదు. ఈ క్రమంలో మరో ఆస్పత్రికి తరలించగా.. అక్కడ చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయింది. ఆ తర్వాత కొన్ని గంటలకే గౌర్‌కు చెందిన చిన్న కుమార్తె ఖుషి (3), కుమారుడు కృష్ణ (5) కూడా జ్వరంతో మృతి చెందారు. ముగ్గురు చిన్నారుల మృతి నేపథ్యంలో వైద్యశాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. వీరి మృతికి గల కారణాలు తెలుసుకునేందుకు దర్యాప్తు చేపట్టారు. గ్రామంలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి.. గ్రామంలోని మిగిలిన పిల్లలకు వైద్యపరీక్షలు నిర్వహిస్తున్నారు. దర్యాప్తు అనంతరం పిల్లల మృతికి గల కారణాలు వెలువడతాయన్నారు. ఆరోగ్యశాఖ బృందం ఇప్పటివరకు గ్రామంలో 57 మంది పిల్లలకు మలేరియా, డెంగీ పరీక్షలు నిర్వహించినట్లు ఓ అధికారి తెలిపారు. అవసరమైన వారికి మందులు అందిస్తున్నట్లు వెల్లడించారు. ఈ క్రమంలో ప్రభావిత ప్రాంతాల్లో పారిశుధ్య పనులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దీనికి గల కారణాలను. నీటి నమూనాలను పరిశీలిస్తున్నారు. అలాగే ఆహార పదార్థాలపైనా ఆరా తీస్తున్నారు.

# స్మృతి, పలాశ్‌ల వివాహం రద్దంటూ పుకార్లు

**- ఒక్క ఎమోజీతో చెక్ పెట్టిన ఇరువురు**

**- త్వరలోనే పెళ్లి అంటూ కుటుంబ సభ్యుల వెల్లడి**



**ముంబై, నవంబర్29 (వెలుతురు):**

భారత మహిళల జట్టు స్టార్ బ్యాటర్ స్మృతి మంధాన, మ్యూజిక్ డైరెక్టర్ పలాశ్ ముచ్చల్ వివాహం వాయిదా పడిన క్రమంలో అనేక పుకార్లు షికారు చేస్తున్నాయి. వీరి వివాహం మొత్తానికే రద్దయ్యిందన్న వార్తలు ప్రచారం సాగాయి. వారు వివాహాన్ని పూర్తిగా రద్దు చేసుకున్నట్లు సోషల్ మీడియాలో ప్రచారం జరిగింది. ఈ వార్తలకు స్మృతి-పలాశ్ దిష్టి రక్ష ఎమోజీతో చెక్ పెట్టారు. వారిరువురూ తాజాగా తమ ఇన్‌స్టాగ్రామ్ బయోలో దిష్టి రక్ష ఎమోజీని చేర్చుకున్నారు. దీంతో వారిరువురి మధ్య ఎటువంటి సమస్యలు లేవనే విషయంపై స్పష్టతనిచ్చినట్లైంది. ఇటీవల ఆమె ఇన్‌స్టా ఖాతాలో పెళ్లికి సంబంధించిన పోస్టులు కన్పించకపోవడం నెట్టింట చర్చనీయాంశంగా మారింది. పలాశ్‌తో ఎంగేజ్‌మెంట్‌ను ధ్రువీకరిస్తూ.. ఎంగేజ్‌మెంట్ రింగ్‌ను చూపిస్తూ స్మృతి పోస్టు చేసిన వీడియో ఆమె ఇన్‌స్టాలో కనిపించలేదు. ఇదే వీడియోను స్మృతి స్నేహితురాళ్లు జెమీమా, శ్రేయాంక కూడా సోషల్ మీడియా ఖాతాల నుంచి తొలగించడంతో పలాశ్‌కు, ఆమెకు మధ్య మనస్పర్థలు వచ్చాయంటూ సోషల్ మీడియాలో ప్రచారం జరిగింది. అదే సమయంలో పలాశ్ ముచ్చల్ మరో మహిళతో మంధానను కించపరుస్తూ చాట్ చేసినట్లు ఆరోపిస్తున్న స్క్రీన్‌షాట్లు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. దీంతో పలు వదంతులు వ్యాపించాయి. శుక్రవారం పలాశ్ తల్లి అమిత, ఓ ఆంగ్ల పత్రికతో మాట్లాడుతూ.. ఇప్పుడు అంతా బాగానే ఉందని, త్వరలో వారిద్దరి వివాహం జరుగుతుందని వివరించారు. 'స్మృతి మంధాన, పలాశ్ ముచ్చల్ ఇద్దరూ ప్రస్తుతం కష్టాల్లో ఉన్నారు. పలాశ్.. స్మృతిని అర్ధాంగిగా ఇంటికి తీసుకురావాలని కలలు కన్నాడు. నేను కూడా వారికి ప్రత్యేకంగా స్వాగతం పలికేందుకు ఏర్పాట్లు చేసుకున్నా. ఇప్పుడంతా బాగానే ఉంది. వారిద్దరి వివాహం అతిత్వరలో జరుగుతుందని ఆమె అన్నారు. ఈ సమయంలో స్మృతి-పలాశ్ ఇన్‌స్టాలో తమ బయోను అప్‌డేట్ చేయడం గమనార్హం. ఈ ప్రకటనతో ఇక పుకార్లకు తెరపడే అవకాశం ఉందని అభిమానులు ఆశిస్తున్నారు.

# దీక్షా దివస్ అంటే స్వాతంత్ర్య దినోత్సవమే

**- తెలంగాణ వచ్చేదాకా దీక్ష విరమించని కెసిఆర్**

**- భువనగిరి దీక్షా దివస్‌లో మాజీమంత్రి జగదీశ్ రెడ్డి**



**యాదాద్రి భువనగిరి,నవంబరు29 ( వెలుతురు):**

కెసీఆర్ నా శవయాత్ర.. తెలంగాణ జైత్ర యాత్ర ఒకేసారి జరగాలి అన్నారని.. అప్పటిదాకా దీక్ష విరమించేది లేదని పట్టుబట్టారని అంటూ ఆనాటి ఘటనలను మాజీమంత్రి జగదీశ్‌రెడ్డి గుర్తు చేశారు. ఆనాటి ఆంధ్రా పోలీస్‌లు, నాయకులు ఎన్నో జిమ్మిక్కులు చేశారని.. అయినా అన్నింటిని ఛేదించి తెలంగాణ సాధించామన్నారు.భువనగిరి జిల్లా కేంద్రంలో నిర్వహించిన దీక్షా దివస్ వేడుకల్లో సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రరెడ్డి పాల్గొన్నారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నవంబర్ 29 దీక్ష దివస్ మనందరికీ స్వాతంత్ర్యం తెచ్చిన రోజు అని తెలిపారు. దేశానికి ఆగస్టు 15 ఎలాగో, మనకు నవంబర్ 29 అలాగేనన్నారు. కేసీఆర్ చావు నోట్లో తలపెట్టి, మొక్కవోని పట్టుదలతో దీక్ష చేసి, ఢిల్లీ మెడలు వంచిన రోజనరి పేర్కొన్నారు. కేసీఆర్ దీక్ష చేసిన 11 రోజులు ఒక్కోక్షణం ఒక్కో భయంతో గడిపామని.. తమ నేతకు ఏమైనా అయితే తెలంగాణ ఎటు పోతుందో అని కన్నీరు పెట్టామన్నారు. కే హైదరాబాద్ లేకుండా తెలంగాణ అన్నారని.. అప్పుడు కేసీఆర్ గుండె లేని మనిషి వున్నా లేనట్లే హైదరాబాద్‌తో కూడిన తెలంగాణనే కావాలని పట్టుబట్టారన్నారు. ఢిల్లీ గడగడ లాడిపోయిందని.. తెలంగాణ బెబ్బులిలా నిలబడి బరిగీసి కొట్లాడింది.. లక్ష్యం ముద్దడినం అంటూ గుర్తు చేశారు. కేసీఆర్ అంటే తెలంగాణ తెచ్చిన ముఖ్యమంత్రి.. తెలంగాణ కోసం చావు అంచుల దాకా, పేగులు తెగే దాకా కొట్లాడిన ఉక్కు మనిషి కేసీఆర్ అన్నారు. అలాంటి కేసీఆర్‌పై ఇప్పుడు కాంగ్రెస్ దొంగలు అవాకులు చవాకులు మాట్లాడుతున్నారని.. తస్మాత్ కొడుకుల్లారా.. కేసీఆర్‌పై నోరు జారితే ఖబడ్దార్ అంటూ హెచ్చరించారు. కేసీఆర్ తెలంగాణ సమాజానికి దేవుడని.. అందరి గుండెల్లో గూడు కట్టుకున్న మహానేత మా కేసీఆర్ అన్నారు. కేసీఆర్ సైనికులుగా మేమంతా తెలంగాణ అభివృద్ధికి కట్టుబడి పని చేశామని.. ఇప్పుడు వస్తున్న 24 గంటల కరంట్, మంచి నీళ్లు, పాడి పంటలు, తెలంగాణ ఆదాయం అన్ని అన్ని కేసీఆర్ సాధించినవేనన్నారు. ఇప్పుడు కాంగ్రెస్ వాళ్లు అనుభవిస్తున్న పదవులు అన్ని కేసీఆర్ తెచ్చినవేనని.. కేసీఆర్‌పై కుట్రలు చేయని పార్టీ లేదని.. ఎప్పుడు పిల్లి శాపనార్థాలు పెడతారని విమర్శించారు. ఇప్పుడు కూడా కేసీఆర్ ఆరోగ్యం బాగాలేదని అబద్దాలు ప్రచారం చేస్తున్నారని.. కేసీఆర్ మళ్లీ సీఎం కావడం ఖాయమన్నారు. తెలంగాణ అభివృద్ధి జరిగిగేది ఒక్క కేసీఆర్‌తోనే సాధ్యమని.. తెలంగాణ వాదులపై తుపాకీ ఎక్కుపెట్టిన దుర్మాగుడు రేవంత్.. ఆయన పాలనే ఇప్పుడు నడుస్తుండడం దౌర్భాగ్యమన్నారు. తెలంగాణలో లాఠీ, లూఠీ పాలన నడుస్తుందని.. తెలంగాణ కాంగ్రెస్ విముక్త రాష్ట్రంగా అయ్యేంత వరకు పోరాటం చేద్దామంటూ జగదీశ్‌రెడ్డి పిలుపునిచ్చారు.

# ఐదేళ్లలో ఒక్క డిఎస్సీ నిర్వహించన ఘనత

**- వైకాపా అధినేత జగన్ తీరుపై మండిపడ్డ కేంద్రమంత్రి**



**భీమవరం,నవంబరు29 ( వెలుతురు):**

గత వైసీపీ ప్రభుత్వంలో ఒక్క రిక్రూట్‌మెంట్ కూడా జరగలేదని కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస్ వర్మ విమర్శించారు. ఈ మేరకు వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై శ్రీనివాస్ వర్మ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో భీమవరం ఎస్ఆర్కేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో మెగా జాబ్ మేళా జరిగింది. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్ వర్మ, ఏపీ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు, పీఏసీ చైర్మన్ పులపర్తి రామాంజనేయులు, ఏపీఐఐసీ చైర్మన్ మంతెన రామరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ వర్మ మాట్లాడుతూ.. గత ఐదేళ్లలో దేశంలో ఒక్క డీఎస్సీని నిర్వహించని ప్రభుత్వం ఏదైనా ఉందంటే అది వైసీపీ ప్రభుత్వమేనని ఎద్దేవా చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో పెద్ద ఎత్తున పరిశ్రమలను ఏర్పాటు చేస్తున్నాయని తెలిపారు. అనకాపల్లిలో నిర్మించబోయే ఆర్ఎస్ మిట్టల్ స్టీల్ ప్లాంట్ ద్వారా 90 వేల మంది నిరుద్యోగులకు త్వరలో ఉద్యోగాలు రానున్నాయని కేంద్ర సహాయ మంత్రి శ్రీనివాస్ వర్మ పేర్కొన్నారు.

# అక్స్‌ఫర్డ్ చర్చలకు రాకుండా అబద్దాల ప్రచారం

**- భారత్‌పై నోరు పారేసుకున్న పాక్ ప్రతినిధులు**

**- గట్టిగా తిప్పికొట్టిన భారత్ ప్రతినిధి**





**న్యూఢిల్లీ,నవంబర్29( వెలుతురు):**

తప్పుడు ప్రచారాలు చేయడం ద్వారా తప్పుకోవడం అలవాటు చేసుకున్న పాకిస్థాన్ మరోసారి తన వక్రబుద్ధిని చాటుకుంది. యూకేలో జరిగే ప్రముఖ చర్చలో పాల్గొనకుండా.. భారత్ అధికారులు వెనుదిరిగారంటూ తప్పుడు ప్రచారానికి తెర లేపింది. అయితే, దీన్ని భారత్ గట్టిగా తిప్పికొట్టింది. వివరాల్లోకి వెళితే.. యూకేలో ఆక్స్‌ఫర్డ్ యూనియన్‌లో గురువారం భారత్- పాక్ అధికారుల మధ్య చర్చజరగాల్సి ఉంది. ఇందులో భారత్ తరఫున మాజీ ఆర్మీ చీఫ్ జనరల్ ఎం.ఎం.నరవాణెళి, సుబ్రమణియన్ స్వామి, రాజస్థాన్ మాజీ ఉప ముఖ్యమంత్రి సచిన్ పైలట్‌లు పాల్గొనాల్సి ఉంది. పాక్ నుంచి ఆ దేశ మాజీ విదేశాంగ మంత్రి హీనా రబ్బానీ, యూకేలోని రాయబారి మొహమ్మద్ ÷సైల్, రిటైర్డ్ జనరల్ జుబైరా మహమూద్ హయత్‌లు హాజరుకానున్నారు. అయితే, ఈ చర్చలో పాల్గొనకుండా భారత్ అధికారులు చివరి నిమిషంలో వెనుదిరిగారంటూ యూకేలోని పాక్ రాయబార కార్యాలయం తప్పుడు ప్రచారానికి తెరలేపింది. 'పాక్ బృందం ఇప్పటికే లండన్‌లో సిద్ధంగా ఉంది. ఆక్స్‌ఫర్డ్ చర్చల్లో పాల్గొనాల్సి ఉంది. అయితే, ఇందులో పాల్గొనకుండా భారత్ బృందం వైదొలగాలని నిర్ణయించుకుందని యూనియన్ నిర్వాహకులు తెలిపారు. అందుకు గల కారణాలు మాత్రం తెలపలేదని ఎక్స్‌లో రాసుకొచ్చింది. అయితే పాక్ అబద్ధపు ప్రచారాన్ని భారత్‌కు చెందిన సీనియర్ న్యాయవాది సాయి దీపక్ గట్టిగా తిప్పికొట్టారు. పాక్ తన తప్పుడు ప్రచారాలను ఇంకా కొనసాగిస్తూనే ఉందని ఎద్దేవా చేశారు. సుబ్రమణియన్, నరవాణెళి కొన్ని కారణాల వల్ల చర్చకు హాజరుకాలేకపోతున్నందున, వీరికి ప్రత్యామ్నా యాలు చూపాలని యూనియన్ అధికారులు తనను కోరారని దీపక్ చెప్పారు. ఈ క్రమంలో తాను యూకేకు వెళ్లి మరో బృందంతో చర్చకు సిద్ధమయినట్లు తెలిపారు. అయితే.. చర్చకు కొన్ని గంటల ముందు యూనియన్ అధికారులు తనకు కాల్ చేసి.. పాక్ తరఫున హాజరవ్వాల్సిన బృందం యూకేకు రాలేదని వెల్లడించారన్నారు. దీంతో చర్చ ఆగిపోవడం తనకు ఆగ్రహం తెప్పించిందన్నారు. పాక్ బృందం కూడా యూకేలోనే ఉందని, భారత్‌తో చర్చల్లో పాల్గొనేందుకు భయపడి వెనుదిరిగినట్లుగా కనిపిస్తుందని విమర్శించారు. తమను ఎదుర్కోలేక పిల్లల వెనక దాక్కుందని ఎద్దేవా చేశారు. దాయాది బృందం ఇంకా ఆక్స్‌ఫర్డ్‌లోనే ఉంటే.. తమతో చర్చకు రావాలని ఆయన సవాల్ విసిరారు. దీపక్ పోస్టులతో పాక్ ప్రకటనలు తప్పు అని మరోసారి స్పష్టమైంది. పాక్ చర్చలో పాల్గొనాల్సి వస్తే బేలతనం బయటపడుతుందనే ఇలా చేసి ఉంటుందని అనుకుంటున్నారు.

# శుక్రమౌఢ్యమి ప్రవేశంతో శుభకార్యాలకు సెలవు

**- ఫిబ్రవరి వరకు ముహూర్తాలు లేవంటున్న పండితులు**

**తిరుమల,నవంబర్29( వెలుతురు):**

గ్రహాల గమన స్థితిని బట్టి ఇప్పుడు శృక్ర మౌఢ్యమి నడుస్తోంది. దీంతో శుభకార్యాలకు తావు లేదు. సాధరణంగా డిసెంబర్‌లో మళ్లీ మంచి ముహూర్తాలు వచ్చేవి కానీ ఈ యేడు అలాంటి అవకాశం లేదు. ఈసారి దాదాపు మూడు నెలల పాటు శుభ ముహూర్తాలు లేవని పండితులు సెలవిస్తున్నారు. ఈనెల 26న మార్గశిర మాసం శుద్ధ షష్ఠి నుంచి ప్రారంభమైన శుక్ర మౌఢ్యమి మాఘ బహుళ అమావాస్య ఫిబ్రవరి 17 వరకూ కొనసాగనుంది. దీంతో సుమారు 84 రోజుల పాటు శుభకార్యాలకు ముహూర్తాలు లేవు. జ్యోతిష్య శాస్త్రం ప్రకారం.. ఒక గ్రహం సూర్యుడి కిరణాలలో కనుమరుగై పోవడాన్ని మౌఢ్యమి అంటారు. దీనినే వాడుక భాషలో మూఢమి అంటే చీకటి అంటారు. శుభకార్యాలకు గురుడు ఎంత ప్రధాన కారకుడో శుక్రుడూ అంతే ప్రభావం కలవాడు. గ్రహశక్తులు బలహీనమవడంతో శుక్ర గ్రహం సూచించే ఫలితాలు అంతగా అనుకూలంగా ఉండవు. శుక్రుడు బలహీనం అయితే సంబంధాలు, వివాహ జీవితం, ఆర్థిక స్థిరత్వంలో ప్రతికూలతలు ఏర్పడతాయని జ్యోతిషులు చెబుతున్నారు. అందుకే శుక్ర మౌఢ్యం ఉన్న కాలంలో శుభకార్యాలు జరిపించడం శుభసూచకం కాదని సూచిస్తున్నారు. మార్గశిర, మాఘ, ఫాల్గుణ మాసాల్లో శుభకార్యాలు అధికంగా జరుగుతాయి. అయితే.. ఈసారి మార్గశిరంలో ఒకటి, రెండు ముహూర్తాలే ఉండగా.. పుష్యం శూన్య మాసం అవుతుంది. ఇక మాఘంలోనూ ఒక్క మూహూర్తం లేకపోవడం గమనార్హం. గృహ ప్రవేశాలకు అనుకూలమైన రథ సప్తమి, సరస్వతి జన్మదినమైన వసంత పంచమి మహామాఘ్‌గా కీర్తించబడే మాఘ పౌర్ణమి వంటి తిథులూ ఈసారి మూఢంలోనే కలిసిపోయాయి. ఈ నెల 26 నుంచి 2026 ఫిబ్రవరి 17 వరకు దాదాపు మూడు నెలల పాటు శుభకార్యాలకు మంచిరోజులు లేవని తిరుమల పండితులు చెబుతున్నారు. శుక్రమౌఢ్యం వల్ల ఒక్క శుభముహూర్తం కూడా లేదని అన్నారు. శుభకార్యాలతో పాటు గృహ ప్రవేశాలు, విగ్రహ ప్రతిష్ఠాపనలూ వంటివీ నిర్వహించడానికి అవకాశం లేదని సూచించారు. దీంతో దీనికి సంబంధించిన వ్యాపారాలపైనా ప్రభావం పడనుంది.



# కర్నూలు జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం

**- రెండు కార్లు ఢీకొని ఐదుగురు మృత్యువాత**

**- ఇద్దరు చిన్నారులు సహా ఐదుగురు మృతి**

**- మంత్రాలయం దర్శనం కోసం వస్తుండగా ఘటన**

**- మృతులు కర్నాటక వాసులుగా గుర్తింపు**

**కర్నూలు,నవంబర్29( వెలుతురు):**



కర్నూలు జిల్లా పరిధిలో శనివారం ఉదయం రెండు రోడ్డు ప్రమాదాలు సంభవించాయి. ఓ ప్రమాదంలో రెండు కార్లు ఢీకొని ఐదుగురు కర్నాకట వాసులు దుర్మరణం చెందారు. ఎమ్మిగనూరు నియోజకవర్గ పరిధిలోని కొటేకల్ గ్రామం వద్ద ఈ ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది.. రెండు కార్లు ఢీకొన్న ఈ ఘటనలో ఇద్దరు చిన్నారులు సహా మొత్తం ఐదుగురు మృత్యువాత పడ్డారు. మరో నలుగురు గాయపడ్డారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆదోనికి తరలించారు. కర్ణాటక నుంచి శ్రీ రాఘవేంద్ర స్వామి మఠం దర్శనం కోసం మంత్రాలయం వెళ్తుండగా.. కోటేకల్ గ్రామ సమీపంలో ఈ ప్రమాదం జరిగింది. మృతులంతా ఒకే కుటుంబానికి చెందిన వారిగా పోలీసులు గుర్తించారు. వీరిని కర్ణాటక రాష్ట్రం కోలార్ జిల్లా చిక్కహోసల్లి గ్రామానికి చెందిన.. వెంకటేశప్ప(60), ఆయన కూతురు మీనాక్షి(32), అల్లుడు సతీశ్(36), మనవళ్లు రుత్విక్, బన్నీగౌడ్‌లుగా తేల్చారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. బెంగళూరు నుంచి మంత్రాలయం వెళ్తున్న కర్ణాటక బస్సు పత్తికొండ పరిధిలోని తుగ్గలి, రాతన గ్రామాల మధ్య బోల్తాపడింది. ఆ సమయంలో బస్సులో 29 మంది ప్రయాణికులు ఉన్నట్టు సమాచారం. వారిలో ఇద్దరు వ్యక్తులకు స్వల్ప గాయాలయ్యాయి.

# అందనంత ఎత్తులో వైట్, సిల్వర్ మెటల్స్

**- 5 రోజుల్లో కేజీ వెండిపై రూ.21 వేలు పెరుగుదల**




**ముంబై, నవంబర్ 29 వెలుతురు :**
బంగారం, వెండి ధరలు సామాన్యులకు చుక్కలు చూపిస్తున్నాయి. పెళ్లిళ్ల సీజన్ కావడంతో బంగారం కొనాలనుకున్న వారికి షాకిస్తూ గోల్డ్ రేట్స్ చుక్కలనంటుతున్నాయి. వెండి వస్తువులు కొనాలనుకున్న వారి ఆశలు ఆశలుగానే మిగిలిపోయే పరిస్థితులు నెలకొన్నాయి. తాజాగా పెరుగుతున్న ధరలు చూస్తుంటే బంగారంతో పాటు వెండి కూడా అందని ద్రాక్షగా మారుతుందన్న ఆందోళన పెరుగుతోంది. ఇవాళ శనివారం (నవంబర్ 29న) ఒక్కరోజే బంగారం, వెండి ధరలు భారీగా పెరిగాయి. బులియన్ మార్కెట్‌లో 22 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధరపై రూ.1,250 పెరిగి రూ.1,19,000కి చేరింది. 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధరపై రూ.1,360 పెరిగి రూ.1,29,820 పలుకుతోంది.ఇక పసిడి బాటలోనే పయనించిన వెండి ధర ఆల్ టైం రికార్డుకు చేరింది. కేజీ వెండిపై ఏకంగా రూ.9,000 పెరగడంతో రూ.1,92,000 వద్ద ధర కొనసాగుతోంది. 5 రోజుల్లో కేజీ వెండిపై రూ.21 వేలు పెరిగింది. త్వరలోనే వెండి ధర రూ.2 లక్షలు దాటే అవకాశాలు ఉన్నాయని మార్కెట్ నిపుణులు అంచనా వేస్తున్నారు.

# దొరకని ఎస్సై రివాల్వర్



**హైదరాబాద్, నవంబర్ 29 వెలుతురు :**
అంబర్‌పేట ఎస్ఐ భానుప్రకాశ్‌కు చెందిన 9 ఎంఎం సర్వీస్ రివాల్వర్ అదృశ్యం కేసు పోలీసులకు పెను సవాల్‌గా మారింది. బెట్టింగ్ వ్యసనానికి బానిసైన ఆయన, అప్పులు తీర్చేందుకు తన తుపాకీని అమ్ముకున్నాడనే అనుమానాలు బలంగా వ్యక్తమవుతున్నాయి. ఈ కేసు విచారణలో భానుప్రకాశ్ పొంతనలేని సమాధానాలు ఇస్తూ పోలీసులను తప్పుదోవ పట్టిస్తున్నాడు.మొదట తన డ్రాలో రివాల్వర్ కనిపించడం లేదని చెప్పిన భానుప్రకాశ్, ఆ తర్వాత విజయవాడలోని ఓ లాడ్జిలో మర్చిపోయినట్లు కథ అల్లాడు. దీంతో హైదరాబాద్ పోలీసులు విజయవాడ వెళ్లి లాడ్జి సిబ్బందిని, యజమానిని విచారించి, సీసీటీవీ ఫుటేజ్‌ను పరిశీలించారు. అక్కడ తుపాకీకి సంబంధించిన ఎలాంటి ఆనవాళ్లు లభించలేదు. దీంతో ఆయన చెబుతున్న మాటల్లో నిజం లేదని పోలీసులు నిర్ధారణకు వచ్చారు.భానుప్రకాశ్ తీవ్రమైన బెట్టింగ్ వ్యసనపరుడని, శిక్షణలో ఉన్నప్పటి నుంచే ఈ అలవాటు ఉందని ఆయన సహచరులు చెబుతున్నారు. తోటి సిబ్బంది, ఇతరుల వద్ద సుమారు రూ.60 లక్షల వరకు అప్పులు చేసినట్లు సమాచారం. ఈ అప్పుల కోసమే తుపాకీని మొదట రూ.5 లక్షలకు కుదువపెట్టి, ఆ తర్వాత రాయలసీమకు చెందిన ఓ గ్యాంగ్‌కు అమ్మేశాడనే ప్రచారం జరుగుతోంది. అయితే ఈ విషయంలో పోలీసులకు ఇప్పటివరకు ఎలాంటి స్పష్టమైన క్లూ లభించలేదు.గతంలో ఓ బంగారం రికవరీ కేసులో సస్పెండ్ అయినప్పుడు నిబంధనల ప్రకారం సర్వీస్ రివాల్వర్‌ను డిపార్ట్‌మెంట్‌కు అప్పగించాల్సి ఉన్నా, ఆయన తన వద్దే ఉంచుకోవడంపై ఉన్నతాధికారులు సీరియస్ అవుతున్నారు. ఈ గన్ మిస్సింగ్ వ్యవహారంపై సీపీ సజ్జనార్ తీవ్ర ఆగ్రహంతో ఉన్నట్లు తెలిసింది. కేసును త్వరగా ఛేదించాలని టాస్క్‌ఫోర్స్‌పై ఒత్తిడి తెస్తున్నారు.

# బలపడనున్న భారత్-రష్యా రక్షణ సహకారం

**న్యూఢిల్లీ, నవంబర్ 29 వెలుతురు :**



రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ భారత పర్యటనకు సిద్ధమవుతున్న వేళ మాస్కో ఒక కీలక నిర్ణయం తీసుకుంది. భారత్‌తో కుదుర్చుకున్న సైనిక సహకార ఒప్పందాన్ని రష్యా పార్లమెంట్‌లో ఆమోదించేందుకు రంగం సిద్ధమైంది. పుతిన్ పర్యటనకు కొన్ని రోజుల ముందే ఈ పరిణామం చోటుచేసుకోవడం ప్రాధాన్యత సంతరించుకుంది.ఈ ఏడాది ప్రారంభంలో రక్షణ రంగంలో సహకారాన్ని పెంపొందించే లక్ష్యంతో ఇరు దేశాల మధ్య ఈ ఒప్పందం కుదిరింది. మాస్కోలో జరిగిన కార్యక్రమంలో రష్యా రక్షణ మంత్రి అలెగ్జాండర్ ఫోమిన్, ఆ దేశంలో భారత రాయబారి వినయ్ కుమార్‌లు ఈ ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. ఇప్పుడు దీనికి చట్టబద్ధత కల్పిస్తూ రష్యా పార్లమెంట్ ఆమోదముద్ర వేయనుంది. దీంతో ఇరు దేశాల మధ్య సైనిక బంధం మరింత బలోపేతం కానుంది.ప్రధాని నరేంద్ర మోదీ ఆహ్వానం మేరకు డిసెంబర్ 4, 5 తేదీల్లో పుతిన్ భారత్‌లో పర్యటించనున్నట్లు రష్యా అధ్యక్ష కార్యాలయం క్రెమ్లిన్ అధికారికంగా ప్రకటించింది. ఈ పర్యటనలో భాగంగా పుతిన్, ప్రధాని మోదీతో ద్వైపాక్షిక చర్చలు జరుపుతారు. భారత రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆయన గౌరవార్థం ప్రత్యేక విందు ఏర్పాటు చేయనున్నారు. ఈ భేటీ సందర్భంగా ఇరు దేశాల మధ్య మరిన్ని కీలక ఒప్పందాలు జరిగే అవకాశం ఉందని అధికార వర్గాలు అంచనా వేస్తున్నాయి.

# మంత్రి సంధ్యారాణి పీఏ సతీష్‌పై వేధింపుల ఆరోపణలు

**విజయవాడ, నవంబర్ 29 వెలుతురు :**
ఏపీ గిరిజన సంక్షేమశాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి వద్ద అనధికార పీఏగా పనిచేస్తున్న సతీష్‌పై వచ్చిన లైంగిక వేధింపుల ఆరోపణలపై ముఖ్యమంత్రి కార్యాలయం (సీఎంవో) తీవ్రంగా స్పందించింది. అతడిని తక్షణమే ఆ బాధ్యతల నుంచి తొలగించాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ఎట్టి పరిస్థితుల్లోనూ సతీష్ విధుల్లో కొనసాగడానికి వీల్లేదని తేల్చి చెప్పింది. పార్వతీపురం మన్యం జిల్లా సాలూరుకు చెందిన ఓ మహిళ, మంత్రి పీఏ సతీష్ తనను వేధిస్తున్నారని ఆరోపించారు. ఈ విషయం సీఎంవో దృష్టికి వెళ్లడంతో అధికారులు వెంటనే చర్యలు చేపట్టారు. సతీష్‌పై కేసు నమోదు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.అదే సమయంలో, ఈ వ్యవహారంలో రెండు వైపులా విచారణ జరపాలని సీఎంవో సూచించడం గమనార్హం. మహిళ చేసిన ఆరోపణల్లో నిజానిజాలు తేల్చేందుకు సమగ్ర విచారణ చేపట్టాలని పేర్కొంది. ఒకవేళ ఆమె ఆరోపణలు అవాస్తవమని విచారణలో తేలితే, ఆమెపై కూడా చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని సీఎం కార్యాలయం స్పష్టం చేసింది. ఈ ఘటనపై పూర్తిస్థాయి దర్యాప్తు కొనసాగుతోంది.

# రాజధాని భూములపై త్రిసభ్య కమిటీ భేటీ

**- ఎంపిక చేసిన ప్లాట్లకు వాస్తు సమస్యలు**

**- రైతులు కోరితే మరోచోట**

**కేటాయిస్తామన్న మంత్రి పెమ్మసాని**



**అమరావతి, నవంబర్ 29 వెలుతురు :**
సీఎం చంద్రబాబు సూచనల మేరకు రాజధాని రైతులపై త్రిసభ్య కమిటీ సమావేశం జరిగిందని కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. శనివారం రాయపూడి సీఆర్డీఏ కార్యాలయంలో రాజధాని రైతు కమిటీ సభ్యులు, సీఆర్డీఏ అధికారులతో త్రీ మెన్ కమిటీ సభ్యులు భేటీ అయ్యారు. రాజధాని రైతుల సమస్యలపై చర్చించారు. అనంతరం కేంద్రమంత్రి మీడియాతో మాట్లాడుతూ.. 1286 ప్లాట్లకు వీధి పోటు సమస్యలు ఉన్నాయని.. వాస్తు ప్రకారం కొన్ని ఇబ్బందులు వచ్చాయని తెలిపారు. 156 మంది రైతులకు వాస్తు ఇబ్బందులు ఉన్నాయని తెలిపారు. ఒక వేళ వాస్తు బాగాలేని రైతులు తమకు వేరే చోట కావాలని చెప్తే కేటాయిస్తారని అన్నారు. రైతులకు పెన్షన్, హెల్త్ కార్డు సమస్యలు ఉన్నాయని.. ఒక నెలలోనే పరిష్కారం అవుతాయని వెల్లడించారు. లంక భూములు, అసైన్డ్ భూముల సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టామన్నారు. అసైన్డ్ ల్యాండ్‌ను మిగిలిన భూములతో సెపరేట్ చేసి క్యాబినెట్‌లో చర్చిస్తామని అన్నారు. ప్రతి రెండు వారాలకు అందరి రైతుల సమస్యలు వింటామని కేంద్రమంత్రి పెమ్మసాని తెలిపారు. అమరావతి రాజధాని రైతుల సమస్యలను త్రి సభ్య కమిటీ ఎప్పటికప్పుడు తెలుసుకుంటోందని మంత్రి నారాయణ అన్నారు. గ్రామ కంఠాల్లో ఇచ్చిన భూములు, జరీబు, నాన్ జరీబు అన్ని భూములపై దృష్టి పెడతామని చెప్పారు. వచ్చే క్యాబినెట్‌లో అసైన్డ్ భూములు, లంక భూములపై చర్చించనున్నట్లు తెలిపారు. అమరావతి రాజధాని గ్రామాల్లో హెచ్‌డీ లైన్స్, ఇతర మౌలిక వసతులపై దృష్టి పెట్టామన్నారు. గ్రామకంఠాల్లో ఎవరికైతే ఎ÷-లాట్లు ఇచ్చారో వాటిపై ఉన్న అనుమానాలు నేపథ్యంలో అన్ని వెర్గి÷ చేయమని అధికారులకు చెప్పినట్లు తెలిపారు. లంక భూములు విషయంలో ప్రస్తుతానికి ఇబ్బంది లేదన్నారు. ఆర్ అండ్ బి రోడ్‌లకు సంబంధించి పరిహారం తక్షణం వచ్చేలా సీఆర్డీఏ చూస్తుందన్నారు. ఆర్ అండ్ బి ఇవ్వాల్సిన పరిహారాన్ని సీఆర్డీఏ ముందుగా చెల్లిస్తుందన్నారు. 9 గంటలకు అని సమయం ఇచ్చామనని.. అయితే కొందరు రైతుల అలస్యంగా వచ్చారని తెలిపారు. వచ్చే సమావేశం నాటికి అందరినీ పిలుస్తామని మంత్రి నారాయణ పేర్కొన్నారు.

# రైతుల సమస్యలపై ఫోకస్



**విజయవాడ, నవంబర్ 29 వెలుతురు :**
కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అమరావతిలో పనులు ఊపందుకుంటున్నాయి. ఇప్పటికే సీఆర్‌డీఏ భవనం ప్రారంభోత్సవం జరిగింది. మరో ఆరేడు నెలల్లో మరికొన్ని భవనాలుపూర్తి చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. మరోవైపు రాజధాని ప్రాంత రైతుల్లో వ్యతిరేకత రాకుండా ఉండేందుకు వారి సమస్యలపై కూడా ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ పెట్టింది. దీని కోసం వేసిన త్రిసభ్య కమిటీ ఇవాళ సమావేశమై కీలకాంశాలపై క్లారిటీ ఇచ్చింది. అమరావతిలో త్రిముఖ వ్యూహంతో ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఓవైపు రాజధాని పనులు వేగవంతం చేసేందుకు ప్రణాళికలు వేస్తోంది. మరోవైపు పరిష్కారం కాని సమస్యలపై రైతుల్లో ఉన్న అసంతృప్తిని చల్లార్చి వాటిని రిజాల్వ్ చేసేం ప్రయత్నాల్లో ఉంది. రెండో విడత సమీకరణకు ఎలాంటి ఆటంకం లేకుండా ఉండేందుకు ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటోంది. అందుకే రైతుల సమస్య పరిష్కారానికి ముగ్గురు సభ్యులతో కమిటీ వేసింది. ఇందులో కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, మంత్రి నారాయణ, స్థానిక ఎమ్మెల్యే శ్రావణ కుమార్ ఉన్నారు. అమరావతి ప్రాంత రైతులకు, అధికారులకు అనుసంధానంగా ఉంటూ వారి సమస్యలు పరిష్కరిస్తూ అనుమానాలు నివృత్తి చేసే బాధ్యతను ఈ కమిటీకి అప్పగించారు. రాజధాని ప్రాంత రైతుల సమస్యల పరిష్కారానికి ఇప్పటికే పలుమార్లు సమావేశమైన ఈ కమిటీ ఇవాళ మరోసారి సమావేశమైంది. సమావేశానికి హాజరైన కేంద్ర మంత్రి పెమ్మసాని, రాష్ట్ర మంత్రి నారాయణ, ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్‌తోపాటు సీఆర్డీఏ కమిషనర్ కన్నబాబు, గుంటూరు జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా,రాజధాని రైతులు హాజరయ్యారు. రైతులు తాము ఎదుర్కొంటున్న సమస్యలు, ఇంకా పరిష్కారం కాని ఇష్యూలను వివరించారు. వాటి పురోగతిని అధికారులను కమిటీ సభ్యులు అడిగి తెలుసుకున్నారు. ఒకేసారి అన్ని సమస్యలకు పరిష్కారం లభించదని ఒక్కొక్కటిగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని ప్రజలకు కమిటీ సభ్యులు వివరించారు. సమావేశం అనంతరం మీడియాతో మాట్లాడిన మంత్రినారాయణ..” రాజధాని రైతుల సమస్యల పరిష్కారం పై ఎప్పటికప్పుడు అధికారులకు ఆదేశాలు ఇస్తున్నాం. గ్రామ కంఠాల ప్లాట్‌లు, వీధి పోటు ప్లాట్‌లు, జరీబు,అసైన్డ్ భూముల సమస్యలపై చర్చించాం. గ్రామ కంఠాలలో ప్లాట్‌లు పొందిన వారు నిబంధనల ప్రకారం తీసుకున్నారా లేదా అనేది వెరిఫై చేస్తాం. జారీబు - నాన్ జరీబు సమస్యలపై చర్చించాం. రోడ్డు పోటు ఉన్న ప్లాట్‌లు వెరిఫై చేసి మార్చేలా చర్యలు తీసుకుంటాం. అసైన్డ్ భూముల సమస్యపై ప్రత్యేకంగా కేబినెట్‌లో చర్చించి నిర్ణయం తీసుకుంటాం. ఆర్ అండ్ బీ రోడ్లలో స్థలం కోల్పోతున్న వారికి TDR బాండ్లు ఇస్తాం. రైతు సోదరులందరూ 58 రోజుల్లో 34 వేలు ఎకరాలు ల్యాండ్ పూలింగ్‌కు ఇచ్చి ఎంతో సహకరించారు. రైతులకు వ్యక్తిగతంగా బెనిఫిట్ కావాలంటే నిబంధనల ప్రకారం అవకాశం ఉండదు. నిబంధనల ప్రకారం ఉంటే 100 శాతం న్యాయం చేస్తాం. డిసెంబర్ 3 న కోర్టు కేసులు విత్ డ్రా అయితే వెంటనే భూసేకరణ కు వెళ్తాం. ఇప్పటికీ ల్యాండ్ పూలింగ్ కోసం ముందుకు వచ్చిన రైతుల వద్ద భూములు తీసుకున్నాం. “ అని వివరించారు.

# సారీ చెప్పి తీరాల్సిందే






**హైదరాబాద్, నవంబర్ 29 వెలుతురు :**
ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ .. కోనసీమ పచ్చదనం అంశంలో తెలంగాణకు ముడిపెట్టి చేసిన వ్యాఖ్యలు రాజకీయ దుమారాన్ని సృష్టిస్తున్నాయి. గోదావరి జిల్లాల పచ్చదనం, రాష్ట్ర విభజన అంశాలపై మాట్లాడుతూ తెలంగాణ నాయకుల “దిష్టి” వల్ల కొబ్బరి చెట్లు ఎండిపోతున్నాయని చెప్పడంతో తెలంగాణ రాజకీయ నేతలు విమర్శలుచేస్తున్నారు. తెలంగాణ కాంగ్రెస్ పార్టీ జడ్చర్ల ఎమ్మెల్యే డి. అనిరుధ్ రెడ్డి, పవన్ కళ్యాణ్‌ను వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. పవన్ సినిమా ‘ఓజీ’కు 800 రూపాయల టికెట్ ధర పెట్టి కొని ప్రొడ్యూసర్లను కాపాడామని, కానీ తెలంగాణ ప్రజల మనోభావాలు దెబ్బ తీస్తే ఊరుకునేది లేదని ఘాటుగా హెచ్చరించారు. నవంబర్ 26న గోదావరి జిల్లాల్లో జరిగిన ఒక కార్యక్రమంలో మాట్లాడిన పవన్ కళ్యాణ్, రాష్ట్ర విభజన సమయంలో తెలంగాణ నాయకులు గోదావరి పచ్చదనాన్ని చూసి ఆసూయ చెందారన్నారు. గోదావరి జిల్లాల పచ్చదనం వల్లనే రాష్ట్రం విడిపోయింది. తెలంగాణ నాయకుల దిష్టి తాకడం వల్లే కొబ్బరి చెట్లు ఎండిపోతున్నాయి అని పవన్ పలికారు. ఈ వ్యాఖ్యలు తెలంగాణలో తీవ్ర విమర్శలకు దారితీశాయి. బీఆర్ఎస్ మాజీ మంత్రి జగదీష్ రెడ్డి కూడా ఇన్నేళ్లు మీ దిష్టి మా తెలంగాణకు తాకింది అని కౌంటర్ ఇచ్చారు. పవన్ వ్యాఖ్యలు తెలివితక్కువ మాటలని అని జగదీష్ ఘాటుగా స్పందించారు. కాస్త ఆలస్యంగా కాంగ్రెస్ ఎమ్మెల్యే స్పందించారు. పవన్ కళ్యాణ్ వెంటనే క్షమాపణ చెప్పాలి. నీ ఫ్లాప్ అయిన సినిమా కూడా ప్రొడ్యూసర్లు బతకాలని 800 టికెట్ ధర పెట్టి చూసాము. కానీ నువ్వు తెలంగాణ ప్రజల మనోభావాలను దెబ్బ తీసే విధంగా మాట్లాడితే ఊరుకునేది లేదన్నారు. సెప్టెంబర్ 2025లో విడుదలైన ఓజీ సినిమాకు తెలంగాణ ప్రభుత్వం ప్రీమియర్ షోలకు 800 రూపాయల వరకు టికెట్ ధర పెంచే అనుమతి ఇచ్చింది. తెలంగాణలో కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు పవన్‌పై ఏకకాలం దాడి చేస్తున్నారు. ఆంధ్రలో టీడీపీ-జనసేన కూటమి మౌనంగా ఉంది. పవన్ కళ్యాణ్ త్వరలో క్షమాపణ చెప్పకపోతే, ఈ వివాదం మరింత ఊపందుకుంటుందని రాజకీయ వర్గాలంటున్నాయి. తెలంగాణ ప్రజల మనోభావాలు గాయపరచడం ద్వారా పవన్ తన ఇమేజ్‌ను దెబ్బతీసుకున్నారని కొందరు అభిప్రాయపడుతున్నారు.

# ద్రావిడ్, లక్ష్మణ్ వంటి ఆటగాళ్లు లేరు - కపిల్ దేవ్

**ముంబై, నవంబర్ 29 వెలుతురు :**
టెస్టుల్లో బ్యాటింగ్ అంటే క్రీజులో పాతుకుపోవడమని, రాహుల్ ద్రావిడ్, వీవీఎస్ లక్ష్మణ్ వంటి బ్యాటర్లు ఇప్పుడు కరువయ్యారని మాజీ క్రికెటర్ కపిల్ దేవ్ అన్నాడు. ప్రస్తుతం టీ20లు, వన్డే మ్యాచ్‌లు ఎక్కువగా ఆడుతుండటంతో బౌలింగ్‌కు అనుకూలించే పిచ్‌లపై బౌలర్లు సంధించే బంతులను ఎదుర్కొనే అవకాశాలు బ్యాటర్లకు తక్కువగా వస్తున్నాయని ఆయన అభిప్రాయపడ్డాడు.స్పిన్, పేస్‌కు అనుకూలించే పిచ్‌లపై బ్యాటర్లు ఓపికతో ఆడాలని, ప్రత్యేక నైపుణ్యం కలిగి ఉండాలని కపిల్ దేవ్ సూచించాడు. స్పిన్, పేస్‌ను సమర్థంగా ఎదుర్కోవాలంటే ఎంతో నైపుణ్యం అవసరమని ఆయన అన్నాడు. టర్న్, బౌన్స్ ఎక్కువగా ఉండే పిచ్‌లపై బ్యాటింగ్ చేయడం కష్టమని, ఫుట్ వర్క్ అనేది కీలక పాత్ర పోషిస్తుందనే విషయాన్ని గుర్తుంచుకోవాలని ఆయన పేర్కొన్నాడు.రిషబ్ పంత్ విషయానికి వస్తే అతను సహజసిద్ధమైన మ్యాచ్ విన్నర్ అని కపిల్ దేవ్ అన్నాడు. అతడిని డిఫెన్స్ ఆడమని కోరలేమని, పంత్ సిక్సులు, ఫోర్లతో విరుచుకుపడి ప్రత్యర్థి జట్టును కలవరపాటుకు గురిచేయగల సమర్థుడని ఆయన ప్రశంసించాడు. అలాంటి నైపుణ్యం ఉన్న అతడికి నెమ్మదిగా ఆడి 100 బంతుల్లో ఇరవై పరుగులు చేయమని చెప్పలేమని కపిల్ దేవ్ స్పష్టం చేశాడు.



**ఎన్నారైల్లా తయారయ్యారు**
స్వదేశంలో సౌతాఫ్రికాతో జరిగిన టెస్టు సిరీస్‌లో భారత్ 0-2 తేడాతో ఘోర పరాజయం పాలైన నేపథ్యంలో, టీమిండియా బ్యాటర్లపై మాజీ క్రికెటర్ సంజయ్ మంజ్రేకర్ తీవ్ర విమర్శలు చేశారు. భారత బ్యాటర్లకు స్వదేశీ పిచ్‌లపై ఆడేందుకు సరైన శిక్షణ కొరవడిందని, వారు ‘ఎన్నారై’ల (నాన్-రెసిడెంట్ ఇండియన్స్) మాదిరిగా తయారయ్యారని ఆయన ఘాటుగా వ్యాఖ్యానించారు.ఒక భారత బ్యాటర్ దేశవాళీ క్రికెట్‌లో రాణించి జాతీయ జట్టులోకి వచ్చాక, అతను ఒక ఎన్నారైలా మారిపోతున్నాడు. ఎందుకంటే స్వదేశంలో కంటే విదేశాల్లోనే ఎక్కువగా క్రికెట్ ఆడుతున్నాడు” అని మంజ్రేకర్ తన ఇన్‌స్టాగ్రామ్ పోస్టులో పేర్కొన్నారు. యశస్వి జైస్వాల్, కేఎల్ రాహుల్, రిషభ్ పంత్ వంటి ఆటగాళ్లు గత రెండేళ్లలో విదేశాల్లో 9 నుంచి 12 టెస్టులు ఆడితే, భారత్‌లో ఆడినవి చాలా తక్కువ అని ఆయన గుర్తుచేశారు. ఫస్ట్-క్లాస్ మ్యాచ్‌లు ఆడకుండా నేరుగా స్వదేశంలో టెస్టులు ఆడుతుండటంతో, టర్నింగ్ పిచ్‌లపై ఎలాంటి అనుభవం లేకుండా బరిలోకి దిగుతున్నారని విశ్లేషించారు.టర్నింగ్ ట్రాక్‌లపై పవర్ గేమ్‌తో నెగ్గుకురాలేమని, దానికి బదులుగా సున్నితమైన నైపుణ్యాలు అవసరమని మంజ్రేకర్ సూచించారు. ఫాస్ట్, బౌన్సీ పిచ్‌లపై ‘నిలబడి బాదడం’ కొంతమేర ఫలితాన్ని ఇవ్వొచ్చు కానీ, స్పిన్‌కు అనుకూలించే పిచ్‌లపై ఆ వ్యూహం పని చేయదని స్పష్టం చేశారు. అయితే, ఈ వైఫల్యాలకు పూర్తిగా బ్యాటర్లను నిందించలేమని అన్నారు. ఇంగ్లండ్, ఆస్ట్రేలియా వంటి దేశాలు భారత జట్టు పర్యటన ద్వారా భారీ ఆదాయాన్ని పొందుతున్నాయని, అందుకే విదేశీ టూర్లు ఎక్కువగా ఉంటున్నాయని ఆయన అభిప్రాయపడ్డారు.సౌతాఫ్రికాతో సిరీస్‌లో భారత జట్టు నాలుగు ఇన్నింగ్స్‌లలో ఒక్కసారి కూడా 250 పరుగుల మార్కును దాటలేకపోయింది. స్వదేశంలో ఆడిన గత ఏడు టెస్టుల్లో భారత్ ఐదింటిలో ఓటమి పాలవడం గమనార్హం. ప్రస్తుతం భారత జట్టుకు సుమారు 8 నెలల పాటు టెస్టు క్రికెట్ షెడ్యూల్ లేదు. తదుపరి సిరీస్‌ను 2026 ఆగస్టులో శ్రీలంకతో ఆడనుంది.

## భారత ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ ను కలిసి అభినందనలు తెలిపిన తెలంగాణ బార్ కౌన్సిల్

**న్యూ ఢిల్లీ నవంబర్ 29 వెలుతురు :**
డీన్యూఢిల్లీలోని సుప్రీం కోర్ట్ బార్ అసోసియేషన్ వద్ద తెలంగాణ బార్ కౌన్సిల్ వైస్ చైర్మన్ కె.సునీల్ గౌడ్ అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమానికి అధ్యక్షుడు జగన్, వైస్ ప్రెసిడెంట్, రాజేశ్వర్ రెడ్డి, కార్యదర్శులు విజరత్ , ఇంద్రసేన రెడ్డి, మాజీ కార్యదర్శులు జనార్దన్ గౌడ్, శాంతి భూషణ్ మాజీ , జాయింట్ సెక్రటరీ ఎన్.అనిరుధ్, కోశాధికారి పాపయ్య , క్రీడా %d% సాంస్కృతిక విభాగం రాము, నరేష్, ప్రకాష్ మరియు శిరీష హాజరయ్యారు.









# ఓటిటి వేదికగా శివ విడుదల చేస్తాం: నాగ్

ఒకప్పటి కల్ట్ క్లాసిక్ 'శివ' ఇటీవల ప్రేక్షకుల ముందుకు వచ్చి మరోసారి సందడి చేసిన క్రమంలో.. ఇప్పుడీ చిత్రాన్ని ఓటీటీలోకి అందుబాటులోకి తెచ్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని నాగార్జున చెప్పారు. తాజాగా గోవా వేదికగా జరిగిన ఇఫి వేడుకలో ఆయన పాల్గొన్నారు. 'శివ' గురించి, ఏయన్నార్ చిత్రాల గురించి మాట్లాడారు. శివ' రీరిలీజ్ వెర్షన్ ఓటీటీలో విడుదల చేసేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి . ఇప్పటికే పలు సంస్థలతో చర్చలు జరిపాం. ఎంతో కష్టపడి దీన్ని 4కే వెర్షన్‌లోకి మార్చాం. అందరూ చూసి ఎంజాయ్ చేయాలనే తపనతోనే ఓటీటీలో విడుదల చేయాలని అనుకుంటున్నాం. ఇప్పుడు గొప్ప టెక్నాలజీ అందుబాటులోకి వచ్చింది. సినిమాలను 4కే లోకి ఎలా మార్చాలో అర్థమైంది. ఏఐ వచ్చిన తర్వాత ప్రతి పని సులభమైంది. అన్నపూర్ణ స్టూడియోస్‌లో మంచి సాంకేతికత అందుబాటులో ఉందని చెప్పారు. ఏయన్నార్ అలనాటి అనేక అపూర్వ సినిమాలను 4కే వెర్షన్‌లోకి మార్చాలంటే నెగెటివ్స్ లేవని చెప్పారు. అధునాతన సాంకేతిక హంగులతో ఏయన్నార్ పాత చిత్రాలను మళ్లీ ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని ఉన్నా.. రైట్స్, నెగెటివ్స్ లేకపోవడంతో సాధ్యం కావట్లేదని నాగార్జున తెలిపారు. తన 100వ చిత్రం నుంచి కూడా త్వరలోనే అప్‌డేట్స్ వస్తాయని తెలిపారు. అలాగే అఖిల్ తదుపరి చిత్రం 'లెనిన్' పనులు శరవేగంగా జరుగుతున్నాయని వెల్లడించారు.

# మాస్ మహారాజా "భర్త మహాశయులకు విజ్ఞప్తి" మూవీ నుంచి ఫస్ట్ సింగిల్

**హైదరాబాద్ వెలుతురు బ్యూరో (ఉదయ్ కిరణ్) నవంబర్ 29 :**
మాస్ మహారాజా రవితేజ గత కొంతకాలంగా వరుస ఫ్లాప్ లో ఉన్నారు ఆయన నటించిన సినిమాలన్నీ బాక్సాఫీస్ దగ్గర బోల్తా కొడుతున్నాయి. దీంతో ఇప్పుడు "భర్త మహాశయులకు విజ్ఞప్తి " చిత్రంపై హోప్స్ పెట్టుకున్నారు. కిషోర్ తిరుమల రవితేజ హీరోగా తెరికేకుతున్న సినిమా "భర్త మహాశయులకు విజ్ఞప్తి". ఇది మాస్ మహారాజా రవితేజ కెరియర్లో 76వ చిత్రం. ఇందులో ఆశికా రంగనాథ్ ,డింపుల్ హాయతి హీరోయిన్లుగా నటిస్తున్నారు షూటింగ్ జరుపుకుంటున్న ఈ చిత్రాన్ని 2026 సంక్రాంతికి రిలీజ్ చేయడానికి. తాజాగా ఫస్ట్ సింగిల్ అప్డేట్ అందించారు. భర్త మహాశయులకు విజ్ఞప్తి సినిమా నుంచి " బేల్లా బెల్లా" అనే ఫస్ట్ సాంగ్ ని డిసెంబర్ 1న రిలీజ్ చేయనునట్లు మేకర్స్ ప్రకటించారు. రవితేజ ఆశిక రంగనాథ్ స్పెయిన్ లో చిత్రికరించిన ఈ పాట సంగీత ప్రియులను అలరిస్తుందని చిత్ర బృందం చెబుతోంది. "భర్త మహాశయులకు విజ్ఞప్తి" మూవీలో రామ సత్యనారాయణ అనే పాత్రలో రవితేజ కనిపించినారు. రవితేజ ఈ సినిమా కోసం స్టైలిష్ గా మేకవర్ అయ్యారు.%బూం% సినిమాస్ బ్యానర్ పై సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్న ఈ చిత్రానికి బీన్స్ రోలియో సంగీతం సమర్పిస్తున్నారు మూరెళ్ళ మోటోరోఫిని నిర్మిస్తున్నంగా శ్రీకర్ ప్రసాద్ ఎడిటర్ గా ఏఎస్ ప్రకాష్ ప్రొడక్షన్ డిజైనర్ గా వర్క్ చేస్తున్నారు.




# ప్రభాస్ లుక్ కనిపించకుండా వంగా జాగ్రత్తలు

**ఆరు నెలలపాటు పబ్లిక్ ఈవెంట్‌లకు దూరంగా రెబల్**




ప్రభాస్, సందీప్ రెడ్డి వంగా కాంబినేషన్‌లో రానున్న మోస్ట్-అవైటెడ్ యాక్షన్ ఎంటర్‌టైనర్ చిత్రం 'స్పిరిట్' గురించి ఒక ఆసక్తికరమైన వార్త ప్రస్తుతం టాలీవుడ్‌లో చర్చనీయాంశమైంది. ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ ఇటీవల మొదలవ్వగా, దర్శకుడు సందీప్ వంగా ప్రభాస్ లుక్ విషయంలో అత్యంత గోప్యత పాటిస్తున్నట్లు తెలుస్తోంది. తాజా సమాచారం ప్రకారం 'స్పిరిట్' సినిమాలోని ప్రభాస్ పాత్ర లుక్‌ను అభిమానులకు సర్‌ప్రైజ్‌గా ఉంచాలని సందీప్ వంగా గట్టిగా నిర్ణయించుకున్నారు. అందుకే, ఈ లుక్ లీక్ అవ్వకుండా ఉండేందుకు, రాబోయే ఆరు నెలల పాటు ప్రభాస్‌ని పబ్లిక్ ఈవెంట్స్‌కు దూరంగా ఉండాలని కోరినట్లు సమాచారం. పబ్లిక్ ఈవెంట్లు, ఎయిర్‌పోర్ట్‌లలో ప్రభాస్ కనిపిస్తే, ఆయన లుక్‌ను అభిమానులు లేదా మీడియా ఫొటోలు తీసే అవకాశం ఉంది. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని, కొన్ని నెలల పాటు ఎలాంటి ప్రచార కార్యకలాపాలు లేదా బహిరంగ కార్యక్రమాలకు హాజరు కాకూడదని ప్రభాస్, సందీప్ వంగా నిర్ణయించుకున్నట్లుగా వార్తలు వినిపిస్తున్నాయి. ఈ నిర్ణయం ప్రభాస్ అభిమానులను కొంత నిరాశపరిచినా సందీప్ వంగా ప్రభాస్‌ను ఏ విధంగా ప్రెజెంట్ చేయబోతున్నారో చూడాలనే ఉత్సాహం మాత్రం వారిలో ఎక్కువగా ఉంది. 'స్పిరిట్' చిత్రంలో త్రిప్తి దిమ్రి కథానాయికగా నటిస్తుండగా, వివేక్ ఒబెరాయ్, ప్రకాశ్ రాజ్, కాంచన ఇతర ముఖ్య పాత్రల్లో కనిపించనున్నారు. ఈ భారీ చిత్రం 2027లో ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశం ఉంది.

# వారణాసి టైటిల్ సమస్య ఎదుర్కొంటోందా?

ప్రముఖ దర్శకుడు ఎస్.ఎస్. రాజమౌళి, సూపర్‌స్టార్ మహేశ్ బాబు కాంబినేషన్‌లో రానున్న క్రేజీ ప్రాజెక్ట్ 'వారణాసి' పై ప్రపంచవ్యాప్తంగా సినీ ప్రియుల్లో భారీ అంచనాలు నెలకొన్న విషయం తెలిసిందే. 2027లో రాబోతున్న ఈ సినిమా కోసం అందరూ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. అయితే, ఈ సినిమా టైటిల్‌ను ప్రకటించినప్పటి నుంచి సోషల్ మీడియాలో పలు రకాల వార్తలు చక్కర్లు కొడుతున్న విషయం తెలిసిందే. ముఖ్యంగా 'వారణాసి' అనే టైటిల్‌ను తెలుగులో గతంలోనే వేరే నిర్మాణ సంస్థ రిజిస్టర్ చేసుకున్నట్లు పెద్ద ఎత్తున ప్రచారం జరిగింది. తాజాగా ఈ టైటిల్ వివాదం పరిష్కారమైనట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలుస్తోంది. వేరే నిర్మాణ సంస్థ కేవలం తెలుగులో మాత్రమే ఈ టైటిల్‌ను రిజిస్టర్ చేసుకోవడంతో, చిత్ర బృందం తెలుగు వెర్షన్ టైటిల్‌లో స్వల్ప మార్పు చేయాలని నిర్ణయించుకున్నట్లు సమాచారం. ఈ సినిమా పలు భాషల్లో విడుదల కానున్నందున, తెలుగులో మాత్రం 'రాజమౌళి వారణాసి' అనే పేరుతో ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్లు తెలుస్తోంది. ఇతర అన్ని భాషల్లో మాత్రం 'వారణాసి' అనే ఒరిజినల్ టైటిల్‌నే కొనసాగించనున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. దీనిపై చిత్ర యూనిట్ త్వరలో అధికారిక ప్రకటన విడుదల చేసే అవకాశం ఉంది. ఖలేజా సినిమా టైంలో కూడా ఇలా టైటిల్ వివాదం ఎదుర్కోగా.. మేకర్స్ ఆలోచించి మహేశ్ ఖలేజా అనే పేరుతో విడుదల చేయగా.. వివాదం సద్దుమణిగింది.




# రూ.2 లక్షలకు 'అఖండ 2' టికెట్ కొన్న బాలకృష్ణ అభిమాని!

ఎనందమూరి బాలకృష్ణ హీరోగా, బోయపాటి శ్రీను దర్శకత్వంలో రూపొందబోతున్న ప్రతిష్టాత్మక చిత్రం 'అఖండ 2' కోసం అభిమానులు ఏ స్థాయిలో ఎదురుచూస్తున్నారో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ఈ చిత్రం డిసెంబర్ 05న ప్రేక్షకుల ముందుకు రాబోతుండగా.. ఇప్పటికే ఓవర్సీస్‌కి సంబంధించిన అడ్వాన్స్ బుకింగ్స్ స్టార్ట్ అయ్యాయి. అయితే జర్మనీలో నివసిస్తున్న బాలకృష్ణ ఎన్‌ఆర్ఐ అభిమాని ఒకరు ఈ సినిమా టికెట్‌ను ఏకంగా రూ. 2 లక్షలకు కొనుగోలు చేశారు. జర్మనీలోని ఫ్రాంక్‌ఫర్ట్‌కు చెందిన ఎన్‌ఆర్ఐ అభిమాని రాజశేఖర పర్నపల్లి ఈ అసాధారణమైన పని చేసినట్లుగా తెలుస్తోంది. రెండు లక్షల రూపాయలు (రూ. 2,00,000) చెల్లించి మరీ ఆయన 'అఖండ 2' సినిమా టికెట్‌ను కొనుగోలు చేశారు. ఈ విషయాన్ని చిత్రబృందం సోషల్ మీడియా వేదికగా ప్రకటించింది.



# స్పిరిట్‌లో హిందీనటి కాజోల్ నటిస్తుందా?

ప్రభాస్ హీరోగా, దర్శకుడు సందీప్ రెడ్డి వంగా తెరకెక్కిస్తున్న హై-వోల్టేజ్ యాక్షన్ డ్రామా 'స్పిరిట్'. ఈ చిత్రం మెగాస్టార్ చిరంజీవి చేతుల మీదుగా ఇటీవల పూజా కార్యక్రమాలు పూర్తి చేసుకున్న విషయం తెలిసిందే. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ జరుపుకుటుం డగా.. ఈ ప్రాజెక్ట్ గురించి ఇండస్ట్రీలో ఒక ఆసక్తికరమైన వార్త ప్రస్తుతం జోరుగా వినిపిస్తోంది. ఈ ప్రతిష్టాత్మక చిత్రంలో బాలీవుడ్ సీనియర్ స్టార్ హీరోయిన్ కాజోల్ దేవగణ్ కీలక పాత్ర పోషించనున్నట్లు తెలుస్తుంది. 'స్పిరిట్' చిత్రంలో మొదట హీరోయిన్ పాత్ర కోసం బాలీవుడ్ నటి కరీనా కపూర్ పేరు వినిపించినప్పటికీ, ఆమె ఆ రూమర్‌లను ఖండించారు. ఇప్పటికే ఈ చిత్రంలో హీరోయిన్‌గా త్రిప్తి దిమ్రి ఎంపికయ్యారు. తాజాగా అందిన సమాచారం ప్రకారం, 'స్పిరిట్'లో ఒక శక్తివంతమైన పాత్ర కోసం దర్శకుడు సందీప్ రెడ్డి వంగా బాలీవుడ్ నటి కాజోల్‌ను సంప్రదించినట్లు తెలుస్తోంది. కాజోల్‌కి కూడా స్క్రిప్ట్ బాగా నచ్చిందని ఆమె ఈ ప్రాజెక్ట్‌లో భాగమవడానికి పాజిటివ్‌గా స్పందించినట్లు ఇండస్ట్రీ వర్గాలు చెబుతున్నాయి. ఈ వార్త నిజమైతే, 'స్పిరిట్' కాజోల్‌కు మొదటి తెలుగు సినిమా కానుంది. ఆమె ఇంతకుముందు కొన్ని తమిళ చిత్రాలలో నటించినప్పటికీ, తెలుగులో ఇప్పటివరకు నటించలేదు. కాజోల్ లాంటి నటి 'స్పిరిట్' టీంలో చేరితే, ఈ పాన్-ఇండియా ప్రాజెక్ట్‌కు మరింత బలం, క్రేజ్ వస్తుందని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుతం ఈ వార్తపై అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.






# దుమ్మురేపుతున్న .. పేరుగల్ల పెద్దిరెడ్డి ఫోక్ సాంగ్

తెలంగాణ జానపద గాయని, నృత్యకారిణి నాగదుర్గ నుంచి తాజాగా విడుదలైన పాట 'పేరుగల్ల పెద్దిరెడ్డి' ప్రస్తుతం యూట్యూబ్‌లో మరియు సోషల్ మీడియాలో దుమ్మురేపుతోంది. తెలంగాణ ఫోక్ సాంగ్స్‌తో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నాగదుర్గ, ఈ కొత్త పాటతో మరోసారి ప్రేక్షకులను ఆకర్షిస్తున్నారు. పేరుగల్ల పెద్దిరెడ్డి అంటూ వచ్చిన ఈ పాట తండ్రి మీద ప్రేమతో కూతురు చెబుతున్న నేపథ్యంలో ఉంది. పల్లెటూరి వాతావరణాన్ని, జానపద లయను ప్రతిబింబిస్తూ ఈ పాట ఆకట్టుకుంటుంది. ఎప్పటిలాగే, నాగదుర్గ ఈ పాటలో తనదైన శైలిలో చేసిన ఎనర్జిటిక్ డ్యాన్స్ ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంటోంది. శు క్రవారం విడుదలైన ఈ పాట కొద్ది గంటల్లోనే యూట్యూబ్‌లో మిలియన్ల వ్యూస్‌ను సాధిస్తూ ట్రెండింగ్‌లో నిలిచింది. ఫ్లలె జానపద పాటల అభిమానుల మధ్య ఈ పాట క్రేజీ హిట్‌గా మారడంతో నాగదుర్గ ఖాతాలో మరో విజయవంతమైన జానపద పాట చేరింది. ఈ పాటకు బుల్లెట్ బండి లక్ష్మణ్ సాహిత్యం అందించగా.. మమత రమేష్ పాడింది. మదన్ కే సంగీతం అందించాడు.



# కర్నూలు ప్రమాదంపై సిఎం చంద్రబాబు దిగ్భ్రాంతి

**- తక్షణ సహాయక చర్యలకు ఆదేశం**

**- క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని సూచన**



**అమరావతి,నవంబర్29( వెలుతురు):**

కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు మండలం కోటేకల్ వద్ద జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఐదుగురు మృతి చెందడంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విచారం వ్యక్తం చేశారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. మరణించిన వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ మరో ముగ్గురికి అత్యవసర వైద్య సహాయం అందించేందుకు వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఇక.. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు జిల్లా ఎస్పీ, రేంజ్ ఐజీలు హుటాహుటిన ఘటనా స్థలికి చేరుకున్నారు. మృతి చెందిన ఐదుగురు కర్ణాటకలోని కోలార్ జిల్లాకు చెందిన వారిగా గుర్తించారు. మృతుల్లో ఇద్దరు చిన్నారులు ఉన్నట్టు సీఎం చంద్రబాబుకు అధికారులు తెలిపారు. కర్నూలు జిల్లా రోడ్డు ప్రమాదంపై మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆరా తీశారు. కోటేకల్ వద్ద జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంపై దిగ్భ్రాం÷-రతి వ్యక్తం చేశారు. ప్రమాదంలో ఐదుగురు చనిపోవడం.. మృతుల్లో చిన్నారులు ఉండటంపై విచారం వ్యక్తం చేశారు. రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ బాధితులకు మెరుగైన వైద్య సహాయం అందించాలని అధికారులను మంత్రి ఆదేశించారు. ప్రమాదంలో మృతి చెందిన వారికి సంతాపం తెలుపుతూ.. వారి కుటుంబాలకు సానుభూతి తెలియజేశారు. ప్రయాణికులు ప్రయాణ సమయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రయాణికుల భద్రతా ప్రమాణాలపై కఠిన చర్యలు తీసుకునేలా అధికారులకు మరోసారి మంత్రి ఆదేశాలు జారీ చేశారు. రోడ్లపై ప్రయాణికుల నిర్లక్ష్యానికి తావు లేకుండా పర్యవేక్షణ పెంచాలని మంత్రి అచ్చెన్నాయుడు సూచనలు చేశారు. కర్నూలు రోడ్డు ప్రమాద ఘటనపై మంత్రులు టీజీ భరత్, నిమ్మల రామానాయుడు దిగ్భ్రాం÷-రతి వ్యక్తం చేశారు. ప్రమాదంపై అధికారులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని మంత్రులు ఆదేశించారు. ఈ ఘటన జరగడం ఎంతో బాధాకరమని.. మృతుల కుటుంబాలకు మంత్రులు టీజీ భరత్, నిమ్మల రామానాయుడు సంతాపం తెలిపారు.

# సిపిఎం కార్యకర్త హత్యలో కీలక పరిణామం

**- నిందితుడిని పట్టుకునే క్రమంలో పోలీసుల కాల్పులు**

**- నిందితుడితో పాటు హెడ్ కానిస్టేబుల్‌కు గాయాలు**

**- గంజాయి మాఫియా నడపుతున్న మహిళే సూత్రధారిగా గుర్తింపు**



**నెల్లూరు,నవంబర్29( వెలుతురు):**

నెల్లూరులో సంచలనం రేపిన పెంచలయ్య హత్య కేసులో శనివారం కీలక పరిణామం చోటుచేసుకుంది. హత్యకేసు నిందితులని పట్టుకునే క్రమంలో నెల్లూరు రూరల్ పోలీసులు కాల్పులు జరపగా ఈ ఘటనలో నిందితుడితో పాటు, హెడ్ కానిస్టేబుల్‌కి కూడా తీవ్రగాయాలయ్యాయి. దీంతో వీరిని వెంటనే జీజీహెచ్ ఆస్పత్రికి తరలించారు. నెల్లూరు హౌసింగ్ బోర్డు కాలనీలో పెంచలయ్య అనే వ్యక్తి హత్యకు గురైన సంగతి తెలిసిందే. ముసుగులు ధరించిన దాదాపు తొమ్మిది మంది.. పెంచలయ్య స్కూటీపై వెళుతుండగా వెంబడించి దారుణంగా హత్య చేశారు. మృతుడు సీపీఎం ఆర్డీటీ కాలనీ శాఖ సభ్యుడు, ప్రజానాట్య మండలి కళాకారుడు. అయితే, ఈ హత్య చేయించింది ఒక మహిళగా తెలుస్తోంది. కల్లూరుపల్లి హౌసింగ్ బోర్డు కాలనీలో గంజాయి మాఫియాని నడుపుతున్న అరవ కామాక్షమ్మ అనే మహిళ ఈ హత్యకు ప్రధాన సూత్రధారిగా పోలీసులు భావిస్తున్నారు. కామాక్షమ్మ తొమ్మిది సభ్యుల గంజాయి గ్యాంగ్ తో ఒప్పందం కుదుర్చుకుని పెంచలయ్య హత్యకి పురమాయించినట్టు తెలుస్తోంది. నెల్లూరు నగరంలో రెచ్చిపోతున్న గంజాయి గ్యాంగుల అరాచకాలకు ఇది పరాకాష్టగా నిలుస్తోంది. పెంచలయ్య హత్య విషయం తెలిసిన వెంటనే సీపీఎం నేతలు, కార్యకర్తలు భారీగా ప్రభుత్వ ఆసుపత్రి వద్దకు చేరుకుని నినాదాలు చేశారు.

# తిరుమల కల్తీనెయ్యి కేసు

**- మరో 11మందిని నిందతులుగా చేర్చిన అధికారులు**

**తిరుమల,నవంబర్29( వెలుతురు):**



తితిదే కల్తీ నెయ్యి కేసులో సీబీఐ నేతృత్వంలోని సిట్ విచారణ వేగవంతం చేసింది. కేసు నమోదు చేసిన సమయంలో 15 మందిని, ఆ తర్వాత 9 మందిని నిందితులుగా పేర్కొన్న సిట్.. తాజాగా మరో 11 మందిని నిందితులుగా చేరుస్తూ నెల్లూరు ఏసీబీ కోర్టులో మెమో దాఖలు చేసింది. వారిలో ఏడుగురు తితిదే ఉద్యోగులు ఉన్నారు. 2019-2024 మధ్య తితిదే కొనుగోలు విభాగంలో పని చేసిన జీఎంలు, సీనియర్, జూనియర్ అసిస్టెంట్లపై సిట్ కేసులు నమోదు చేసింది. గతంలో జీఎంలుగా పని చేసిన జగదీశ్వర్‌రెడ్డి, మురళీకృష్ణ, ఎస్వీ గోశాల పూర్వ డైరెక్టర్ హరినాథ్‌రెడ్డి ఇందులో ఉన్నారు. దీంతో ఈ కేసులో ఇప్పటివరకు పేర్కొన్న నిందితుల సంఖ్య 35కి చేరింది. వారిలో 10 మందిని అరెస్టు చేశారు.

# కర్నాటకలో మళ్లీ రాజకీయ సెగ

**- కాంగ్రెస్ అధిష్టానం ఆదేశంతో సిద్దుతో డికె భేటీ**

**- ఇరువురు నేతలు బ్రేక్‌ఫాస్ట్ చర్చలు**

**- 2028లో గెలుపు కోసం చర్చించామని వెల్లడి**



**బెంగళూరు,నవంబర్29( వెలుతురు):**

కర్ణాటక సీఎం కుర్చీ కోసం సమరం వేళ కాంగ్రెస్ అధిష్ఠానం ఆదేశాల మేరకు ముఖ్యమంత్రి సిద్ధరామయ్య , ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌లు శనివారం బ్రేక్‌ఫాస్ట్ చేసేందుకు ఒక్కచోట కలిశారు. ఇక్కడ ఇద్దరు నేతల మధ్య సయోధ్య కుదిర్చేందుకు కాంగ్రెస్ నానా తంటాలు పడుతోంది. ఎట్టకేలకు కర్నాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఆ రాష్ట్ర డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ మధ్య శనివారం ఉదయం బ్రేక్‌ఫాస్ట్ మీటింగ్ జరిగింది. దీనికి సంబంధించి డీకే శివకుమార్ ఎక్స్‌లో పోస్ట్ కూడా చేశారు. ఉదయం బెంగళూరులోని కావేరి నివాసంలో అల్పాహార సమావేశం కోసం ముఖ్యమంత్రి సిద్ధరామయ్యను కలిశానని డీకే చెప్పారు. కర్ణాటక ప్రాధాన్యతలు, ముందుకు సాగాల్సిన మార్గాలపై ఫలప్రదమైన చర్చ జరిగిందని వెల్లడించారు. అయితే, డీకే శివకుమార్ తన ఎక్స్ సందేశంలో



తెలుపనప్పటికీ సీఎం సిద్ధరామయ్యతో టీపార్టీ మీటింగ్ ముఖ్యంగా రొటేషనల్ సీఎం ఒప్పందంపై చర్చించుకునేందుకే నన్నది అందరికీ తెలిసిన విషయమే. కాంగ్రెస్ అధిష్టానం ఆదేశాల మేరకే ఇరువురు నేతలు టీపార్టీ మీటింగ్ పేరిట కలుసుకుని మాట్లాడుకున్నట్టు సమాచారం. ఇలా ఉండగా, 2023లో కర్నాటకలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత, ఎవరు రాష్ట్రానికి సీఎం కావాలన్న ప్రశ్న ఉదయించింది. అయితే, అధిష్టానం సూచన మేరకు ఇరువురు నేతలు రొటేషనల్ ఒప్పందం ప్రకారం ముఖ్యమంత్రిగా వ్యవహరించలన్న ఒప్పందం జరిగింది. దీంతో సిద్దారామయ్య సిఎంగా, శివకుమార్ డిప్యూటీగా నియమితులయ్యారు. ఇప్పుడు, ఆయా కాలం పూర్తయ్యే సమయంలో, ఈ ఒప్పందం మళ్లీ తెరమీదకి వచ్చింది. ప్రజల ఎన్నికల తీర్పు ప్రకారం 2028 వరకు పూర్తి కాలంపాటు సీఎంగా వ్యవహరిస్తానని సీఎం సిద్ధరామయ్య పలు సందర్భాల్లో వ్యాఖ్యనించారు. అయితే, అదే సమయంలో పార్టీ హై కమాండ్ నిర్ణయానికి కట్టుబడి ఉంటానని చెప్పుకొస్తున్నారు. దీంతో ఈ ఇప్పుడు ఈ అంశం మీద అందరి దృష్టి పడింది. మరోవైపు, ఢిల్లీలో సోనియా గాంధీ, మల్లికార్జున్ ఖర్గే, రాహుల్ గాంధీలతో స్ట్రాటజీ గ్రూప్ సమావేశం జరగనుంది. ఈ సమావేశానికి ఇరువురు నేతలు హాజరయ్యే అవకాశం ఉంది. ఈ సమావేశంలో పార్టీ అధిష్టానం తీసుకునే నిర్ణయం కర్నాటక రాజకీయాల్ని కొత్త మలుపు తిప్పవచ్చు. దీంతో వీరి భేటీకి ప్రాధాన్యం ఏర్పడింది. కెసి వేణుగోపాలు ఆదేశంతో తాము ఇద్దరం భేటీ అయ్యామని డిప్యూటి సిఎం డికె శివకుమార్ చెప్పారు. తాము 2028 ఎన్నికల గురించి చర్చించామని సిఎం సిద్ధరమాయ్య అన్నారు. ఈ భేటీ అనంతరం సిద్ధరామయ్య మీడియాతో మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. తమ మధ్య గతంలో ఎలాంటి భేదాభిప్రాయాలు లేవని.. ఇకముందు కూడా ఉండబోవని స్పష్టంచేశారు. కేసీ వేణుగోపాల్ సూచనల మేరకు తాము బ్రేక్‌ఫాస్ట్ భేటీలో పాల్గొన్నామని.. కానీ ఏ విషయం పైనా చర్చించలేదని తెలిపారు. నెల రోజుల ముందు నుంచి అందరిలో ఉన్న గందరగోళానికి తెరదించేందుకే ఈ బ్రేక్‌ఫాస్ట్ భేటీ జరిగిందన్నారు. భాజపా-జేడీఎస్ తమపై అసత్య ప్రచారాలు చేస్తోందని సిద్ధరామయ్య దుయ్యబట్టారు. ప్రతిపక్షాల అసత్య ప్రచారాలను తాను, డీకే ఉమ్మడిగా ఎదుర్కొంటామని అన్నారు. ప్రస్తుతం తమ పార్టీ 2028 ఎన్నికలు, స్థానిక ఎన్నికల పైనే ప్రధానంగా దృష్టిసారించినట్లు తెలిపారు. 2028లో కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా పని చేస్తామన్నారు. కర్ణాటక ప్రజల మద్దతుతో రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని.. వారికిచ్చిన వాగ్దానం ప్రకారం తాను సిద్ధరామయ్యతో కలిసి పని చేస్తానని డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ పేర్కొన్నారు. తాము పార్టీకి విశ్వాసపాత్రులైన సైనికుల్లా పని చేస్తున్నామని.. హైకమాండ్ ఏం చెప్పినా.. దానిని అందరం అనుసరిస్తామని స్పష్టంచేశారు. ప్రస్తుతం పార్టీ పలు సమస్యలు ఎదుర్కొం టోందని.. 2028లో రానున్న కర్ణాటక ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామన్నారు. నాయకత్వం విషయంలోనూ హైకమాండ్ నిర్ణయమే ÷నైల్ అని పేర్కొన్నారు. సీఎం సిద్ధరామయ్యతో జరిగిన భేటీలో రాబోయే అసెంబ్లీ సమావేశం సహా పలు విషయాలపై చర్చలు జరిపినట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండున్నరేళ్లు పూర్తిచేసుకున్న సందర్భంగా ముఖ్యమంత్రి మార్పు గురించి ఊహాగానాలు వినిపిస్తున్న విషయం తెలిసిందే. రెండున్నరేళ్ల తర్వాత ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌కు సీఎం బాధ్యతలు అప్పగించేలా అప్పట్లో ఓ ఒప్పందం కుదిరిందని ప్రచారం జరుగుతోంది. పార్టీ దీనిని పదే పదే ఖండిస్తున్నా.. ఈ అంశం రాజకీయ చర్చకు కేంద్రంగా మారింది. ఈ నేపథ్యంలోనే పార్టీ హైకమాండ్ సూచనల మేరకు సిద్ధూ, డీకే నేడు ఒక్కచోట సమావేశమయ్యారు.







Edited, Printed, Published and Owner by BAKKA YADAIAH, Published & Printed at SRI SHANTHI PUBLICATIONS H.No. 7-2-31/221/2, S.V. Colony, Bairamalaguda, Saroornagar, Mdl.R.R. DIST, Telangana-79. EDITORG BAKKA YADAIAH, R.N.I. TEL TEL /2019 / 78609. Cell:91773 87328, Email: velthurunewspaper@gmail.com